2.68 లక్షల మంది.. రూ.182.74 కోట్లు

నేడు అన్నదాత సుఖీభవ పథకం నగదు జమ

తూర్పువీరాయపాలెంలో ప్రారంభించనున్న సీఎం



ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా అన్నదాత సుఖీభవ పథకానికి శనివారం నుంచి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 46.85 లక్షల మంది రైతులకు పథకం వర్తించనుంది. జిల్లాలో 2,68,165 మందిని అర్హులుగా గుర్తించారు. ఏడాదికి రూ.20వేల నగదును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు మూడు విడతలుగా జమచేయనున్నారు. మొత్తం రూ.20వేలలో కేంద్రం పీఎం కిసాన్ పథకం కింద రూ.6వేలు, రాష్ట్రప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.14వేలు ఇస్తున్నాయి. అందులో తొలివిడత కేంద్రం రూ.2వేలు, రాష్ట్రం రూ.5వేలు వెరసి రూ.7వేలను శనివారం జమ చేయనున్నాయి. తొలివిడత జిల్లాలో 2,68,165 మంది రైతులకు రూ.182.74కోట్లు నగదు జమకానుంది. అందులో రాష్ట్రప్రభుత్వం నుంచి రూ.134.08 కోట్లు, కేంద్రం నుంచి రూ.48.66 కోట్లు అందనున్నాయి. ఇదిలా ఉండగా లబ్ధిదారులు జిల్లాలో అత్యధికంగా దర్శి నియోజకవర్గంలో ఉన్నారు. అందువల్ల దర్శి మండలం తూర్పువీరాయపాలెం నుంచి ఈ పథకాన్ని సీఎం చంద్రబాబు శనివారం ప్రారంభించనున్నారు.

నియోజకవర్గం	అర్హులైన రైతులు	అందనున్న నగదు (రూ. కోట్లలో)
దర్శి	42,871	29.07
గిద్దలూరు	37,649	25.86
కనిగిరి	42,302	28.74
కొండపి	36,808	25.00
మార్కాపురం	32,965	22.56
ఒంగోలు	9,260	6.22
సంతనూతలపాడు	27,036	18.75
యర్రగొండపాలెం	39,274	26.33
మొత్తం	2,68,165	182.74


వెలిగొండ మొదటి సొరంగం

జిల్లా సమగ్రాభివృద్ధి సాధనకు ప్రాజెక్టులు ప్రధానం. మౌలిక వసతులు, ఉపాధి కల్పన కూడా కీలకమే. ఆ దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది. జిల్లాకే ప్రాణప్రదమైన వెలిగొండను పూర్తిచేయడంతోపాటు దాని ఆధారంగా అన్ని ప్రాంతాలకు కృష్ణా జలాలను తరలించేలా సమగ్ర కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉంది. మరోవైపు ఒకప్పుడు పాడి రైతులకు బాసటగా నిలిచిన ఒంగోలు డెయిరీని పునరుద్ధరించే చర్యలను ప్రభుత్వం తీసుకోవాల్సి ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో చంద్రబాబు, యువగళం పాదయాత్రలో యువనేత లోకేష్ వాటిని పూర్తిచేస్తామని హామీలు ఇచ్చారు. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ అమలును ప్రారంభించేందుకు శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఆర్థికాభివృద్ధికి ఉపకరించేలా సమగ్ర నీటి పారుదల ప్రణాళిక, ఒంగోలు డెయిరీ పునరుద్ధరణపై సీఎం స్పష్టత ఇస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు. సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు వ్యవసాయం, పాడిపరిశ్రమ రంగాలకు పూర్తి భరోసా ఇవ్వాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

ఆశాదీపం

సమగ్ర నీటిపారుదల ప్రణాళికతోనే భవిష్యత్

- వ్యవసాయం, పాడి పరిశ్రమకు నీరే ప్రధానం
- గ్రామీణ ప్రజలకు ఆ రెండింటితోనే ఉపాధి
- వెలిగొండ పూర్తి, డెయిరీ పునరుద్ధరణ కీలకం
- మైక్రో ఇరిగేషన్‌తోనూ ఎంతో మేలు
- శ్రీశైలం నుంచి వెలిగొండకు అక్కడి నుంచి గుండ్లకమ్మతో సహా ఇతర ప్రాంతాలకు
- గోదావరి-బనకచర్ల తరహాలో జిల్లాలోని నీటి వనరుల అనుసంధానం అవశ్యం
- రెండేళ్ల క్రితం ప్రాజెక్టులపై యుద్ధభేరి వర్క్‌షాపులో హామీ ఇచ్చిన చంద్రబాబు
- నేడు దర్శిలో అన్నదాత సుఖీభవ ప్రారంభం
- హాజరుకానున్న ముఖ్యమంత్రి, మంత్రులు

ఒంగోలు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అత్యధిక శాతం ప్రజానీకానికి వ్యవసాయం, పాడి పరిశ్రమే ప్రధాన ఉపాధి మార్గాలు. అవసరమైన మేర వర్షాలు కురవక, తగినంతగా సాగునీటి సౌకర్యం లేక గ్రామీణులు నష్టపోతున్నారు. ప్రతి ఐదేళ్లలో కనీసం రెండేళ్లు వర్షాభావం, కరువు ఆ రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో గ్రామీణ ప్రాంత వ్యవసాయ కుటుంబాల పరిస్థితి తల్లకిందులవుతోంది. జిల్లాలో విస్తారంగా వనరులు ఉన్నప్పటికీ వాటికి నీరు చేరేలా, చేరిన నీటిని పొలాలకు మళ్లించే క్రమపద్ధతి చర్యలు లేవు. దీంతో భారీవర్షాలు కురిసిన సమయంలో అధికశాతం నీరు వాగులు, వంకల ద్వారా సముద్రంపాలవడం, వర్షాలు లేనప్పుడు కరువు బారిన పడటం షరామామూలైంది. దీని నుంచి బయటపడి వ్యవసాయం, పాడి పరిశ్రమను రక్షించుకోవాలంటే జిల్లాలో నీటి వనరులన్నింటినీ ప్రతిపాదిత గోదావరి-బనకచర్ల తరహాలో అనుసంధానం చేయగలిగితే భవిష్యత్‌లో జిల్లా నుంచి కరువును పారదోలే అవకాశం ఉంది. ఇందులో వెలిగొండ ప్రాజెక్టు కీలకం కానుంది. ప్రస్తుత జిల్లాలో అత్యధిక భాగం పశ్చిమ ప్రాంతం కాగా వెయ్యి అడుగుల లోతున వేసిన బోర్లలో సైతం నీరు రాని పరిస్థితి. ప్రధాన సాగునీటి వనరులు ఆ ప్రాంతంలో లేక వర్షాలపైనే సాగుకు ఆధారపడుతున్నారు. అలాగే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పరిస్థితిని పరిశీలిస్తే ప్రధాన సాగునీటి వనరుగా సాగర్‌కాలువ

మిగతా 4వ పేజీలో


మూతపడిన ఒంగోలు డెయిరీ

సీఎం పర్యటన షెడ్యూల్ ఇదీ..

- సీఎం చంద్రబాబు శనివారం ఉదయం 10 గంటలకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరుతారు.
- ఉదయం 10.35 నుంచి 10.45 మధ్య దర్శి మండలం తూర్పువీరాయపాలెం సమీపంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి కారులో 10.50కు అన్నదాత సుఖీభవ కార్యక్రమ వేదిక వద్దకు వస్తారు.
- 11 నుంచి 1.15 గంటల వరకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం అమలు సందర్భంగా రైతులతో ముఖాముఖిలో పాల్గొంటారు.
- మధ్యాహ్నం 1.15 నుంచి 1.45 వరకు సీఎం సమయం రిజర్వు చేశారు.
- 1.50 నుంచి 2.50 గంటల వరకు కార్యకర్తల సమావేశంలో మాట్లాడి దిశానిర్దేశం చేస్తారు.
- 2.50 గంటలకు రోడ్డుమార్గాన బయల్దేరి 2.55కు హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు
- 3 గంటలకు హెలికాప్టర్‌లో ఇక్కడ నుంచి బయల్దేరి 3.40 గంటలకు ఉండవల్లి చేరుకుంటారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

- నూతన హెలిప్యాడ్‌ను సిద్ధంచేసిన అధికారులు
- సర్వాంగ సుందరంగా కార్యకర్తల సమావేశం వేదిక
- పొలాల్లో పైర్ల మధ్య మంచాలపై రైతులతో ముఖాముఖి


రైతులతో ముఖాముఖి కోసం తూర్పువీరాయపాలెం వద్ద పొలాల్లో ఏర్పాటు చేసిన నులక మంచాలు

దర్శి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు పర్యటనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో కీలకమైన అన్నదాన సుఖీభవ పథకాన్ని దర్శి మండలం తూర్పువీరాయపాలెం వద్ద సీఎం చంద్రబాబు శనివారం ప్రారంభిస్తున్న విషయం విదితే. ఈ నేపథ్యంలో అక్కడ మూడు కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆ ప్రకారం సీఎం చంద్రబాబు తూర్పువీరాయపాలెం గ్రామం వద్ద రైతులతో ముఖాముఖిలో పాల్గొంటారు. అక్కడే అన్నదాత సుఖీభవ నిధులను విడుదల చేస్తారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో పాల్గొని దిశానిర్దేశం చేస్తారు. చుట్టుపక్కల ఉన్న పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడతారు. సీఎం పర్యటన సుమారు నాలుగు గంటలపాటు సాగనుంది. ఈ నేపథ్యంలో మంత్రులు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, రవికుమార్, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్ నిరంతరం ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు. జిల్లా యంత్రాంగమంతా దర్శిలో ఉండి ఏర్పాట్లలో నిమగ్నమైంది. సీఎం కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి శ్రేణులు, ప్రజలు అధికసంఖ్యలో తరలివస్తున్నారు. అందుకు అనుగుణంగానే భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. దర్శి-తూర్పుగంగవరం రోడ్డులో తూర్పువీరాయపాలెం గ్రామానికి సమీపంలో నూతనంగా హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. అక్కడికి కొద్దిదూరంలో సమావేశం నిర్వహిస్తారు. గ్రామం వద్ద పొలాల్లో పచ్చని పైర్ల మధ్య రైతులతో ముఖాముఖికి ఏర్పాట్లు చేశారు. సీఎం, రైతులు కూర్చునేందుకు ప్రత్యేకంగా నులకమంచాలు తెప్పించారు.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు స్వామి, రవికుమార్


సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు డోలా, గొట్టిపాటి, డాక్టర్ లక్ష్మి, లలిత్‌సాగర్ తదితరులు

దర్శి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటన సాగే ప్రదేశాన్ని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్ శుక్రవారం పరిశీలించారు. తొలుత హెలిప్యాడ్‌ను సందర్శించారు. అక్కడ పరిసరాలను పర్యవేక్షించారు. అనంతరం కార్యకర్తల సమావేశం కోసం ఏర్పాటు చేసిన వేదికను పరిశీలించారు. అక్కడ నిర్వాహకులకు వారు పలు సూచనలు చేశారు. అక్కడి నుంచి రైతులతో సీఎం ముఖాముఖి నిర్వహించే వేదిక ప్రదేశానికి చేరుకున్నారు. ఏర్పాట్లను చూసి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు, ఎమ్మెల్యేలు ఉగ్రనరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, వ్యవసాయ మిషన్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిలతో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష చేశారు. ప్రణాళికాబద్ధంగా కార్యక్రమం పూర్తిస్థాయిలో విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. సీఎం హెలిప్యాడ్ వద్దకు చేరుకోగానే అక్కడ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అందరినీ అందుబాటులో ఉంచే విధంగా ఆలోచన చేస్తున్నారు. రైతులతో ముఖాముఖి కార్యక్రమం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కార్యకర్తల సమావేశానికి ఎంతమందిని పంపాలన్న విషయంపై చర్చించారు.

పటిష్ట చర్యలు : ఎస్పీ దామోదర్

సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, రైతులతో ముఖాముఖి , కార్యకర్తల సమావేశం వేదికలను ఎస్పీ ఏఆర్.దామోదర్ శుక్రవారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పర్యటన ప్రశాంతంగా పూర్తయ్యేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 800 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. డ్రోన్, సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘాను ఉంచినట్లు వివరించారు. సీఎం పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట దర్శి టీడీపీ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, రాష్ట్ర వ్యవసాయ మిషన్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, దర్శి, ఒంగోలు, మార్కాపురం డీఎస్పీ బి.లక్ష్మీనారా యణ, రావిపాటి శ్రీనివాసరావు, యు.నాగరాజు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, దర్శి, త్రిపురాంతకం సీఐలు వై.రామారావు, హసన్ తదితరులు ఉన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

సర్పంచ్‌కు 15.. వార్డులకు 39

కొండపి పంచాయతీకి చివరి రోజు భారీగా నామినేషన్లు


సర్పంచ్ పదవికి నామినేషన్ పత్రాన్ని సమర్పిస్తున్న అభ్యర్థి

కొండపి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : కొండపి గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ శుక్రవారంతో ముగిసింది. చివరి రోజు భారీగా దాఖలయ్యాయి. సర్పంచ్ పదవికి 15, మొత్తం 14 వార్డులకు 39 మంది నామినేషన్లు వేశారు. అభ్యర్థుల నుంచి గ్రామ సచివాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.రవికుమార్ నామినేషన్లను స్వీకరించారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన ఉంటుందని రవికుమార్ తెలిపారు. కార్యక్రమాన్ని ఇన్‌చార్జి ఎంపీడీవో పి.రామకృష్ణ పర్యవేక్షించారు. రిటర్నింగ్ స్టేజ్-2 అధికారి బి.ప్రసాదరావు, ఈవోఆర్డీ అంజలీదేవి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉన్నం రామ్మోహన్ పాల్గొన్నారు. సర్పంచ్ ఎస్సీ మహిళకు రిజర్వు కాగా 15 మంది నామినేషన్లు వేశారు. వీరిలో టీడీపీ మద్దతుదారులతోపాటు, వైసీపీ మద్దతుదారులు ఉన్నారు. కాంగ్రెస్ మద్దతుతో ఒకరు నామినేషన్ వేశారు. సర్పంచ్ పదవికి నామినేషన్లు దాఖలు చేసిన వారిలో పందిటి కుమారి, యనమద్ని అరుణ, అల్లడి సుశీల, కొమ్ము మధులిక, కొమ్ము సుశీల, యనమద్ని పూజ, ఎదురు సురేఖ, యనమద్ని పద్మావతి, పల్లె మేరి, అడ్డగబొట్టు విమలమ్మ, యనమద్ని వసంత, యనమద్ని కొండమ్మ, యనమద్ని మౌనిక, యనమద్ని కల్యాణి, కొమ్ము సంధ్యారాణి ఉన్నారు.

సందడిగా పింఛన్‌ల పంపిణీ

- ఈసారి కొత్తగా స్పౌజ్ పింఛన్‌లు అందజేత
- అందుకోసం సభలు, సమావేశాలు
- రెగ్యులర్ లబ్ధిదారులకు ఇళ్ల వద్దనే పంపిణీ
- పలుచోట్ల ముఖ్యప్రజాప్రతినిధులు హాజరు
- సింగరాయకొండ, చిమటలో పాల్గొన్న మంత్రి స్వామి


లబ్ధిదారుకు పింఛన్ సొమ్మును అందజేస్తున్న మంత్రి స్వామి

ఒంగోలు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : సామాజిక పింఛన్‌ల పంపిణీ శుక్రవారం జిల్లావ్యాప్తంగా సందడిగా సాగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో నెలనెలా 2,84,966 మందికి రూ.124.98 కోట్ల నగదును పింఛన్‌గా అందిస్తోంది. వారితోపాటు ఈనెలలో కొత్తగా 5,174 మందికి స్పౌజ్ పింఛన్‌లు మంజూరయ్యాయి. పింఛన్ పొందుతున్న భర్త మరణిస్తే దాన్ని భార్యకు ఇస్తోంది. రెగ్యులర్ పింఛన్ నగదును ఎప్పటిలాగే ఇళ్లకు వెళ్లి సిబ్బంది పంపిణీ చేశారు. స్పౌజ్ పింఛన్‌ను లబ్ధిదారులను మాత్రం ఒకచోటకు చేర్చి సభలు, సమావేశాలు నిర్వహించి అందించారు. ఉదయం 7 గంటల నుంచి పంపిణీ ప్రారంభం కాగా 11 గంటలకే 80శాతం మందికి అందించారు. సాయంత్రం ఐదు గంటలకు జిల్లాలో 90.60శాతం మందికిపైగా లబ్ధిదారులకు పింఛన్‌ల పంపిణీ పూర్తిచేశారు. అందుబాటులో లేని వారికి తర్వాత ఇవ్వనున్నారు. రాష్ట్రమంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి సింగరాయకొండలో జరిగిన స్పౌజ్ పింఛన్‌ల పంపిణీ సభలోనూ, మర్రిపూడి మండలం చిమట గ్రామంలో రెగ్యులర్ పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ చీమకుర్తి, మద్దిపాడులలో పాల్గొన్నారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కనిగిరి పట్టణంలో స్పౌజ్ పింఛన్లు, కనిగిరి, హెచ్‌ఎంపాడు మండలాల్లో రెగ్యులర్ పింఛన్‌లను పంపిణీ చేశారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంతోపాటు రూరల్ మండలం, కేకేమిట్ల మండలాల్లో, పొదిలి నగర పంచాయతీలో పాల్గొన్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి గిద్దలూరు పట్టణంలో, దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి దర్శి పట్టణంలో పింఛన్లు పంపిణీ చేశారు. వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు దోర్నాలలో పాల్గొన్నారు. ఇతర ప్రాంతాల్లో స్థానిక అధికారులు, టీడీపీ నాయకులు ఉత్సాహంగా పింఛన్‌లను పంపిణీ చేశారు.

రేషన్ పంపిణీ ప్రారంభం

- తొలిరోజు 31శాతం మందికి అందజేత

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శుక్రవారం నుంచి రేషన్ పంపిణీ ప్రారంభమైంది. తొలి రోజు 31శాతం మంది కార్డుదారులకు సరుకులు అందజేశారు. జిల్లాలో 1,392 రేషన్ దుకాణాల పరిధిలో 6.61 లక్షల మంది కార్డుదారులు ఉన్నారు. వీరికి గత రెండు నెలల నుంచి రేషన్ షాపుల ద్వారానే బియ్యం, పంచదార అందజేస్తున్నారు. ఆగస్టు నెలకు సంబంధించిన సరుకుల పంపిణీ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. జిల్లాలోని అన్ని రేషన్ షాపుల వద్ద సందడి వాతావరణం నెలకొంది. పాత పద్ధతిలోనే కూటమి ప్రభుత్వం పారదర్శకంగా సరుకుల పంపిణీకి చర్యలు తీసుకోవడంతో కార్డుదారులు తమకు అనుకూలమైన సమయంలో వెళ్లి తీసుకుంటున్నారు. ప్రభుత్వం 1వతేదీ నుంచి 15వతేదీ వరకు రెండు పూటలా రేషన్ పంపిణీకి అవకాశం కల్పించినా అనేక ప్రాంతాల్లో వారం పది రోజుల్లోనే ఈ ప్రక్రియ పూర్తవుతోంది.



శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా ఒంగోలులోని ప్రసన్న చెన్నకేశవ స్వామి ఆలయంలోని రాజ్యలక్ష్మి అమ్మవారికి ప్రాకారోత్సవం నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి అమ్మవారిని ఆలయం చుట్టూ ఊరేగించారు. - ఆంధ్రజ్యోతి, ఒంగోలు



పమిడిపాడు హైస్కూల్‌లో విద్యార్థులకు భోజనంలో మజ్జిగ పోస్తున్న రిటైర్డ్ ప్రొఫెసర్ జాగర్లమూడి వెంకటేశ్వర్లు

విద్యార్థులకు రోజూ మజ్జిగ

మేదరమెట్ల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ మధ్యాహ్నం భోజనం అందిస్తోంది. వారికి పెరుగు, మజ్జిగను ప్రభుత్వం ఇవ్వడం లేదు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో పమిడిపాడు గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ జాగర్లమూడి వెంకటేశ్వర్లు పాఠశాల విద్యార్థులకు రోజూ భోజనంలో మజ్జిగ అందించడానికి ముందుకు వచ్చారు. పాఠశాల నడిచిన ప్రతిరోజూ విద్యార్థులకు సరిపడా పాలను ఆయన పంపిస్తున్నారు. మధ్యాహ్న భోజన సిబ్బంది వాటిని మజ్జిగా మార్చి విద్యార్థులకు అందిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొంతు అంజయ్య తెలిపారు.

ఆశాదీపం

(3వ పేజీ తరువాయి)

ఉండగా పర్చూరు ప్రాంతంలో కృష్ణా, పశ్చిమ కాలువలు, దక్షిణ ప్రాంతంలో రాళ్లపాడు, ఒంగోలు సమీపంలో గుండ్లకమ్మ వంటి వనరులు ఉన్నాయి.

భారీగా పడిపోయిన సాగు విస్తీర్ణం

ఉమ్మడి జిల్లా పరిధిలో సాగర్ ఆయకట్టులో 4.34లక్షల ఎకరాల విస్తీర్ణం ఉండగా కృష్ణా పశ్చిమకాలువ పరిధిలో 72వేల ఎకరాలు, గుండ్లకమ్మ కింద 80వేల ఎకరాలు, ఐదు మధ్యతరహా ప్రాజెక్టుల కింద 43వేల ఎకరాలు, మరో 953 చిన్ననీటి చెరువుల కింద లక్షా 35వేల ఎకరాలు, రెండు వందలకుపైగా ఉన్న ఎత్తిపోతల పథకాల కింద మరో లక్షా 40వేల ఎకరాల విస్తీర్ణం ఉంది. అయితే ఒక్క ఏడాది పూర్తిస్థాయిలో ఆయకట్టుకు కాదుకదా సగం విస్తీర్ణానికి కూడా ఆ నీరు అందుతున్న పరిస్థితి లేదు. మాగాణి సాగు అయితే నాల్గో వంతు కూడా ఉండటం లేదు. ఎక్కువ భాగంలో వాణిజ్య, వ్యాపార పంటలను రైతులు వర్షాధారంగా సాగు చేస్తున్నారు. సాగర్‌కాలువలు, అలాగే కృష్ణా పశ్చిమ కాలువ కింద చివరి ప్రాంతంలో జిల్లాలోని భూములు ఉండటంతో అవసరమైన మేర నీరు రావడం లేదు.

పాడి పరిశ్రమ కుదేలు

లెక్కల్లో ఉమ్మడి జిల్లాలో 4.34లక్షల ఎకరాల ఆయకట్టు సాగర్ కాలువల కింద ఉన్నప్పటికీ దాదాపు లక్షన్నర ఎకరాలకు ఏనాడు నీరు అందడం లేదు. మిగిలిన విస్తీర్ణంలో లక్ష ఎకరాల్లో కూడా మాగాణి సాగు చేయలేని పరిస్థితి. గత ఏడాది సాగర్ కాలువల కింద 2.75 లక్షల ఎకరాల్లో సాగు చేయగా 85వేల ఎకరాల్లో మాత్రమే అది కూడా దర్శి, అద్దంకి నియోజకవర్గాల్లోనూ, కొంతమేర వైపాలెం పరిధిలోని త్రిపురాంతకం, ఎస్ఎన్‌పాడు పరిధిలోని చీమకుర్తి ఇతరత్రా కొద్దిచోట్ల మాత్రమే సాగు జరిగింది. కృష్ణా పశ్చిమ కాలువ పరిస్థితి కూడా అలాగే ఉంది. దీంతో తిండి గింజలు, పశువుల మేతకు గ్యారంటీ ఉండటం లేదు. జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు వ్యవసాయం తర్వాత ఆసరాగా నిలిచే పాడిపరిశ్రమ కూడా తీవ్రంగా దెబ్బతింది. పాడిరైతులకు బాసటగా నిలిచే ఒంగోలు డెయిరీని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా మూతవేయడంతో ప్రైవేటు డెయిరీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వచ్చి మరింత ఇబ్బందిపడుతున్నారు.

బనకచర్లపైనే ఆశలు

సాగు, తాగునీటి వెతలు తీర్చేందుకు చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టు మొత్తం జిల్లాకు ఆశాదీపంగా కనిపిస్తోంది. నల్లమల అటవీ సమీపంలో 53.50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు పనులు మూడొంతులకుపైగా పూర్తయ్యాయి. శ్రీశైలం నీటిమట్టం 843 అడుగుల నుంచే ప్రాజెక్టుకు నీటిని తీసుకునే అవకాశం కల్పించడంతోపాటు ప్రభుత్వం తాజాగా ప్రతిపాదించి విస్తృత కసరత్తును చేస్తున్న గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు వెలిగొండకే కాక జిల్లాకు వరం కానుంది. బనకచర్ల ఆచరణ రూపుదాల్చితే కృష్ణానదిపై శ్రీశైలం దిగువన ఉన్న ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టు భూములకు గోదావరి జలాలను వాడుకునే అవకాశం ఉంటుంది. దాని వల్ల ఆ మేర కృష్ణానీటిని శ్రీశైలం ఎగువన ఉన్న ప్రాజెక్టులకు ఇవ్వవచ్చు. అందులో వెలిగొండకు కూడా లబ్ధి చేకూరుతుంది. ప్రాజెక్టు డిజైన్ ప్రకారం వెలిగొండకు కృష్ణాలో నెలరోజులపాటు వరద జలాలు ఉంటేనే నింపుకోవచ్చు. అయితే బనకచర్ల ప్రాజెక్టు రూపుదాల్చితే శ్రీశైలంలో ఎక్కువ రోజులు వెలిగొండకు నీరు తీసుకునే 843 అడుగుల నీటిమట్టం కన్నా అధికంగా నీరు నిల్వ ఉంటుంది. అలాంటప్పుడు ఎక్కువ రోజులు వెలిగొండకు నీటిని తీసుకోవచ్చు. ఆ నీటిని వెలిగొండ ద్వారా జిల్లాలోని ఇతర వనరులకు సరఫరా చేయవచ్చు.

గుండ్లకమ్మకు పుష్కలంగా నీరు

ప్రధానంగా వెలిగొండ ప్రాజెక్టుకు దిగువ ప్రాంతంలో గుండ్లకమ్మ ప్రవహిస్తుండటంతో ఆ నదికి వెలిగొండ నుంచి కృష్ణాజలాలను మళ్లించవచ్చు. దాని వల్ల గుండ్లకమ్మలో పుష్కలంగా నీటి ప్రవాహం ఉండి దిగువన ఉన్న ప్రాజెక్టు ఆయకట్టుతోపాటు వాటి పరిధిలో ఉన్న స్కీంలు, ఇతర వనరులకు నీరు ఇవ్వవచ్చు. అలాగే గుండ్లకమ్మ నీటిని ముసికి కూడా మళ్లించి కొండపి నియోజకవర్గంతోపాటు పొదిలి, సంతనూతలపాడు మండలాల్లోని గ్రామాల్లో ఉన్న వనరులకు పంపించవచ్చు. అలాగే వెలిగొండ పశ్చిమ కాలువ నుంచి దిగువ ప్రాంతాలైన గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల భూములతోపాటు ఆ ప్రాంతంలోని వాగులు, వంకల ద్వారా రాళ్లపాడు ప్రాజెక్టు, మోపాడు రిజర్వాయర్‌తోపాటు చిన్న,పెద్ద చెరువులకు.. పాలేరు, మన్నేరు నదులకు నీరు వెళ్లేలా చేసే అవకాశం ఉంది. అలాగే సాగర్ కాలువలకు సక్రమంగా నీటి సరఫరా జరిగితే ఆ పరిధిలోని ఆయకట్టుకు ఢోకా లేకుండా ఇవ్వడంతోపాటు ఇటు వెలిగొండ, అటు సాగర్ నీరు రెండింటినీ అవకాశం ఉన్న ప్రాంతాల నుంచి గతంలో ప్రతిపాదించి వదిలేసిన సాగర్ రెండో దశ ప్రాంతానికి కూడా నీటిని తరలించే అవకాశాలు ఉన్నాయి.

సమగ్ర ప్రణాళిక ఉంటేనే..

జిల్లాలోని అన్ని ప్రాంతాలకు కృష్ణా జలాలను తరలించేందుకు సమగ్ర నీటి పారుదల కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ఆచరణలో అమలు చేయాలి. అందులో వెలిగొండ పూర్తి అన్నది మరింత కీలకాంశం. ఈ విషయమై 2023 ఆగస్టు తొలివారంలో గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్ద నాడు టీడీపీ అధ్యక్షుడిగా చంద్రబాబునాయుడు ప్రాజెక్టులపై యుద్ధభేరి పేరుతో నిర్వహించిన వర్క్‌షాపులో విస్తృత చర్చ జరిగింది. ఆ సందర్భంగా జిల్లాలోని నీటిపారుదల రంగంపై అధికారంలోకి వచ్చాక సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అమలుకు ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు. కీలకమైన వెలిగొండ పూర్తిచేయడంతోపాటు దాని ఆధారంగా జిల్లాలోని అన్ని ప్రాంతాలకు కృష్ణా జలాలను తరలించేలా తక్షణం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

డెయిరీ కూడా కీలకమే..

వ్యవసాయం కన్నా అధికంగా రాబడి పాడిపరిశ్రమ ద్వారా జిల్లాలో ఉంది. ఆ రంగం ప్రస్తుతం ప్రతికూల పరిస్థితిని ఎదుర్కొంటోంది. ప్రైవేటు డెయిరీలపై పరిశ్రమ ఆధారపడటంతో పశుపోషకులు నష్టపోతున్నారు. దశాబ్దాలపాటు జిల్లాలోని పాడిరైతులకు బాసటగా నిలిచిన ఒంగోలు డెయిరీని వైసీపీ ప్రభుత్వం మూసేసింది. ప్రస్తుతం అమూల్ వెళ్లిపోయినా సుమారు రూ.1500 కోట్ల ఆస్తులు, భారీ మిషనరీ, ఫ్యాక్టరీ ఉన్న డెయిరీ మాత్రం మూలనపడింది. తక్షణం ఒంగోలు డెయిరీని పునరుద్ధరించే చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

నేడు జిల్లాకు సీఎం

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 46.85 లక్షల మంది రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాకు వస్తున్నారు. జిల్లాలో అధికంగా రైతులు ఉన్న అలాగే సాగర్ ఆయకట్టు ప్రాంతం, పాడిపరిశ్రమ అధికంగా ఉన్న దర్శి నియోజకవర్గం తూర్పువీరాయపాలెంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ సభకు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాలోని గ్రామీణ ప్రజల ఆర్థికాభివృద్ధికి ఉపకరించేలా సమగ్ర నీటిపారుదల ప్రణాళిక, ఒంగోలు డెయిరీ పునరుద్ధరణపై స్పష్టత ఇచ్చి కార్యాచరణ చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పక్కవీధికెళ్లాలంటే.. 8 కిలోమీటర్లు ప్రయాణం

● పదేళ్లుగా అవస్థలు పడుతున్న తిమ్మనపాలెం ప్రజలు ● హైవేపై చాలాచోట్ల ఇదే పరిస్థితి

మేదరమెట్ల, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారికి రెండువైపులా ఉన్న తిమ్మన్నపాలెం వాసులకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. ఒక వీధి నుంచి ఇంకో వీధికెళ్లాలంటే 8 కిలోమీటర్లు తిరిగిరావల్సి వస్తోంది. గ్రామస్థులు పదేళ్ల ఇదే నరకం అనుభవిస్తున్నారు. జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా నిర్మించేటప్పుడు తిమ్మనపాలెం వద్ద పశువులు రోడ్డు దాటడానికి వీలుగా పశువుల నడకదారి (క్యాటిల్ అండర్ పాస్) నిర్మించారు. రైతులు పశువులను ఈ అండర్ పాస్ నుంచి తోలుకు వెళ్లేవారు. జాతీయ రహదారికి రెండు పక్కల ఉన్న గ్రామంలోకి వెళ్లడానికి వీలుగా అక్కడ ఖాళీ వదిలారు. ఆ ఖాళీ నుంచి ప్రజలు, వాహనాలు అటు ఇటు ప్రయాణించేయి. దాదాపు 2500 జనభా ఉన్న తిమ్మనపాలెం గ్రామం రోడ్డుకు రెండు వైపుల ఉంది. పడమర వైపు యర్రబాలెం వెళ్లే రోడ్డులో ఎంతో చరిత్ర కలిగిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉంది. జాయతీ రహదారిని 6 వరుసలుగా (6 లైన్స్‌గా) విస్తరించినప్పుడు కూడా గ్రామస్థుల రాకపోకలకు వీలుగానే నిర్మించారు. రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, రోడ్డు మధ్య నున్న గ్యాప్‌ను మూసి వేశారు. రోడ్డు దాటే సమయంలో 8 మంది మరణించడంతో పాటు అనేక మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఆ కారణంతో రాకపోకలకు వీలులేకుండా ఆ ఖాళీని మూసి వేశారు. ఇది జరిగి పది సంవత్సరాలు కావస్తోంది. ఇప్పుడు రోడ్డుకు పడమర వైపు ఉన్న వాళ్ల రోడ్డుకు తూర్పున ఉన్న వీధికి వెళ్లాలంటే మేదరమెట్ల వచ్చి అండర్ పాస్ నుంచి వెనుదిరిగి వెళ్లాల్సి వస్తోంది. రోడ్డుకు తూర్పు వైపు ఉన్నవారు పడమర వైపు వెళ్ళాలంటే 200 మీటర్లు కూడా లేని ఈ దూరానికి గ్రోత్ సెంటర్ వరకు వెళ్లి తిరిగి రావడానికి 2 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. జాతీయ రహదారిని 6 వరుసలుగా నిర్మించినప్పుడు కొత్త అండర్ పాస్ నిర్మించకుండా పాత పశువుల దారిని విస్తరించారు. ఈ అండర్ పాస్ నిర్మాణం ఉన్న చోట రోడ్డు కొద్దిగా మలుపు ఉంటుంది. దీని వల్ల క్యాటిల్ అండర్ పాస్‌లో నీళ్ల నిలవడంతోపాటు ఇది 5 అడుగుల ఎత్తునే ఉండడంతో మనుషులు నిలబడి వెళ్లడానికి కూడా వీలు లేకుండా ఉంది. గత కొన్ని ఏళ్లగా గ్రామస్థులు గ్రామంలో రెండువైపుల రాకపోకలకు వీలుగా 12 అడుగుల ఎత్తులో అండర్ పాస్ నిర్మించాలని కోరుతున్నారు. జాతీయ రహదారి అధికారులు ఇప్పటికైన స్పందించి గ్రామస్థులకు ఉపయోగకరమైన అండర్ పాస్ నిర్మించాలని కోరుతున్నారు.



తిమ్మనపాలెం వద్ద ఉన్న హైవేలో పశువుల నడకదారి



నీళ్లతో నిండి ఉన్న క్యాటిల్ అండర్ పాస్

బాలికల విద్యతోనే సమాజాభివృద్ధి

● 35 ఏళ్ల నుంచి ఉచిత విద్యను అందించటం హర్షణీయం

● శ్రీకృష్ణ చాముండేశ్వరి మహర్షి విద్యార్థినులకు రూ.2 లక్షల విలువైన వస్తువులు బహూకరణ



పర్చూరులోని బాలికల పాఠశాల విద్యార్థినులకు స్కూల్ సామగ్రిని పంపిణీ చేస్తున్న చాముండేశ్వరి మహర్షి, దాతలు

పర్చూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : బాలికలకు విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని శ్రీ కృష్ణ సేవా సంస్థానం పీఠాధిపతి డాక్టర్ శ్రీ కృష్ణ చాముండేశ్వరి మహర్షి అన్నారు. శుక్రవారం పర్చూరులోని బాలికల పాఠశాల విద్యార్థినులకు దాతల సహకారంతో రూ.2లక్షల విలువ చేసే స్కూల్ యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, వాటర్ బాటిల్స్ ఇతర స్కూల్ సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీఠాధిపతి మాట్లాడుతూ బాలికలు విద్యావంతులైతే కుటుంబ వ్యవస్థ బలపడుతుందని, తద్వారా దేశం కూడా అభివృద్ధి చెందుతుందని అన్నారు. గ్రామీణ బాలికలను విద్యావంతులను చేయాలన్న సంకల్పంతో కామ్రేడ్ క్రిష్ణంశెట్టి కనకయ్య పర్చూరులో ప్రాంతీయ విద్యాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో పాఠశాలను ఏర్పాటు చేసి 35 సంవత్సరాల నుంచి దాతల సహకారంతో ఉచిత విద్యను అందించటం హర్షించదగ్గ విషయం అన్నారు. తొలుత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కనకయ్య కాంశ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ క్రిష్ణంశెట్టి రమేష్ బాబు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ) కొల్లా నరేంద్రకుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ సువర్ణ

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

పొదిలి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ప్రాజెక్ట్ డైరెక్టర్ సువర్ణ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తల్లిపాల వలన కలిగే ప్రయోజనాలను ప్రతి ఒక్క తల్లికి అవగాహన కల్పించాలన్నారు. బిడ్డపుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించడం మంచిదని తెలిపారు. ముఖ్యంగా ఆరునెలల వరకు ఎలాంటి ఆహారం కాని నీరు కాని తాగించకుండా తల్లిపాలు మాత్రమే పట్టించాలని చూసించారు. అంగన్‌వాడీ పాఠశాలల్లో రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని పిల్లలకు క్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు. కార్యకర్తలు ఎలాంటి అవకతవకలు జగకుండా పాఠశాలలు నిర్వహించాలని చూసించారు. ఈకార్యక్రమంలో సీడీపీవో సుధామారుతి, ఎల్‌డీపీ మేఘన, సూపర్‌వైజర్లు సుభాషిణి, ఝాన్సీలక్ష్మి, ప్రసన్న, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళ బ్యాగు లాక్కెళ్లిన దుండగులు

● మోటారు సైకిల్‌పై నుంచి పడిన బాధితురాలికి తీవ్రగాయాలు

ఒంగోలు క్రైం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న పురిణి విజయలక్ష్మి తన భర్త సుబ్రమణ్యం మోటారుసైకిల్‌పై వెళ్తుండగా ఇరువురు దుండగులు ఆమె వద్దనున్న బ్యాగును లాక్కుని పరారయ్యారు. ఈ ఘటన కొప్పోలులోని నక్కల రాణెమ్మ కాలనీవద్ద శుక్రవారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే ఒంగోలులోని సెంట్రల్‌బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న విజయలక్ష్మి విధులు ముగించుకుని తన భర్త సుబ్రమణ్యం మోటారు సైకిల్‌పై కొత్తపట్నం వెళ్తున్నారు. మార్గమధ్యలో వెనుక నుంచి ఇరువురు దుండగులు మోటారుసైకిల్‌పై వచ్చి ఆమె వద్ద నున్న బ్యాగును లాక్కెళ్లారు. దీంతో మోటారుసైకిల్ అదుపుతప్పి విజయలక్ష్మి కింద పడిపోయింది. ఆమెను చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



బల్లికురవ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బల్లికురవ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను తీసుకోవడం వలన జీవితాలు నాశనం అవుతాయని ఎస్ఐ నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాపట్ల జిల్లా కేంద్రం నుంచి వచ్చిన లీగల్ టీం సభ్యులతో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం గంజాయి, సిగరెట్ తాగడం వలన కలిగే ప్రమాదాల గురించి వివరించారు. అలానే జూదం అనేది పెద్దప్రమాదం అని తెలిపారు. కార్యక్రమంలో పలువురు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మార్టూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలలపూడి గ్రామానికి చెందిన గాలి యుగంధర్(20) అనే యువకుడు మంగళగిరిలోని ఎయిమ్స్ లో చికిత్సపొందుతూ గురువారం మృతిచెందినట్లు యువకుని తండ్రి గాలి ప్రసన్న శుక్రవారం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు గాలి ప్రసన్న, అనిత దంపతులకు ఇద్దరు కుమారులు. వీరి రెండవ కుమారుడు యుగంధర్ ఇంటర్ పూర్తిచేశాడు. అయితే కొన్నిరోజుల నుండి కండరాల వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో తీవ్ర మనస్థాపంతో గత నెల 20న పొలంలో గొర్రెలను మేపుకోవడానికి వెళ్లి, అక్కడే గడిమందు తాగాడు. దీంతో ఆయన కుటుంబసభ్యులు చిలకలూరిపేట, గుంటూరులలోని ప్రవేటు ఆస్పత్రులలో చికిత్స చేయించారు. చివరకు గత నెల 24న మంగళగిరి ఎయిమ్స్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేరళలో క్రైస్తవ నన్స్‌పై అక్రమ కేసులు ఎత్తివేయాలి

చీరాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కేరళా రాష్ట్రంలో క్రైస్తవ నన్స్‌పై అ క్రమ కేసులు ఎత్తివేయాలని క్రిస్టియన్ జేఏసీ, ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. కేరళలో జరుగుతున్న వ్యవహారంపై శుక్రవారం చీరాల ముక్కోణం పార్కు వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తులకు స్వచ్ఛందంగా సేవ చేస్తున్నవారిపై అక్రమ కేసులు బనాయించడం అన్యాయమన్నారు. వెంటనే న్యాయవిచారణ చేయించి కేసులు ఎత్తివేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కరరావు, జగన్‌మోహనరావు, కాటి మార్కు, రవికుమార్ , భగత్‌సింగ్ పలు చర్చిల పాస్టర్‌లు, నన్స్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించండి

● సీపీఎం నేత గంగయ్య



స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా పంగులూరులో ప్రచారం చేస్తున్న సీపీఎం నేత గంగయ్య

పంగులూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చర్యను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని, విద్యుత్ వినియోగదారులను దోచుకునేందుకే స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం పూనుకుంటున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య అన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోవాలంటూ పంగులూరులో ఆ పార్టీ నేతలు గ్రామకమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రచార కార్యక్రమం చేపట్టారు. ప్రమాదకర స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ప్రక్రియను రద్దుచేయాలని కోరుతూ పంగులూరు ప్రధాన కూడలిలో కరపత్రాలను పంపిణీ చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో వినియోగదారులకు కలిగే నష్టాలను వివరించారు. ఈ ప్రచార కార్యక్రమంలో పార్టీ నాయకులు తలపనేని రామారావు, ఆదుంసాహెబ్, తలపనేని సుబ్బారావు, తానికొండ సుధాకర్, ఏలియా పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రాలలో ప్రత్యక్ష ప్రసారాలు

పంగులూరు, ఆగష్టు 1(ఆంధ్రజ్యోతి): నేడు దర్శి నియోజకవర్గంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించే అన్నదాత సుఖీభవ ప్రారంభ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాలు మండలంలోని రైతు సేవాకేంద్రాల వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు రైతులందరూ అందబాటులో ఉన్న కేంద్రాల వద్దకు చేరుకుని కార్యక్రమాన్ని తిలకించాలని కోరారు.

కన్యకాపరమేశ్వరికి దుర్గాదేవి అలంకారం



దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు

గిద్దలూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాస పూజలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం సందర్భంగా పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు భక్తులకు దుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈసందర్భంగా దాతలు అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు వాడకట్టు రంగసత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై కేంద్ర బృందం పరిశీలన

త్రిపురాంతకం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా మండలంలో రెండో రోజు శుక్రవారం కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. మిరియంపల్లి గ్రామంలో పర్యటించిన సభ్యులు కె.వెంకటేష్ పారిశుధ్య పరిస్థితులు, తడి, పొడి చెత్త నిర్వహణ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల తీరును పరిశీలించారు. పారిశుధ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఎంపీడీవో రాజ్‌కుమార్, మురళి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్, ఖాజావలి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

రక్షణ ఏర్పాట్లు పరిశీలన



రైస్‌మిల్లును పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆంజనేయరెడ్డి

గిద్దలూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలలో రక్షణ ఏర్పాట్లు ఏ స్థాయిలో చేశారో అనే విషయంపై తహసీల్దార్ ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, వినియోగదారుల సంఘం నాయకుల సమక్షంలో తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని రైస్‌మిల్స్, వాటర్‌ప్లాంట్లు, రేషన్‌గోడౌన్, గ్యాస్ గోడౌన్, క్రాకర్‌షాపులను పరిశీలించారు. అగ్ని ప్రమాదాలు జరిగితే వెంటనే తీసుకోవలసిన నివారణ చర్యల గురించి, అందుకు తగ్గ ఏర్పాట్లు ఉన్నాయా, లేవా అని పరిశీలించారు. విద్యుత్‌బోర్డుల వద్ద, మెయిన్‌ల వద్ద విద్యుత్ కనెక్షన్లు లూజ్‌గా లేకుండా చూసుకోవాలన్నారు. వివిధ అంశాలపై పరిశ్రమ యజమానులకు అవగాహన కల్పించారు.

నీటి తొట్లున్నా నిరుపయోగమే

● పలు చోట్ల పేరుకుపోయిన పాచి



కంభంలో పాచిపట్టిన పశువులు తాగే నీటి తొట్టి

కంభం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కంభం పట్టణంలో పశువుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటితొట్లు నిరుపయోగంగా మారడమేకాక పలు తొట్లలో పాచి పేరుకుపోయింది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలంలో 100 పైగా నీటి తొట్లను నిర్మించారు. ప్రారంభంలో పశువుల దాహార్తిని తీర్చేందుకు వాటిని ఉపయోగించినా తరువాత వాటి ఆలనపాలన పట్టించుకోక పోవడం, తొట్లను శుభ్రం చేయడం, నీరు పట్టడం చేయకపోవడంతో తొట్లన్నీ పాచిపట్టి నీచువాసన వస్తున్నది. దీనితో తొట్లలో నీరు తాగేందుకు పశువులు రావడం లేదు. ప్రస్తుతం ఎండలకు, తీవ్ర వర్షాభావం పరిస్థితుల వలన మేతకు వచ్చిన పశువులు తిరిగి ఇళ్లకు వెళ్లే వరకు నీరు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నీటితొట్లను శుభ్రం చేసి నీటిని పట్టి పశువుల దాహార్తి తీర్చాల్సిందిగా పశుపోషకులు కోరుతున్నారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి



ప్రసంగిస్తున్న సీఐటీయూ నాయకులు ఆవులయ్య

గిద్దలూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక కార్యాలయంలో ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. సమావేశంలో ఆవులయ్య మాట్లాడుతూ వ్యవసాయం దెబ్బతినడంతో నిరుద్యోగ వ్యవస్థ పెరుగుతున్నదని, చదువుకున్న యువత కూడా పనులు లేక తమ కుటుంబాలను పోషించుకునేందుకు ఎక్కువగా ఆటో కార్మికులుగా మారుతున్నారని పేర్కొన్నారు. తక్కువ డౌన్ పేమెంట్ కట్టి ఆటో తెచ్చుకుని కంతులు కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. దీనికితోడు వివిధ రకాల ట్యాక్స్‌లు, ఇన్సూరెన్స్‌లు, జరిమానాలు ఆటోకార్మికులను ఆర్థికసంక్షోభంలోకి నెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భవన కార్మికుల లాగానే ఆటో కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 5వ తేదిన జరగనున్న ఆటో వర్కర్స్ యూనియన్ సదస్సులో ఆటో కార్మికులందరూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఆటో కార్మికుల సంఘం నాయకులు ఉస్మాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాసులు

7న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటన

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈనెల 7వ తేదీన ఒంగోలులో జరిగే పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు కోరారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటనపై ఒంగోలు నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశానికి నియోజకవర్గ ఇన్‌చార్జి వైసీ యోగయ్య యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో శ్రీనివాసులు మాట్లాడుతూ మాధవ్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన తర్వాత ఒంగోలు వస్తున్న సందర్భంగా పార్టీ శ్రేణులంతా తరలిరావాలన్నారు. ఒంగోలు నియోజకవర్గ యోగయ్యయాదవ్ మాట్లాడుతూ పార్టీలో ఒక సైనికుడిగా పనిచేసిన మాధవ్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులు కావడం అభినందనీయం అన్నారు. దేశం కోసం, ధర్మం కోసం, నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసే క్రమశిక్షణ కలిగిన వ్యక్తి మాధవ్ అని అన్నారు.

5న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

ఒంగోలు విద్య, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మిగిలిపోయిన సీట్లకు ఈనెల 5వతేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆటో మొబైల్, సివిల్, మెకానికల్ బ్రాంచిల్లో ఖాళీలు ఉన్నాయి. స్పాట్ అడ్మిషన్లకు సంబంధించిన అప్లికేషన్లు కళాశాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. 4వ తేదీలోపు విద్యార్థులు పూర్తిచేసిన దరఖాస్తులను కళాశాలలో సమర్పించాలన్నారు. దరఖాస్తులతో పాటు పదవ తరగతి మార్కుల జాబితా, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, టీసీ, కులధ్రువీకరణ, పాలిసెట్-25 ప్రవేశపరీక్ష రాసిన వారు తమ ర్యాంకు కార్డులను జత చేయాలన్నారు. 5న స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు తమ ఒరిజినల్ విద్యార్హతలు, ఇతర సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆయన కోరారు.

సింగరాయకొండలో చోరీ

● 10 సవర్ల నగలు అపహరణ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

సింగరాయకొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్‌నగర్ 4వ లైన్‌లో చోరీ జరిగింది. 10 సవర్ల నగలను దొంగలు అపహరించుకెళ్లారు. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పొన్నలూరు మండలం రావులకొల్లుకు చెందిన బండి కృష్ణవేణి సింగరాయకొండలోని అంబేడ్కర్‌నగర్‌లో నివాసముంటున్నారు. లింగసముద్రం మండలం పెదపవని గురుకుల పాఠశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ప్రతిరోజూ ఆమెను భర్త వెంకటేశ్వర్లు పెదపవని తీసుకెళ్లి తీసుకొస్తుంటారు. ఈ విషయాన్ని గుర్తించిన దొంగలు శుక్రవారం ఇంటి తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. లోపల ఉన్న 10 సవర్ల బంగారు ఆభరణాలను అపహరించుకెళ్లారు. సాయంత్రం సమయంలో ఇంటి పైఅంతస్థులో అద్దెకు ఉండే మహిళ కింద తలుపు తెరిచి ఉండటాన్ని గుర్తించి లెక్చరర్ కృష్ణవేణికి సమాచారం ఇచ్చారు. విషయం తెలిసిన వెంటనే ఇంటికి చేరుకున్న దంపతులు జరిగిన విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు డాగ్ స్క్వాడ్, వేలిముద్రల బృందం ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలను సేకరించాయి. ఎస్సై మహేంద్ర కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ ఫలితాల సాధనపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ పద్మ

ఒంగోలు విద్య, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ ఫలితాల సాధనపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఇంటర్మీడియెట్ విద్య గుంటూరు ఆర్జేడీ పద్మ ఆదేశించారు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు పాఠ్య నోటు పుస్తకాలతో పాటు నీట్, ఎంసెట్ కోచింగ్‌కు సంబంధించి పోటీ పరీక్షల పుస్తకాలు కూడా అందజేసినందున వాటిని సద్వినియోగం చేసుకొని సత్ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కళాశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులూ కల్పించాలని సూచించారు. ముఖహాజరులో ఎవ్వరికీ మినహాయింపు లేదన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు గట్టి ప్రయత్నం చేయాలన్నారు. అడ్మిషన్లు పెంచేందుకు గడువును ఈనెల 11 వరకు పొడగించినట్లు తెలిపారు.

మండల సమావేశం బహిష్కరణ

● తీర్మానం చేసిన బిల్లులకు నిధులు మంజూరు చేయలేదని వైసీపీ నిరసన



ఎర్రగొండపాలెంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన వైసీపీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం మండల పరిషత్ సమావేశాన్ని శుక్రవారం వైసీపీ ఎంపీటీసీలు, ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు బహిష్కరించారు. ఉదయం 11 గంటలకు సమావేశం జరగాల్సి ఉండగా 12 గంటలకు సమావేశం హాలులోకి వైసీపీ ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీ డి. కిరణ్‌గౌడ్, జడ్పీటీసీ సీహెచ్ విజయబాస్కర్‌లు వచ్చారు. ఏప్రిల్ నెలలో జరిగిన మండల పరిషత్ సమావేశంలో మండలంలో తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు రూ. 48 లక్షలు నిధులు కావాలని తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించాం.., మంజూరు లేకుండా పనులకు వర్కు ఆర్డర్ ఎందుకు ఇవ్వలేదని ఎంపీడీవో శ్రీనివాసరావును ఎంపీపీ ప్రశ్నించారు. నిధుల మంజూరు లేకుండా వర్క్ ఆర్డరు ఇవ్వకూడదని ఎంపీడీవో చెపారు. దీనికి నిరసనగా తాము సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని వైసీపీ ప్రజాప్రతినిధులంతా బయటికి వెళ్లిపోయారు. దీంతో సమావేశాన్ని ముగించారు. సమావేశానికి ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, టీడీపీ ఎంపీటీసీ సభ్యులు, అధికారులు హాజరయ్యారు.

పేదరికం లేని సమాజమే ధ్యేయం

పింఛన్ల పంపిణీలో మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి



మర్రిపూడి మండలం చిమటలో మాట్లాడుతున్న మంత్రి స్వామి

సింగరాయకొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పేదరికంలేని సమాజమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం సింగరాయకొండ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన స్పౌజ్ పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో భర్త చనిపోయిన స్త్రీలకు వితంతు పింఛన్లు పంపిణీ చేయకుండా ఇబ్బందులకు గురిచేసిందని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో నూతనంగా 1,08,206 మందికి, జిల్లాలో 5,174 మందికి, కొండపి నియోజకవర్గంలో 799 మందికి వితంతు పింఛన్లు అందజేస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీనీ ప్రభుత్వం నెరవేరుస్తున్నదన్నారు. ఈనెలలోనే మూడు హామీలను అమలుచేస్తున్నామని చెప్పారు. 2019 నుంచి నిలిచిపోయిన స్పౌజ్ పింఛన్‌లను ఇచ్చామన్నారు. దర్శిలో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని శనివారం సీఎం చంద్రబాబు ప్రారంభిస్తున్నారని చెప్పారు. ఈనెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీను అమలు చేయబోతున్నామని తెలిపారు. త్వరలోనే యువతకు నిరుద్యోగ భృతిని అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నదని వివరించారు.

● ఐదేళ్లు అవినీతికి పాల్పడిన వ్యక్తి ఆరోపణలు సిగ్గుచేటు

వైసీపీ ప్రభుత్వంలో అధికారం అండతో అడ్డంగా దోచుకొని నియోజకవర్గాలు మారి వచ్చిన వ్యక్తి తనపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటని మంత్రి స్వామి అన్నారు. తాను అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే వారు చెప్పిన దేనికైనా కట్టుబడి ఉంటానని చాలెంజ్ విసిరారు. గత ప్రభుత్వంలో ఎర్రగొండపాలెంలో చేసిన భూఆక్రమణలు, అవినీతి పాపాలు, తప్పుడు పనులకు తహసీల్దార్లు సస్పెండ్ అవుతున్నారన్నారు. అవినీతిపరులు, ప్రజలు ఛీత్కరించిన వ్యక్తులు నిజాయితీగా పనిచేస్తున్న తనలాంటి వారిపై విమర్శలు చేయడం వారి దిగజారుడు రాజకీయాలను నిదర్శమని చురకలు వేశారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, తహసీల్దార్ పుల్లారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణారావు, టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ, షేక్ సందానీ, కూనపరెడ్డి సుబ్బారావు, చంటి, మించల బ్రహ్మయ్య, చిగురుపాటి గిరి, కొత్తూరి రంగనాయకులు, జనసేన మండల అధ్యక్షుడు రాజేష్ పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

ప్రజల జీవనప్రమాణాల పెంపే లక్ష్యంగా..

మర్రిపూడి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. అందుకోసం ఆయన అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారని చెప్పారు. మండలంలోని చిమట గ్రామంలో నూతనంగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను శుక్రవారం మంత్రి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జరిగిన గ్రామ సభలో మాట్లాడారు. పేదరికం లేని సమాజాన్ని చూడాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పీ4 పథకానికి రూపకల్పన చేశారన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, ఎంపీడీవో ఖాసింపీరా, తహసీల్దార్ జనార్దన్, నాయకులు యర్రమోతు శ్రీనివాసులు, రేగుల వీరనారాయణ, చేరెడ్డి నర్సారెడ్డి, తుళ్లూరి నరసింహారావు, గొంటు హనుమారెడ్డి, కె.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి స్వామి వైద్యుడైన వేళ..

స్వతహా వైద్యుడైన మంత్రి స్వామి గ్రామాలలో పర్యటించే సందర్భంలో రోగులు తారసపడితే ఉచిత వైద్యసేవలు అందిస్తుంటారు. శుక్రవారం చిమటలో పింఛన్‌ల పంపిణీ సందర్భంగా ఎస్సీ కాలనీలో ప్రమాదానికి గురై మంచానికే పరిమితమైన కొలకలూరి బ్రహ్మయ్యను చూడగానే మంత్రిలోని వైద్యుడు బైటకొచ్చాడు. బాధితుడి పూర్తి వివరాలను తెలుసుకొని పలుఆరోగ్య సూత్రాలను సూచించారు. చికిత్స కోసం రూ.6 లక్షలకుపైన అప్పుచేసి ఖర్చు పెట్టామని బాధితుడి కుటుంబ సభ్యులు వాపోయారు. స్పందించిన మంత్రి ముఖ్యమంత్రి సహాయ నిధి ఇప్పించి ఆదుకుంటానని హామీ ఇచ్చారు.

ఏది నిజం?

● దొంగ దొరికినా సొత్తు రికవరీలో తిరకాసు
● ఫిర్యాదుల్లో నిజముందా అని అనుమానం
● తలలు పట్టుకుంటున్న పోలీసులు

ఒంగోలు క్రైం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఒకేరోజు వరుసగా ఐదు దొంగతనాలు చేసిన దొంగను పోలీసులు పట్టుకున్నారు. రికవరీలో వ్యత్యాసం కనిపిచడంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా అత్యంత చాకచక్యంగా దొంగను పట్టుకున్న పోలీసులకు విచారణలో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. దీంతో ఫిర్యాదుదారులను అనుమానించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఒంగోలు నగరంలో గత నెలలో వరసగా ఒకేరోజు ఐదు దొంగతనాలు జరిగాయి. ఐదు చోరీలు ఒకే తరహాలో ఉన్నాయి. తాళాలు వేసి ఉన్న దుకాణాలు, ఇళ్లు కావడం, చోరీలకు పాల్పడిన దొంగ తాళాలను కోసి దొంగతనం ఇందులో ప్రత్యేకత. ఈ చోరీలు అన్నీ నగర శివారు ప్రాంతంలో రోడ్డు పక్కన జరిగాయి. ముందుగా నాలుగు చోట్ల జరిగిన చోరీలు పోలీసుల దృష్టికి వచ్చాయి. అందుకు సంబంధించిన ఒక ఫార్మా కంపెనీ వాచ్‌మన్ గదిలో లక్ష రూపాయిలు నగదు, స్కూటీ పోయినట్లు ఫిర్యాదు అందింది. అక్కడ దొంగ టీవీఎస్ ఎక్సెల్‌ను వదిలేసి స్కూటీని అపహరించాడు. అదే సమయంలో కర్నూల్ రోడ్డులో ఓ సిమెంట్ దుకాణం షట్టర్ తీసి దొంగతనానికి యత్నించాడు. ఓ పప్పు మిల్లులో కూడా చోరీకి పాల్పడి రెండు లక్షలు నగదు అపహరించాడు. అక్కడి నుంచి త్రోవగుంట ఆటోనగర్‌లో రెండు దుకాణాల్లో రాగి వైర్లు దొంగతనం చేశాడు. పప్పు మిల్లు పరిసరాల్లో దొరికిన సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు ఐదు రోజుల క్రితం అదుపులోకి తీసుకొని విచారించారు.

ఐదుచోట్ల చోరీలు చేసినట్లు అంగీకరించిన నిందితుడు తనకు ఎక్కడా నగదు దొరకలేదని చెప్పాడు. ఫిర్యాదుదారులు మూడు లక్షలు నగదు పోయినట్లు పేర్కొన్నారు. దీంతో పోలీసులు ఏం చేయాలనే సందిగ్ధంలో పడ్డారు. నిందితుడు దొంగిలించిన స్కూటీని రికవరీకి ఇచ్చాడు. నగదు అపహరణకు గురైయిందా లేదా అనే కోణంలో ఫిర్యాదుదారులను విచారణ చేయడం ప్రారంభించారు.



ప్రత్యేక అలంకరణలో జగదాంబ



ప్రత్యేక అలంకరణలో రాజ్యలక్ష్మీ అమ్మవారు

శ్రావణ శుక్రవారం పూజలు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసంలో రెండో శుక్రవారం పురస్కరించుకుని పట్టణంలోని ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో రాజ్యలక్ష్మీ అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమార్చన, విశేష అలంకరణ నిర్వహించి పూజలు చేశారు. ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు. జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగదాంబ మాతకు అర్చకులు ఆంజనేయ శర్మ, వరుణ్ తేజ శర్మలు విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

నామీద కేసు పెట్టిన మహిళ ఏదీ?

● కార్యాలయంలో చిందులు వేసిన ఎంపీడీవో ● దేహశుద్ధికి దళిత మహిళల యత్నం ● తప్పయిందంటూ ఆయన కొడుకు క్షమాపణలు



తర్లుపాడు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో చక్రపాణి ప్రసాదు శుక్రవారం సాయంత్రం కార్యాలయానికి వచ్చి హల్‌చల్ చేశారు. మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడటంతో తర్లుపాడు పోలీస్‌స్టేషన్‌లో ఎంపీడీవోపై పది రోజుల క్రితం కేసు నమోదైన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఈనెల 5వ తేదీ వరకు సెలవు పెట్టి వెళ్లిపోయాడు. సెలవులో ఉన్న ఎంపీడీవో శుక్రవారం సాయంత్రం కార్యాలయానికి వచ్చి నామీద కేసు పెట్టిన మహిళ ఏదంటూ హల్‌చల్ చేశాడు. ప్రస్తుతం బాధిత మహిళ మనస్తాపంతో ఇంటి వద్ద ఉంటోంది. ఆమె స్థానంలో ఆమె అత్త విధులు నిర్వహిస్తుండటంతో నువ్వు ఎందుకు కార్యాలయానికి వచ్చావంటూ ఆమెపై విరుచుకుపడ్డాడు. మిమ్మల్ని వెంటనే ఉద్యోగం నుంచి పీకి వేస్తానంటూ చిందులు వేశాడు. విషయం తెలుసుకున్న స్థానిక దళిత మహిళలు ఒక్కొక్కరుగా వస్తుండటంతో పక్కనే ఉన్న ఆయన కొడుకు తప్పు అయిపోయింది క్షమించండి అంటూ కాళ్లబేరానికి వచ్చాడు. అనంతరం తన తండ్రి (ఎంపీడీవో)ని తీసుకెళ్లిపోయాడు.

సెలవులో ఉన్న ఎంపీడీవో రావటానికి కారణం ఏంటి

ఈనెల 5 వరకు ఎంపీడీవో సెలవు పెట్టాడు. అయితే కార్యాలయానికి రావటంలో ఉన్న ఆంతర్యమేమిటని ప్రజలు, సిబ్బంది చర్చించుకుంటున్నారు. సెలవులో ఉన్నా కార్యాలయానికి వచ్చి హల్‌చల్ చేయడం ఏమిటంటూ దళితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 10 రోజుల క్రితం కేసు నమోదు చేసినప్పటికీ ఇంత వరకు విచారణ చేయకుండా చర్యలు తీసుకోకపోవటంలో ఉన్న మతలబు ఏమిటని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

పోలీసు ఉద్యోగాలకు ఎంపిక

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్ ఫలితాలలో మార్కాపురంలోని రేస్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన 24 మంది పోలీస్ కానిస్టేబుళ్లగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రేస్ కోచింగ్ సెంటర్‌లో గౌరవ సలహాదారు సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జిలానీ, డైరెక్టర్ బి.లక్ష్మీ నారాయణలు శుక్రవారం ఎంపికైన వారిని అభినందించి మాట్లాడుతూ.. శిక్షణ పొందిన 11 మంది సివిల్ కానిస్టేబుళ్లగా, మరో 13 మంది ఏపీఎస్‌పీ కానిస్టేబుల్స్‌గా ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులలో దిలీప్ కుమార్ 145 మార్కులు, సురేంద్ర కుమార్ 144, కె.రాజేష్ 143, షేక్ మహబూబ్ జానీ 142, ఎస్.అనిల్ కుమార్ 141 మార్కులు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వెంకట్, సుబ్బయ్య, నర్సయ్య, నాగేశ్వరరావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందిన గడ్డం నాగలక్ష్మీ, జి.బాబుల్ రెడ్డిలు సివిల్ కానిస్టేబుల్స్‌గా ఎంపికైనట్లు సంస్థ గౌరవ సలహాదారులు కాశిరెడ్డి తెలిపారు.

కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక

తర్లుపాడు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కానిస్టేబుల్ ఫలితాలలో తర్లుపాడు మండలం విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మీర్జపేటకు చెందిన కె.బ్రహ్మయ్య జిల్లాలోనే 2వ ర్యాంకు సాధించి కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. తుమ్మలచెరువు గ్రామానికి చెందిన సయ్యద్ మహబూబ్ వలి 5వ ర్యాంకు సాధించి కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. దీంతో మండల ప్రజలు బ్రహ్మయ్య, మహబూబ్ వలిలను అభినందించారు.

ఉపాధిహామీలో పాత బిల్లులకు మోక్షం

● నియోజకవర్గంలో రూ.1.15కోట్లు పెండింగ్
● గత ప్రభుత్వం నిలిపివేయటంతో ఇబ్బందులు

త్రిపురాంతకం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసినప్పటికీ గత ప్రభుత్వం వాటి బిల్లులు నిలిపివేయటంతో గ్రామాల్లో చాలామంది బిల్లులు రాక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిలిచిపోయిన బిల్లులు చెల్లింపునకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రద్దు అయిన పనులకు సంబంధించిన వివరాలు తిరిగి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేవిధంగా చర్యలు చేపట్టింది. దీని వల్ల ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో మొత్తం 75 పనులకు సంబంధించిన 1,15,97, 971 రూపాయలు కాంట్రాక్టర్లకు దక్కనున్నాయి. కేవలం టీడీపీ నాయకులు పనులు చేశారనే కారణంతో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ పనులకు సంబంధించిన బిల్లులు ఇవ్వకుండా నిలిపివేశారు. బీటీ రోడ్లు, గ్రామాల్లో అంతర్గత రోడ్లు, సైడుకాలువల నిర్మాణం, కుంటల తవ్వకం వంటి పనులను చేశారు. మండలాల వారీగా ఈ బిల్లుల వివరాలు ఇలా ఉన్నాయి. దోర్నాల మండలంలో 7 పనులకు సంబంధించి రూ.5,75,941లు, పెద్దారవీడు మండలంలో 9 పనులకు రూ.21,49,233లు, పుల్లలచెరువు మండలంలో 17పనులకు రూ.24,88,801లు, త్రిపురాంతకం మండలంలో 21పనులకు రూ.43,03,017లు, ఎర్రగొండపాలెం మండలంలో 21 పనులకు రూ.20,80,979లు పెండింగ్ బిల్లులు కాంట్రాక్టర్లకు దక్కనున్నాయి.

ఫీడర్ కెనాల్ పనులు వేగవంతం

● వెలిగొండ ప్రాజెక్టు ఎస్ఈ అబూతాలిమ్



పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ అబూతాలిమ్

పెద్దదోర్నాల, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి):పశ్చిమ ప్రాంతం ఆశాజ్యోతి పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు లోని కీలక భాగమైన ఫీడర్ కెనాల్ పెండింగ్‌పనులు వేగవంతం అయినట్లు ప్రాజెక్టు ఎస్ఈ అబూ తాలిమ్ తెలిపారు. మండలంలోని గంటవానిపల్లె వద్ద ఫీడర్ కెనాల్‌పై నిర్మిస్తున్న యూటీ వంతెన, ఎస్కేప్ రెగ్యులరేటర్ పనులను ప్రాజెక్టు ఎస్ఈ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు పనులు తిరిగి వేగవంతం అయ్యాయని తెలిపారు. ఈ క్రమంలో రెండో సొరంగం భూగర్భంలో లైనింగ్ పనులు కూడా జరుగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం వచ్చే ఏడాది ఖరీఫ్ సీజనుకు మొదటి విడతలో భాగంగా కృష్ణా జలాలను నల్లమల రిజర్వాయర్లకు తరలించేందుకు తగిన విధంగా పనులు చేస్తున్నట్లు తెలిపారు.



చీమకుర్తిలో పింఛన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్


కె.ఉప్పలపాడులో పింఛన్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అచ్యుత్‌కుమార్, ఎంపీడీవో రామకృష్ణ


పొన్నలూరు మండలం నాగిరెడ్డిపాలెంలో నగదును అందిస్తున్న ఎంపీడీవో సుజాత

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్

- ఎమ్మెల్యే విజయ్‌కుమార్
- సందడిగా స్పౌజ్ పింఛన్ల పంపిణీ
- హాజరైన కూటమి నాయకులు, అధికారులు

చీమకుర్తి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు పంపిణీ చేస్తుండటం కూటమి ప్రభుత్వం ఘనత అని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. చీమకుర్తి మున్సిపల్ పరిధిలో నూతనంగా మంజూరైన స్పౌజ్ పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ పింఛను నగదు రూ.4వేలకు పెంచటం చారిత్రాత్మకం అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వై.రామకృష్ణయ్య, కౌన్సిలర్లు గొల్లపూడి రమాదేవి, గోరంట్ల అంజలి, టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, ముప్పూరి చలమయ్య, కాట్రగడ్డ రమణయ్య, రావిపాటి రాంబాబు, యడ్లపల్లి రామబ్రహ్మం, కందిమళ్ల గంగాధరరావు, గొల్లపూడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: పేదల అభ్యున్నతే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా మంజూరైన సామాజిక నూతన పెన్షన్‌లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని చెప్పారు. ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పతకాలు అమలు చేస్తున్నామని, అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు రూ.7వేల పంటసాయం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో నియోజకవర్గ కోఆర్డినేటర్ మండవ జయంత్‌బాబు, ఎంపీపీ వాకా అరుణ, తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపీడీవో వి.జ్యోతి, టీడీపీ మండలాధ్యక్షుడు ఉప్పుగుండూరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో పెన్షన్ల పంపిణీ జరిగింది.

సంతనూతలపాడు మండలంలో..

సంతనూతలపాడు: మండలంలోని అన్నిగ్రామాల్లో శుక్రవారం పింఛన్ల పంపిణీ సందడిగా సాగింది. ఈ సందర్భంగా ఎండ్లూరు గ్రామంలో 15మంది వితంతువులకు సంబంధించి మంజూరైన పింఛన్లను టీడీపీ నాయకుడు బొమ్మినేని రామాంజనేయులు, సర్పంచ్ పుల్లయ్య అందజేశారు. అనంతరం వీఆర్వో ఆదిరెడ్డి సమాచారహక్కుచట్టంపై అవగాహన కల్పించారు.

నాగులుప్పలపాడు మండలంలో..

నాగులుప్పలపాడు: ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం మండలంలో కోలాహలంగా జరిగింది. అధికారులు, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛను నగదును అందించారు. చేకూరపాడు, చదలవాడ, వినోదరాయునిపాలెం, కనపర్తి, ఈదుమూడి, నాగులుప్పలపాడు, పోతవరం గ్రామాల్లో ఎంపీడీవో తేళ్ల రవికుమార్ పింఛన్లను అందజేశారు. నూతనంగా 212పింఛన్లు మంజూరైనట్లు ఆయన చెప్పారు. తొలిరోజు 94శాతం పంపిణీ పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, ఈవోఆర్డీ మురళీమోహన్, ఏపీవో రవి పాల్గొన్నారు. ఉప్పుగుండూరులో నూతనంగా మంజూరైన పింఛన్లను టీడీపీ నాయకులు కనగాల శ్రీనివాసరావు, కుంచాల నాగరాజు, మసిముక్కు భాస్కరావు, బి.సెల్వం, పిన్నక శ్రీకాంత్, బెల్లం శ్రీనివాసరావు సచివాలయ సిబ్బందితో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాట్రగడ్డ చంద్రబాబు, బెల్లం వెంకటేశ్వర్లు, తెలగతోటి జాన్సన్, గోగినేని శేషగిరి, మాగులూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

కొండపి మండలంలో..

కొండపి: పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం గ్రామగ్రామానా శుక్రవారం ఉదయం నుంచి ముమ్మరంగా సాగింది. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందజేశారు. కొండపి, జరుగుమల్లి, టంగుటూరు మండలాల్లో సాయంత్రానికి 98శాతానికిపైగా పంపిణీ చేశారు. కొండపి మండలంలోని కె.ఉప్పలపాడులో మాజీ ఎమ్మెల్యే జి.అచ్యుత్‌కుమార్ పాల్గొన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో పి.రామకృష్ణ, కె.ఉప్పలపాడు, వెన్నూరు, చినవెంకన్నపాలెం తదితర గ్రామాల్లో పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

జరుగుమల్లి మండలంలో..

జరుగుమల్లి మండలం చతుకుపాడులో టీడీపీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు కొత్తగా మంజూరైన స్పౌజ్ పింఛన్‌లను లబ్ధిదారులకు అందజేశారు. వావిలేటిపాడులో టీడీపీ నాయకుడు నరాల సోమయ్య, నర్సింగోలులో గ్రామ నాయకుడు పాతూరి కోటేశ్వరరావు పాల్గొని పింఛన్‌లను పంపిణీ చేశారు.

టంగుటూరు మండలంలో...

మండలంలోని అన్ని గ్రామాల్లో అధికారులు, నాయకులు పాల్గొని పింఛన్ నగదును లబ్ధిదారులకు అందజేశారు. ఎం.నిడమలూరు గ్రామంలో కొత్తగా మంజూరైన 9 మందికి స్పౌజ్ పింఛన్‌లను గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాకుమాను శ్రీకాంత్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కార్యదర్శి పిడుగురాళ్ల సురేష్‌బాబు, ఐటీడీపీ అధ్యక్షుడు కాకుమాను శ్రీనివాస్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఎండ్లూరులో పింఛన్‌ను అందజేస్తున్న నాయకులు


ఉప్పుగుండూరులో

పొన్నలూరులో..

పొన్నలూరు: ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ పొన్నలూరు మండలంలో ఉదయం 6 గంటల నుంచే మొదలైంది. నాగిరెడ్డిపాలెం, పైరెడ్డిపాలెం గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వితంతు పింఛన్లు మండలానికి కొత్తగా 104 మంజూరయ్యాయని చెప్పారు. మండలంలో పింఛన్ లబ్ధిదారులు 6,095 మంది ఉండగా శుక్రవారం సాయంత్రానికి 95 శాతం మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, ఏఎంసీ ఛైర్మన్‌గా నియమితులైన కర్నా తిరుపతమ్మ, టీడీపీ నాయకులు కర్నా కోటిరెడ్డి, కంటు గోపీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల మరమ్మతులను పట్టించుకోరా?

గతంలో నాడు-నేడు కింద తూతూమంత్రంగా పనులు

ఇబ్బందిపడుతున్న విద్యార్థులు


గాలికి లేచిపోయిన రేకులు

పొన్నలూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) మండలంలోని చెన్నిపాడులో ఉన్న జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై అధికారులు శ్రద్ధచూపడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడు పథకం కింద తూతూమంత్రంగా పనులు చేశారు. పాఠశాలలో తరగతి గదులు, బాత్‌రూంలు, కిచెన్‌షెడ్, డైనింగ్ హాల్ నిర్మాణం, తాగునీటి వసతి, పెయింటింగ్ తదితర పనుల కోసం సుమారు రూ.1.33 కోట్లు ఖర్చు చేశారు. నాసిరకమైన వస్తువులు వాడడంతో కొద్దిరోజులకే పాడైపోయాయి. ముఖ్యంగా బాత్‌రూం తలుపులు ఊడిపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మూడునెలల క్రితం వీచిన గాలులకు డైనింగ్ హాల్ పైన రేకులు ఎగిరిపోయాయి. అప్పటినుంచి వాటి గురించి పట్టించుకున్నవారు లేరు. విద్యార్థులు మధ్యాహ్నం ఎండలోనే కూర్చుని భోజనాలు చేస్తున్నారు. అలాగే ప్రహరీ నిర్మాణాన్ని కూడా అసంపూర్తిగా వదిలేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యలను పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కూటమి పాలనలోనే పంచాయతీల అభివృద్ధి

- ఎమ్మెల్యే బీఎన్


ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, ఎంపీపీ అరుణ, నాగేశ్వరరావు

మద్దిపాడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనంలోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. అందులో భాగంగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కింద ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్‌లను అందజేయటం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. శుక్రవారం మద్దిపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో ఇనమనమెళ్లూరు, దొడ్డవరప్పాడు, పెద్దకొత్తపల్లి, గుండ్లాపల్లి గ్రామ పంచాయతీలకు మంజూరైన ట్రాక్టర్లను ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వేల జనాభా ఉన్న పంచాయతీకి ఒక ట్రాక్టర్ చొప్పున ప్రభుత్వం కేటాయించిందన్నారు. దీనిద్వారా గ్రామాల్లో చెత్తను చెత్తసంపద కేంద్రాలకు తరలించాలన్నారు. అదేవిధంగా పంచాయతీ అవసరాలకు వినియోగించుకోవాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ మండవ జయంత్‌బాబు, ఎంపీపీ వాకా అరుణ, తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపీడీవో వి.జ్యోతి, టీడీపీ మండలాధ్యక్షుడు ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, మార్నేని రాఘవరావు, అడకా స్వాములు, మందపల్లి శ్రీనివాసరావు, గట్టినేని అయ్యన్న, పోతినేని శ్రీనివాసరావు, మండవ శివానందరావు, వడ్డంపూడి శ్రీనివాసరావు, చిట్టిపోయిన అనిల్‌కుమార్‌యాదవ్, శుద్దపల్లి అనిల్, కడియాల రఘుబాబు, ముచ్చు సుబ్బారావు, శైలజ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రీయ వ్యవసాయంపై మాగుంట ప్రశ్న

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దేశంలో సేంద్రీయ వ్యవసాయం పెంపుదలకు కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుందని ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి శుక్రవారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖసహాయక మంత్రి రావ్‌నాథ్ ఠాకూర్ సమాధానం ఇస్తూ సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రప్రభుత్వం అన్ని రాష్ట్రాలలో పరంపరాగత్ కృషి వికాస్ యోజనను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈశన్య రాష్ట్రాలలో మిషన్ ఆర్గానిక్ వాల్యూ చైన్‌డెవలప్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తున్నామని, సేంద్రీయ వ్యవసాయంలోని రైతులకు ఉత్పత్తి నుంచి మార్కెటింగ్ వరకు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నట్లు కేంద్ర మంత్రి వివరణ ఇచ్చారు.

జాతీయ రెజ్లింగ్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ


సిరికీర్తనను అభినందిస్తున్న అధ్యాపకులు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలలో ఒంగోలులోని పీవీఆర్ బాలుర పాఠశాల ఆవరణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పైడిపాటి సిరికీర్తన ప్రతిభ చాటారు. గత నెల 29న చత్తీస్‌ఘర్‌లోని బిలాస్‌పూర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో సిరికీర్తిన తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. ఇదిలా ఉండగా, గత నెలలో తిరుపతిలో జరిగిన రాష్ట్ర రెజ్లింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించగా, తాజాగా జాతీయ స్థాయి పోటీలలో విజయం సాధించడం పట్ల శుక్రవారం స్థానిక కళాశాలలో ప్రిన్సిపాల్ కొలకలూరి ఆలీబాబు, అధ్యాపకులు టి.చక్రపాణి, విశ్వనాథ్‌బాబు, అధ్యాపకులు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

స్వామిత్వ సర్వేకు సహకరించాలి


మాట్లాడుతున్న కార్యదర్శి రంగారెడ్డి

నాగులుప్పలపాడు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేకు ప్రజలు సహకరించాలని పంచాయతీ కార్యదర్శి రంగారెడ్డి సూచించారు. స్వామిత్వ సర్వేపై ఈదుమూడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఖాళీ స్థలాలు, ఇంటి స్థలాలను సర్వే చేసి ఆస్తి యాజమాన్యపు హక్కు కల్పిస్తామని తెలిపారు.

శిశువులకు తల్లిపాలనే తాగించాలి


దొడ్డవరప్పాడులో బాలింతకు పౌష్టికాహారం అందిస్తున్న సిబ్బంది


ఇలవరలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

- ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

నాగులుప్పలపాడు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శిశువులకు తల్లిపాలనే తాగించాలని, దీంతో వారిలో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని ఎంఈవోలు రమణయ్య, టి.రవికుమార్ సూచించారు. మండలంలోని చీర్వానుప్పలపాడు, నాగులుప్పలపాడు, పోతవరం, తిమ్మసముద్రం గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలన్నారు. ఆరు నెలల వరకు తల్లిపాలు శిశువుకు అందిచాలని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మేడికొండ మురళీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎం.అన్నపూర్ణ, ఉష, శ్రీదేవి, ప్రమీల, హెచ్‌వీ.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

మద్దిపాడు: తల్లిపాలు అమృతంతో సమానమని సీడీపీవో ఇవాంజెలియన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దొడ్డవరప్పాడు, వెల్లంపల్లి, లింగంగుంట, నందిపాడు గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కార్యాక్రమాలకు హాజరైన సీడీపీవో మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. తల్లిపాలలో పోషక విలువలు ఉంటాయని ఆమె చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జ్యోతి, పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

కొండపి: తల్లిపాలతో బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందని సీడీపీవో బి.సుశీలాదేవి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని ఇలవర (నేతివారిపాలెం)లో ఐసీడీఎస్ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులతో సమావేశం ఏర్పాటు చేశారు. తల్లిపాలతో బిడ్డలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ టి.విక్టోరియారాణి, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో అలసత్వం వహించొద్దు


చేకూరపాడులో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

నాగులుప్పలపాడు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణలో అధికారులు, పంచాయతీ సిబ్బంది అలసత్వం వహించొద్దని ఎంపీడీవో రవికుమార్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పారిశుధ్య పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. చెత్త సేకరణపై స్థానికులను అడిగి తెలుసుకొన్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా పారిశుధ్య కార్మికులు చెత్తను తొలగిచేలా సర్పంచ్‌లు, కార్యదర్శులు పరిశీలించాలని ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ మురళీ, సర్పంచ్ కొమ్మినేని రమేష్‌బాబు, కార్యదర్శి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

సంతనూతలపాడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు మండలపరిషత్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై శుక్రవారం ఎంపీడీవో డి.సురేష్‌బాబు ప్రసంగించారు. ఈ చట్టంపై అర్జీదారుడు అడిగిన సమాచారాన్ని నిర్ణీత గడువులో ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.విజయ, జడ్పీటీసీ డి.రమణమ్మ పాల్గొన్నారు.

కేంద్ర బృందం పర్యటన

ఒంగోలు(రూరల్), ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం యరజర్ల గ్రామంలో స్వచ్ఛ పర్యవేక్షణ్ గ్రామీణ్ కేంద్ర బృందం శుక్రవారం పర్యటించింది. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుధ్య పనులు, డ్రైనేజీ వ్యవస్థలను చెత్తసంపద కేంద్రాన్ని, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సభ్యులు పరిశీలించారు. కార్యక్రమంలో కేంద్రం బృంద సభ్యులు పి.రాజేష్, కోటేశ్వరరావు, ఎంపీడీవో శేషుబాబు, డిప్యూటీ ఎంపీడీవో బాలచెన్నయ్య, సర్పంచ్ రాములమ్మ, ఎంపీటీసీ జి.శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఇంటిని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

రచయిత్రి కత్తి కృపావరం మృతి

ఒంగోలు కల్చరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ విశ్రాంత అధికారి, ప్రముఖ రచయిత్రి కత్తి కృపావరం (73) శుక్రవారం ఉదయం ఒంగోలులో మృతి చెందారు. ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో స్థానిక ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) జిల్లా ప్రధాన కార్యదర్శిగా కూడా ఆమె ఉన్నారు. సాహిత్యం పట్ల ఉన్న అభిమానంతో అనేక రచనలు చేశారు. కృపావరం మృతి పట్ల నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, నాగభైరవ సాహిత్యపీఠం అధ్యక్షుడు నాగభైరవ ఆదినారాయణ, సింహాద్రి జ్యోతిర్మయి, నూనె అంకమ్మరావు, బీరం అరుణ తదితరులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు ఆహ్వానం

ఒంగోలు నగరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని పలు గురుకుల పాఠశాలల్లో ఇంటర్, 10వ తరగతి, 5వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లలో అడ్మిషన్ పొందేందుకు ఆయా స్కూళ్ల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని ఏపీ గురుకుల విద్యా సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ ఓ ప్రకటనలో తెలిపారు. నేరుగా ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించి అడ్మిషన్ పొందాలని కోరారు. బాలికల కోసం నడుస్తున్న చీమకుర్తి గురుకుల పాఠశాలలో టెన్త్, సీనియర్ ఇంటర్, శింగరాయకొండలో ఇంటర్, కంభంలో సీనియర్ ఇంటర్, దూపాడులో ఇంటర్, మార్కాపురంలో సీనియర్ ఇంటర్, కొండపిలో సీనియర్ ఇంటర్, రాచర్లలో టెన్త్, సీనియర్ ఇంటర్‌లో ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే బాలుర కోసం నిర్వహిస్తున్న వెలుగొండ పాఠశాలలో 5, 10వతరగతి, ఇంటర్‌లో, అర్ధవీడులో 5, 10వ తరగతి, ఇంటర్, దర్శిలో 10వ తరగతి, సీనియర్ ఇంటర్, కురిచేడులో టెన్త్‌లో ప్రవేశానికి ఖాళీలు ఉన్నట్లు వెల్లడించారు.

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో శనివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ ప్రతినిధులు కేవీజీ.కీర్తి, బి.వెంకటరావు, ఎస్.లక్ష్మీనారాయణ, వై.శ్రీనివాసులు, ఎ.అమ్మయ్య, బి.అశోక్‌కుమార్, పీవీ.సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా విద్యారంగంలో ఏ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ధర్నాలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అవార్డులు


హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు విద్య, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం మంగమూరు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో ఉత్తమ ఎన్ఎస్ఎస్ వలంటీర్లుగా ఎంపికైన విద్యార్థులకు శుక్రవారం అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై ఆంధ్రకేసరి యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ హర్షప్రీతమ్ దేవ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ద్వారా సేవా దృక్పథం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని కోరారు. కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ వై.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో టి.రాజేంద్ర, నీలమ, రవితేజ, వైస్‌ప్రిన్సిపాల్ టి.రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ కోరారు. ఒంగోలులోని జేఏసీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రకేసరి యూనివర్శిటీతో పాటు ట్రిపుల్‌ఐటీని ఒంగోలులో ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా అభివృద్ధికి దొనకొండలో పారిశ్రామిక కారిడార్‌ను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. గత ఎన్నికల సమయంలో ప్రకాశం జిల్లాను రెండు జిల్లాలుగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినందున దానిని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కొమ్ము రాజీవ్, సూర్య, ఈస్టర్, జువేద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సీనియర్స్ మహిళల క్రికెట్ జట్టు ఎంపిక

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ -23, సీనియర్స్ మహిళ క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పీడీసీఏ సెక్రటరీ కారుసాల నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9గంటలకు ఒంగోలు నగరం మంగమూరురోడ్‌లోని అసోసియేషన్ సబ్ సెంటర్‌లో ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. ఎంపికైన జట్టు ఈనెల 14 నుంచి ఎన్టీఆర్ జిల్లా మూలపాడులో జరిగే ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల పోటీలలో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులు జనన ధృవీకరణపత్రం, ఆధార్ కార్డు, స్కూలు స్టడీ సర్టిఫికెట్ జెరాక్స్ కాపీలతో హాజరుకావాలని కోరారు. వివరాల కోసం కోచ్ ఎం.దమయంతి సెల్: 7893720221 నంబరు ద్వారా సంప్రదించాలని ఆయన కోరారు.

నర్సరీ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి


నర్సరీని పరిశీలిస్తున్న సంధ్య

మద్దిపాడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పొగాకు నర్సరీల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని ఉద్యానశాఖ అధికారి డాక్టర్ డి.సంధ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని కొలచనకోట, వెల్లంపల్లి గ్రామాల్లో నర్సరీలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సంధ్య మాట్లాడుతూ నర్సరీల లైసెన్స్ నెంబరు ప్రింట్ చేసిన బిల్లును పొగాకు నారు కొనుగోలుదారులకు ఇవ్వాలని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నర్సరీలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఎంఈవోలను సీనియారిటీ ప్రకారం నియమించాలి


డీఈవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఒంగోలు(రూరల్), ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, జడ్పీ యాజమాన్యాల్లో పని చేసే సీనియర్ స్కూల్ అసిస్టెంట్లను ఎంఈవోలుగా నియమించాలని ఆపస్, పీఆర్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ యాజమాన్యంలోని స్కూల్ అసిస్టెంట్‌లను ఎంఈవో-1గా నియమించే విధానాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వారు కోరారు. ఈమేరకు శుక్రవారం ఒంగోలులో డీఈవో కిరణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఒకే డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు కామన్ సీనియారిటీ ప్రాతిపదికన ఎంఈవోలుగా నియామకాలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.మల్లికార్జునరావు, పి.దిలీప్‌చక్రవర్తి, రాష్ట్ర కార్యదర్శి కె.శ్రావణ్‌కుమార్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అదనపు లోడ్‌ను రెగ్యులర్ చేసుకోవాలి

కొండపి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులు అదనపు లోడ్‌ను రెగ్యులర్ చేసుకోవడానికి ప్రభుత్వం డిసెంబర్ నెలాఖరు వరకు అవకాశం ఇచ్చిందని విద్యుత్‌శాఖ ఏఈ జి.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకొని సర్వీసులను రెగ్యులర్ చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● పింఛన్ల పంపిణీలో ఎంఎల్‌ఏ నారాయణరెడ్డి

మార్కాపురం రూరల్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి). ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఏ కందుల నారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని తూర్పుపల్లి గ్రామంలో శుక్రవారం ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో నాయకులు, అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆప్యాయంగా మాట్లాడారు. వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో శ్రీనివాసులు, మార్కెట్ యార్డు చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, మండల, గ్రామటీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పేదలు లేని సమాజమే లక్ష్యం

పొదిలి : ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచి పేదలు లేని సమాజాన్ని నిర్మించాలనే దృక్పథంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి చెప్పారు. పట్టణంలో నూతనంగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను శుక్రవారం ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ నాయకులు అబద్ధపు ప్రచారాలతో ప్రజలను వంచించే కార్యక్రమాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



గిద్దలూరు పట్టణంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కూటమి ప్రభుత్వం చెప్పిందే చేస్తుంది

కొనకనమిట్ల : కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తోందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి గుర్తు చేశారు. కొనకనమిట్లలో శుక్రవారం ఎన్‌టీఆర్‌భరోసా పింఛన్‌లు పంపిణీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలలో భాగంగా ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు ఆయన పింఛన్‌లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలోమండల టీడీపీ అధ్యక్షుడు మోరబోయిన బాబురావు, టీడీపీ నాయకులు, పలువురు అధికారులు, పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇది సంక్షేమ ప్రభుత్వం

గిద్దలూరు టౌన్ : ప్రభుత్వం ఓ వైపు భారీగా అభివృద్ధి కార్యక్రమాలతోపాటు మరోవైపు పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నదని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో 56 మంది మహిళలకు కొత్తగా మంజూరైన స్పౌజ్ పింఛన్లను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అందజేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో భర్త చనిపోయిన ఏ ఒక్క మహిళకు స్పౌజ్ పింఛన్లు అందజేయలేదని విమర్శించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, మార్కెట్‌యార్డు చైర్మన్ బైలడుగు బాలయ్య, టీడీపీ పట్టణశాఖ అధ్యక్షుడు సయ్యద్ షాన్వావలి, కమిషనర్ రమణబాబు, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

82 వితంతు పింఛన్ల మంజూరు

పెద్దారవీడు : పెద్దారవీడు మండలానికి 82 నూతన వితంతు పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో జాన్ సుందరం తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గొట్టం రామనారాయణరెడ్డి వితంతు పింఛన్లను పంపిణీ చేశారు. నాయకులు వెన్నా వెంకట సుబ్బారెడ్డి, గొట్టం రామకృష్ణారెడ్డి, గాజులపల్లి శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు

పెద్ద దోర్నాల : ప్రస్తుతం రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు నడుస్తోందని, రానున్న వన్నీ మంచి రోజులేనని ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో నూతనంగా మంజూరయిన 81 పింఛన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఎరిక్షన్ బాబు లబ్ధిదారులకు అందజేశారు. పంచాయతీ ఈవో శివ కోటేశ్వరరావు, నాయకులు బట్టు సుధాకర్ రెడ్డి, షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, జనసేన మండల అధ్యక్షులు మురళి తదితరులు పాల్గొన్నారు.



పొదిలిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

పింఛన్ లబ్ధిదారులు ఆర్థికాభివృద్ధి చెందాలి

రాచర్ల : ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్లు పొందే లబ్ధిదారులు పొందుతున్న పింఛన్ల ద్వారా ఆర్థికాభివృద్ధి చెందాలని ఎంపీడీవో ఎస్. వెంకటరామిరెడ్డి అన్నారు. మండలానికి 88 స్పౌజ్ పింఛన్లు మంజూరు కాగా శుక్రవారం ఆయన అనుములవీడు గ్రామంలోని లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

122 నూతన పింఛన్ల మంజూరు

ఎర్రగొండపాలెం రూరల్ : ఎర్రగొండపాలెం మండల వ్యాప్తంగా 122 మంది వితంతు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో వారందరికీ నాలుగు లక్షల 88వేల రూపాయలను పంపిణీ చేసినట్లు ఎంపీడీవో బి. శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు.

ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు

కొమరోలు : అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారునికి ఎన్‌డీఏ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందని కొమరోలు సొసైటీ అధ్యక్షుడు ముత్తుముల సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని సర్విరెడ్డిపల్లి, కొమరోలు గ్రామాల్లో కొత్తగా ప్రభుత్వం మంజూరుచేసిన వితంతువు పింఛన్లను శుక్రవారం పంపిణీ చేశారు.

పగిలిన పైప్‌లైన్.. తాగునీటికి ఇక్కట్లు

తర్లుపాడు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడులో ఓవర్ హెడ్ ట్యాంకుకు వెళ్లే మెయిన్ పైప్‌లైన్‌లు గురువారం పగిలిపోవటంతో ప్రజలకు నీటి కష్టాలు ఏర్పడ్డాయి. బస్టాండ్ సెంటర్‌లో ఇనుప పోల్ మార్చేందుకు మిషన్‌తో రంధ్రం వేయటంతో మంచినీరు సరఫరా చేసే మెయిన్ పైప్‌లైన్ పగిలిపోయింది. దీంతో ఓవర్ హెడ్ ట్యాంకుకు నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ మెయిన్ పైప్‌లైన్ ద్వారానే తర్లుపాడులోని 3 ట్యాంకులకు నీరు ఎక్కిస్తారు. మెయిన్ పైప్‌లైన్ పగలటంతో తర్లుపాడు వాసులు నీటికి కటకటలాడుతున్నారు. పగులగొట్టినవారే బాగుచేయాలని పంచాయతీ అధికారులు చెప్పినప్పటికీ వారు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఈ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయకపోతే తీవ్ర నీటి సంక్షోభం ఏర్పడనుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌లైన్ బాగుచేసి తర్లుపాడు గ్రామానికి వెంటనే నీటి సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సన్మానం

గిద్దలూరు టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సొసైటీ బ్యాంక్ చైర్మన్‌గా, మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సౌజన్యంతో పదవులు పొందిన దుత్తా బాలీశ్వరయ్యను బలిజ సేవా సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. తనపై నమ్మకం ఉంచి పదవులు కేటాయింప చేసిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి బాలీశ్వరయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో బలిజ సేవా సంఘం ప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



రైతులకు పంటల సాగుపై అవగాహన

కంభం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగోజీపల్లి గ్రామంలో వ్యవసాయశాఖ, ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు ఖరీఫ్ పంటలపై సమగ్ర పంటల యాజమాన్యం గురించి ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి మహమ్మద్ కంది, మినుము, పత్తి పంటలలో విత్తనం వేసే దగ్గరి నుంచి కోత వరకు చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

తర్లుపాడు : రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేయాలని మార్కాపురం ఏడీఏ బాలాజీ నాయక్ రైతులకు సూచించారు. తర్లుపాడులోని రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇచ్చారు.

పప్పు ధాన్యాల సాగుతో ఆదాయం

మార్కాపురం రూరల్ :. రైతులు పప్పు ధాన్యాలను సాగు చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు ఆదాయం పెంచుకోవచ్చునని ఏవో బుజ్జిబాయి తెలిపారు. మండలంలోని వేమలకోట గ్రామంలో శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పంటలను పరిశీలించారు.



పింఛన్ల ద్వారా వృద్ధులకు ఆర్థిక స్వావలంబన

డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

దర్శి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.4 వేల చొప్పున పింఛన్లు క్రమం తప్పకుండా పంపిణీ చేస్తుండటంతో వృద్ధులు, వితంతువులకు ఆర్థిక స్వావలంబన లభిస్తుందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భర్తలు చనిపోయిన వితంతువులకు వారి స్థానంలో కొత్త పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వితంతువులకు ఐదేళ్లు పింఛన్లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఇన్‌చార్జి ఎంపీడీవో సుధాకర్, కమిషనర్ వై మహేశ్వరరావు, దర్శి మండల టీడీపీ అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా పాల్గొన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి

వేదన అనుభవిస్తున్న వితంతువులకు ప్రజాప్రభుత్వం స్పౌజ్ పింఛన్లు మంజూరు చేసి కొండంత అండగా నిలిచిందని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు చెప్పారు. పామూరు సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు స్పౌజ్ పింఛన్లను అందచేశారు. ఈ కార్యక్రమంలో అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, ఉప్పలపాటి హరిబాబు పాల్గొన్నారు.

దొనకొండ మండలంలో 110 పింఛన్ల మంజూరు

దొనకొండ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వం అందించే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు వితంతు మహిళల జీవితాలకు భరోసా నింపుతుందని దొనకొండ సర్పంచ్ గ్రేస్‌రత్నకుమారి చెప్పారు. మండలంలోని 18 గ్రామ పంచాయితీల పరిధిలో వితంతువులకు కొత్తగా మంజూరైన పింఛన్‌ను టీడీపీ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు మోడి ఆంజనేయులు మాట్లాడుతూ కొత్తగా మండలంలో 110 మంది వితంతు మహిళలకు పింఛన్ మంజూరయ్యాయన్నారు.

కంభాలదిన్నెలోనూ...

పామూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంభాలదిన్నె గ్రామ పంచాయతీలో నూతనంగా మంజూరైన 11 స్పౌజ్ పింఛన్లను టీడీపీ నాయకులు గోళ్ల భాస్కరరావుతో కలిసి ఎంపీడీవో బ్రహ్మయ్య పంపిణీ చేశారు. మండలానికి స్పౌజ్ పింఛన్లు 114 మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గద్దె గంగయ్యచౌదరి, పంచాయతీ కార్యదర్శి ఇండ్ల హరినారాయణ పాల్గొన్నారు. సీఎస్‌పురం మండలంలోని కోవిలంపాడులో కొత్తగా మంజూరైన స్పౌజ్ పింఛన్లను జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి షేక్ రజబ్‌బాషా, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ ఉపాధ్యక్షుడు రుసుం ఖాజావలి, తలకట్ల రోశయ్య, షేక్ ఖలీల్ పాల్గొన్నారు.

102స్పౌజ్ పింఛన్లు పంపిణీ

పీసీపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 102మందికి ప్రభుత్వం కొత్తగా పింఛన్లు మంజూరు చేసిందని ఎంపీడీవో హనుమంతరావు చెప్పారు. స్థానిక సచివాలయంలో టీడీపీ నేతలతో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్, టీడీపీ నాయకులు వీరపనేని పెద్దన్న, మూలె సత్తిరెడ్డి, పులి ప్రతాప్‌రెడ్డి, గోగాడ మాలకొండయ్య పాల్గొన్నారు.

స్పౌజ్ పింఛన్ మంజూరుతో భరోసా

పామూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పెద్దను కోల్పోయి

వడివడిగా సాగర్ జలాలు

మేజర్లకు చేరుతున్న సాగర్ జలాలు

డీబీసీలో 1700 క్యూసెక్కులు

పరిశీలించిన సీఈ



నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న సీఈ శ్యాంప్రసాద్

దర్శి/కురిచేడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : సాగర్ కుడి కాలువ కింద ఆయకట్టు రైతుల కోసం విడుదల చేసిన సాగర్ జలాలు గురువారం అర్ధరాత్రి 2.40 గంటల సమయంలో కురిచేడు పక్కనే ఉన్న దర్శి బ్రాంచి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను తాకాయి. శుక్రవారం ఉదయం 7 గంటల సమయానికి 800 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండగా సాయంత్రానికి 1700 క్యూసెక్కులకు పెరిగాయి. ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ శ్యాంప్రసాద్ కాలువలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతుల సాగు నీటి అవసరాల కోసం విడుదల చేసిన జలాలు గురువారం అర్ధరాత్రి కురిచేడుకు చేరాయి. ఎన్నెస్పీ అధికారులు ఎప్పటికపుడు నీటి ప్రవాహాన్ని లెక్కించి ఉన్నతాధికారులకు పంపుతున్నారు. అర్ధరాత్రి వచ్చిన నీటి ప్రవాహం నిదానంగా పెరుగుతూ సాయంత్రానికి 1700 క్యూసెక్కులకు చేరింది. శుక్రవారం మధ్యాహ్నానికి దర్శికి చేరుకున్నాయని ఎన్నెస్పీ డీఈఈ అక్బర్ బాషా తెలిపారు. రామతీర్థం జలాశయానికి నీరు చేరే వరకూ మేజర్లకు నీటిని వదల వద్దని సూచనలున్నా చాలా మేజర్లకు షట్టర్లు లేకపోవడంతో నీరు వచ్చీ రాగానే మేజర్లకు చేరాయి. శుక్రవారం సాగర్ జలాశయం వద్ద కుడి కాలువకు 8,604 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా జిల్లా సరిహద్దు 85/3 మైలు వద్ద 2,550 క్యూసెక్కులు వస్తున్నాయి. కురిచేడు పక్కనే ఉన్న దర్శి బ్రాంచి కాలువలో 1700 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. సాగర్ జలాలు శుక్రవారం సాయంత్రానికి ఒంగోలు బ్రాంచ్ కాలువలకు చేరాయి. ప్రస్తుతం 600 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతోంది.

రామతీర్థం చేరేవరకు మేజర్లకు నీటిని విడుదల చేయవదు

చీఫ్ ఇంజనీర్ శ్యాంప్రసాద్

సాగర్ నీరు రామతీర్థం జలాశయం చేరేవరకు మేజర్లకు విడుదల చేయవద్దని సీఈ శ్యాంప్రసాద్ అధికారులకు సూచించారు. సాగర్ కాలువలపై ఆయన పర్యటించారు. దర్శి బ్రాంచి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను పరిశీలించి నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. చందలూరు వద్ద సాగర్ కాలువపై పడిపోయిన బ్రిడ్జిని పరిశీలించారు. ఎస్ఈ వరలక్ష్మీ, ఏఈఈలు రవీంద్రారెడ్డి, సాంబశివరావులు కాలువలను పరిశీలించారు.

సీఎం చంద్రబాబుపైనే ఆశలన్నీ...

దర్శి నియోజకవర్గంలో పెండింగ్‌లో పలు అభివృద్ధి పనులు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులన్నీ పూర్తి చేయాలని ప్రజల విజ్ఞప్తి

దర్శి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ప్రారంభించేందుకు శనివారం దర్శి మండలం, తూర్పువీరాయపాలేనికి వస్తున్న నేపథ్యంలో ఆయన పర్యటనపై నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకొన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా ఆరంభించిన జాతీయస్థాయి డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రం పునాదుల్లోనే నిలిచిపోయింది. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఆ ప్రాజెక్టు నిర్మాణం గురించి అసలు పట్టించుకోలేదు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పునఃనిర్మాణం కోసం నిధుల విడుదల కోసం పలుమార్లు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్‌లతో పాటు సంబంధిత శాఖల మంత్రులను కలిసి అనేకసార్లు విజ్ఞప్తి చేశారు. పథకాల పునఃనిర్మాణానికి అందరూ సానుకూలంగా స్పందించారు. కొన్నింటికి ఇప్పటికే నిధులు విడుదలైనప్పటికీ మరికొన్ని పథకాలకు నిధులు విడుదల కావాల్సి ఉంది. అందులో భాగంగా డ్రైవింగ్ శిక్షణ పరిశోధన కేంద్రానికి రూ.26 కోట్లు అవసరమవుతాయని అధికారులు తాజాగా అంచనాలు తయారు చేసి పంపారు. ఈ ప్రాజెక్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన విషయం తెలిసిందే. అదేవిధంగా గత టీడీపీ ప్రభుత్వంలో ఆరంభించిన కోల్డ్ స్టోరేజీ, క్రీడా వికాస కేంద్రాలు కూడా పునాదుల్లో నిలిచిపోయాయి. దర్శిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆరంభించినప్పటికీ శాశ్వత భవనాలు ఏర్పాటు కాలేదు. స్థలం కేటాయించినందున భవనాల నిర్మాణాలకు నిధులు విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు. 140 గ్రామాలకు మంచినీరు అందించే ఎన్ఏపీ రక్షిత మంచినీటి ప్రాజెక్టు అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా రోడ్ల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని, దర్శిలో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలని ఎత్తిపోతల పథకాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.



దొనకొండ పారిశ్రామిక కారిడార్‌పై సీఎం స్పందిస్తారా ?

చంద్రబాబు పర్యటన సందర్భంగా ప్రజల్లో విస్తృత చర్చ

దొనకొండ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): దొనకొండ ప్రాంతంలో పరిశ్రమల కారిడార్ అభివృద్ధిపై శనివారం నియోజకవర్గానికి విచ్చేస్తున్న సీఎం చంద్రబాబు ఏవిధంగా స్పందిస్తారనేది ప్రజల్లో చర్చనీయాంశమైంది. 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన టీడీపీ.. ప్రభుత్వ భూములు అధికంగా ఉన్న దొనకొండ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. వెంటనే అధికారులు సర్వే చేపట్టి దాదాపు 25వేల ఎకరాల భూములు ఉన్నట్లు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో 2018లో సూక్ష్మ చిన్నతరహా పరిశ్రమల పార్క్ ఏర్పాటు చేశారు. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దొనకొండ కారిడార్‌ను ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో ప్రజల ఆశలు అడియాశలుగానే మిగిలిపోయాయి. మళ్లీ 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చాక చంద్రబాబు, లోకేష్‌లు రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో దొనకొండలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుపై అసెంబ్లీలో విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్ ప్రకటించారు. ఇటీవల ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబు రాష్ట్రంలో ప్రాజెక్టుల ఏర్పాటు పట్ల కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి పలువిషయాలు చర్చించారు. అనంతరం దొనకొండ ప్రాంతంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్(ఐఏఎఫ్)కు చెందిన డిఫెన్స్ మ్యానిఫ్యాక్చర్ హబ్ కింద మిస్సైన్ ఎవినేషన్ ప్రాజెక్టు ఆరువేల ఎకరాల్లో ఏర్పాటుకు విజ్ఞప్తి చేసినట్లు ప్రకటించారు. రాష్ట్రంలో ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కుల పాలసీ కింద పది భారీ పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. అందులో దొనకొండలో 380 ఎకరాల్లో బహుళ ఉత్పత్తుల ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రతిపాదించింది.చిన్నతరహా పరిశ్రమ ఏర్పాటు నిమిత్తం మహారాష్ట్ర ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధులు భూములు పరిశీలించారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ దొనకొండలో పరిశ్రమల ఏర్పాటు నిమిత్తం ప్రభుత్వం దృష్టికి పదేపదే తీసుకెళ్తుండటంతో దొనకొండలో కారిడార్ అభివృద్ధికి టీడీపీ కూటమి ప్రభుత్వం చొరవ చూపిందని ప్రజలు భావిస్తున్నారు.

ఆశాదీపం

(3వ పేజీ తరువాయి)

ఉండగా పర్చూరు ప్రాంతంలో కృష్ణా, పశ్చిమ కాలువలు, దక్షిణ ప్రాంతంలో రాళ్లపాడు, ఒంగోలు సమీపంలో గుండ్లకమ్మ వంటి వనరులు ఉన్నాయి.

భారీగా పడిపోయిన సాగు విస్తీర్ణం

ఉమ్మడి జిల్లా పరిధిలో సాగర్ ఆయకట్టులో 4.34లక్షల ఎకరాల విస్తీర్ణం ఉండగా కృష్ణా పశ్చిమకాలువ పరిధిలో 72వేల ఎకరాలు, గుండ్లకమ్మ కింద 80వేల ఎకరాలు, ఐదు మధ్యతరహా ప్రాజెక్టుల కింద 43వేల ఎకరాలు, మరో 953 చిన్ననీటి చెరువుల కింద లక్షా 35వేల ఎకరాలు, రెండు వందలకుపైగా ఉన్న ఎత్తిపోతల పథకాల కింద మరో లక్షా 40వేల ఎకరాల విస్తీర్ణం ఉంది. అయితే ఒక్క ఏడాది పూర్తిస్థాయిలో ఆయకట్టుకు కాదు కదా సగం విస్తీర్ణానికి కూడా ఆ నీరు అందుతున్న పరిస్థితి లేదు, మాగాణి సాగు అయితే నాల్గో వంతు కూడా ఉండటం లేదు. ఎక్కువ భాగంలో వాణిజ్య, వ్యాపార పంటలను రైతులు వర్షాధారంగా సాగు చేస్తున్నారు. సాగర్‌కాలువలు, అలాగే కృష్ణా పశ్చిమ కాలువ కింద చివరి ప్రాంతంలో జిల్లాలోని భూములు ఉండటంతో అవసరమైన మేర నీరు రావడం లేదు.

పాడి పరిశ్రమ కుదేలు

లెక్కల్లో ఉమ్మడి జిల్లాలో 4.34లక్షల ఎకరాల ఆయకట్టు సాగర్ కాలువల కింద ఉన్నప్పటికీ దాదాపు లక్షన్నర ఎకరాలకు ఏనాడు నీరు అందడం లేదు. మిగిలిన విస్తీర్ణంలో లక్ష ఎకరాల్లో కూడా మాగాణి సాగు చేయలేని పరిస్థితి. గత ఏడాది సాగర్ కాలువల కింద 2.75 లక్షల ఎకరాల్లో సాగు చేయగా 85వేల ఎకరాల్లో మాత్రమే అది కూడా దర్శి, అద్దంకి నియోజకవర్గాల్లోనూ, కొంతమేర వైపాలెం పరిధిలోని త్రిపురాంతకం, ఎస్ఎన్ పాడు పరిధిలోని చీమకుర్తి ఇతరత్రా కొద్దిచోట్ల మాత్రమే సాగు జరిగింది. కృష్ణా పశ్చిమ కాలువ పరిస్థితి కూడా అలాగే ఉంది. దీంతో తిండి గింజలు, పశువుల మేతకు గ్యారంటీ ఉండటం లేదు. జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు వ్యవసాయం తర్వాత ఆసరాగా నిలిచే పాడిపరిశ్రమ కూడా దెబ్బతింది. పాడిరైతులకు బాసటగా నిలిచే ఒంగోలు డెయిరీని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా మూతవేయడంతో ప్రైవేటు డెయిరీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వచ్చి మరింత ఇబ్బందిపడుతున్నారు.

బనకచర్లపైనే ఆశలు

సాగు, తాగునీటి వెతలు తీర్చేందుకు చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టు మొత్తం జిల్లాకు ఆశాదీపంగా కనిపిస్తోంది. 53.50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు పనులు మూడొంతులకుపైగా పూర్తయ్యాయి. శ్రీశైలం నీటిమట్టం 843 అడుగుల నుంచే ప్రాజెక్టుకు నీటిని తీసుకునే అవకాశం కల్పించడంతోపాటు ప్రభుత్వం తాజాగా ప్రతిపాదించి విస్తృత కసరత్తును చేస్తున్న గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు వెలిగొండకే కాక జిల్లాకు వరం కానుంది. బనకచర్ల ఆచరణ రూపుదాల్చితే కృష్ణానదిపై శ్రీశైలం దిగువన ఉన్న ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టు భూములకు గోదావరి జలాలను వాడుకునే అవకాశం ఉంటుంది. దానివల్ల కృష్ణానీటిని శ్రీశైలం ఎగువన ఉన్న ప్రాజెక్టులకు ఇవ్వవచ్చు. అందులో వెలిగొండకు కూడా లబ్ధి చేకూరుతుంది. ప్రాజెక్టు డిజైన్ ప్రకారం వెలిగొండకు కృష్ణాలో నెలరోజులపాటు వరద జలాలు ఉంటేనే నింపుకోవచ్చు. అయితే బనకచర్ల ప్రాజెక్టు రూపుదాల్చితే శ్రీశైలంలో ఎక్కువ రోజులు వెలిగొండకు నీరు తీసుకునే 843 అడుగుల నీటిమట్టం కన్నా అధికంగా నీరు నిల్వ ఉంటుంది. అలాంటప్పుడు ఎక్కువ రోజులు వెలిగొండకు నీటిని తీసుకోవచ్చు. ఆ నీటిని వెలిగొండ ద్వారా జిల్లాలోని ఇతర వనరులకు సరఫరా చేయవచ్చు.

గుండ్లకమ్మకు పుష్కలంగా నీరు

ప్రధానంగా వెలిగొండ ప్రాజెక్టుకు దిగువ ప్రాంతంలో గుండ్లకమ్మ ప్రవహిస్తుండటంతో ఆ నదికి వెలిగొండ నుంచి కృష్ణాజలాలను మళ్లించవచ్చు. దాని వల్ల గుండ్లకమ్మలో పుష్కలంగా నీటి ప్రవాహం ఉండి దిగువన ఉన్న ప్రాజెక్టు ఆయకట్టుతోపాటు వాటి పరిధిలో ఉన్న స్కీంలు, ఇతర వనరులకు నీరు ఇవ్వవచ్చు. అలాగే గుండ్లకమ్మ నీటిని ముసికి కూడా మళ్లించి కొండపి నియోజకవర్గంతోపాటు పొదిలి, సంతనూతలపాడు మండలాల్లోని గ్రామాల్లో ఉన్న వనరులకు పంపించవచ్చు. అలాగే వెలిగొండ పశ్చిమ కాలువ నుంచి దిగువ ప్రాంతాలైన గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల భూములతోపాటు ఆ ప్రాంతంలోని వాగులు, వంకల ద్వారా రాళ్లపాడు ప్రాజెక్టు, మోపాడు రిజర్వాయర్‌తోపాటు చిన్న, పెద్ద చెరువులకు.. పాలేరు, మన్నేరు నదులకు నీరు వెళ్లేలా చేసే అవకాశం ఉంది. అలాగే సాగర్ కాలువలకు సక్రమంగా నీటి సరఫరా జరిగితే ఆ పరిధిలోని ఆయకట్టుకు ఢోకా లేకుండా ఇవ్వడంతోపాటు ఇటు వెలిగొండ, అటు సాగర్ నీరు రెండింటినీ అవకాశం ఉన్న ప్రాంతాల నుంచి గతంలో ప్రతిపాదించి వదిలేసిన సాగర్ రెండో దశ ప్రాంతానికి కూడా నీటిని తరలించే అవకాశాలు ఉన్నాయి.

సమగ్ర ప్రణాళిక ఉంటేనే..

జిల్లాలోని అన్ని ప్రాంతాలకు కృష్ణా జలాలను తరలించేందుకు సమగ్ర నీటి పారుదల కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ఆచరణలో అమలు చేయాలి. అందులో వెలిగొండ పూర్తి అన్నది మరింత కీలకాంశం. ఈ విషయమై 2023 ఆగస్టు తొలివారంలో గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్ద నాడు టీడీపీ అధ్యక్షుడిగా చంద్రబాబునాయుడు ప్రాజెక్టులపై యుద్ధభేరి పేరుతో నిర్వహించిన వర్క్‌షాపులో విస్తృత చర్చ జరిగింది. ఆ సందర్భంగా జిల్లాలోని నీటిపారుదల రంగంపై అధికారంలోకి వచ్చాక సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అమలుకు ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు. కీలకమైన వెలిగొండ పూర్తిచేయడంతోపాటు దాని ఆధారంగా జిల్లాలోని అన్ని ప్రాంతాలకు కృష్ణా జలాలను తరలించేలా తక్షణం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

డెయిరీ కూడా కీలకమే..

వ్యవసాయం కన్నా అధికంగా రాబడి పాడిపరిశ్రమ ద్వారా జిల్లాలో ఉంది. ఆ రంగం ప్రస్తుతం ప్రతికూల పరిస్థితిని ఎదుర్కొంటోంది. ప్రైవేటు డెయిరీలపై పరిశ్రమ ఆధారపడటంతో పశుపోషకులు నష్టపోతున్నారు. దశాబ్దాలపాటు బాసటగా నిలిచిన ఒంగోలు డెయిరీని వైసీపీ ప్రభుత్వం మూసేసింది. ప్రస్తుతం అమూల్ వెళ్లిపోయినా సుమారు రూ.1500 కోట్ల ఆస్తులు, భారీ మిషనరీ, ఫ్యాక్టరీ ఉన్న డెయిరీ మాత్రం మూలనపడింది. తక్షణం ఒంగోలు డెయిరీని పునరుద్ధరించే చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

నేడు జిల్లాకు సీఎం

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 46.85 లక్షల మంది రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాకు వస్తున్నారు. జిల్లాలో అధికంగా రైతులు ఉన్న అలాగే సాగర్ ఆయకట్టు ప్రాంతం, పాడిపరిశ్రమ అధికంగా ఉన్న దర్శి నియోజకవర్గం తూర్పువీరాయపాలెంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ సభకు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాలోని గ్రామీణ ప్రజల ఆర్థికాభివృద్ధికి ఉపకరించేలా సమగ్ర నీటిపారుదల ప్రణాళిక, ఒంగోలు డెయిరీ పునరుద్ధరణపై స్పష్టత ఇచ్చి కార్యాచరణ చేపట్టాలని రైతులు కోరుతున్నారు.





ప్రతి హామీ అమలు : మంత్రి రవి

దర్శి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : ఇచ్చిన హామీలన్నింటినీ ప్రజాప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. సీఎం సభ ఏర్పాట్లు మంత్రి బాలవీరాంజనేయస్వామితో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంను సీఎం చంద్రబాబు దర్శిలో శనివారం ఆరంభించటం ఆనందదాయకమన్నారు. ఆగస్టు 15వ తేదీన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు చెప్పారు. దీంతో సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేసినట్లు అవుతుందన్నారు.

రైతుతో ముచ్చటించిన మంత్రి స్వామి

ముండ్లమూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : రైతులు గిట్టుబాటు ధరలు వచ్చే పంటలు సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాష్ట్ర మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి చెప్పారు. ఆయన శుక్రవారం దర్శి మండలం తూర్పువీరాయపాలెం ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించి ఒంగోలు వెళ్తూ మధ్యలో మండలంలోని పసుపుగల్లు రైతులు సాగు చేసిన కరివేపాకు తోటలను పరిశీలించారు. పంట సాగు విధానం, దిగుబడి గురించి రైతు గూడాల శివశంకర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

కనిగిరి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వై రవీంద్రబాబు కోరారు. స్థానిక దర్శి చంచయ్య భవనంలో శుక్రవారం సీపీఐ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20 నుంచి 25 వరకు ఒంగోలు వేదికగా రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కమ్యూనిస్ట్ ఉద్యమాల ఫలితంగానే పేద, కార్మిక, కర్షక, శ్రామిక వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. జిల్లాలో వివిధ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర మహాసభల్లో ప్రణాళికాబద్ధమైన చర్చ జరుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాసిన్, బాలిరెడ్డి, రామారావు, మోహన్ పాల్గొన్నారు.

వెలిగండ్లలో...

వెలిగండ్ల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు రవీంద్రబాబు, నియోజకవర్గ కార్యదర్శి యాసిన్ కోరారు. ప్రజల్లో మమేకమై ప్రజాసమస్యలపై పోరాడుతూ పార్టీ ఏర్పడిన తర్వాత జిల్లాలో తొలిసారిగా భారత కమ్యూనిష్టు పార్టీ సీపీఐ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరుగుతాయన్నారు. శుక్రవారం వెలిగండ్లలో పలువురు అధికారులను కలిసి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒంగోలులో 30వేల మందితో భారీ ప్రదర్శన 100 డప్పులు వెయ్యి గొంతులతో పురవీధుల్లో నృత్యం చేయనున్నారు. ఈ మహాసభలు ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో నేతలు రామరావు, పందిటి మోహన్, గుజ్జుల బాలిరెడ్డి, గులాం, హుస్సేన్ పాల్గొన్నారు

వృద్ధులకు పింఛన్‌తో భరోసా

అవీఇవీ

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



కొత్తగా మంజూరైన స్పౌజ్ పింఛన్‌దారులతో ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : వృద్ధులకు ఎన్టీఆర్ పింఛన్ భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. మండలంలోని తుమ్మకుంట, శ్రీరంగాపురం గ్రామంలో పింఛన్ పంపిణీ, స్పౌజ్ పింఛన్ల సొమ్మును లబ్ధిదారులకు స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో శుక్రవారం అందజేశారు. తొలిపొద్దునే తుమ్మకుంట గ్రామంలో పర్యటించి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్ నగదు పంపిణీ చేశారు. నూతనంగా మంజూరైన 79 మందికి స్పౌజ్ పింఛన్ నగదును స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, ఎంపీడీవో ప్రభాకర్‌శర్మ, నంబుల వెంకటేశ్వర్లు, తమ్మినేని వెంకటేశ్వర్లు, ఫిరోజ్, బాలు ఓబులురెడ్డి, గాయం తిరుపతిరెడ్డి, మారుతి, దశరథు పాల్గొన్నారు.

హెచ్ఎంపాడు మండలంలో... మండలంలోని నందనవనం గ్రామంలోని జిల్లాపరిషత్ హై స్కూల్‌లో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ విజయవాడ వారి సౌజన్యంతో విద్యార్థులకు ఆర్వో ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి(ఎస్టీఆర్), నాయకులు పెంచికల రామకృష్ణ, ఇన్‌చార్జి ఏడీఏ జైనులాబ్దిన్ పాల్గొన్నారు.

తాళ్లూరులో...

తాళ్లూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : తాళ్లూరు-1 సచివాలయం వద్ద ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.సత్యం ఆధ్వర్యంలో స్పౌజ్ పెన్షన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 116 కొత్త పెన్షన్లు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నేతలు ఇడమకంటి శ్రీనివాసరెడ్డి, మేడగం వెంకటేశ్వరరెడ్డి, జి.వేణుబాబు, జి.లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

ఆన్‌కాల్ డ్రైవర్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి

హయ్యర్ బస్‌ల యూనియన్ ఆధ్వర్యంలో డ్రైవర్ల నిరసన

కనిగిరి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌కాల్ డ్రైవర్స్ రిక్రూట్‌మెంట్‌లో హయ్యర్ బస్సు సీనియర్ డ్రైవర్లు శుక్రవారం ఆయా యూనియన్ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు రామాంజనేయులు మాట్లాడుతూ పదేళ్ళగా కనిగిరి ఆర్టీసీ డిపో పరిధిలో దాదాపు 60 మందికి పైగా హయ్యర్ బస్సు డ్రైవర్లుగా ఆన్‌కాల్ విధానంపై పనిచేస్తున్నామన్నారు. డిపో మేనేజర్ నిరంకుశ వైఖరి వలన సీనియర్లకు అవకాశం ఇవ్వకుండా అనుభవం లేని కొత్తవారికి అవకాశం ఇచ్చి ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడేందుకు ప్రయత్నించటం సరికాదని ఆరోపించారు.

అవినీతి నిర్మూలనే సమాచార హక్కు చట్టం లక్ష్యం

వెలిగండ్ల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : సమాచారం హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ వాసు, మండల అభివృద్ధి అధికారి మహబూబ్ బాషా చెప్పారు. రాష్ట్ర సమాచార కమిషనర్ ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టంపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా ప్రతి ప్రభుత్వ శాఖ నుంచి కావాల్సిన సమాచారాన్ని తీసుకోవచ్చన్నారు. ప్రజలకు పారదర్శకత జవాబుదారీతనంతో కూడిన సమాచారం అందుతుందని చెప్పారు.

తల్లిపాలతోనే బిడ్డకు పూర్ణాయుష్షు

కనిగిరి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాలతోనే బిడ్డకు పూర్ణాయుష్షు లభిస్తుందని గురవాజీపేట ఐసీడీఎస్ సూపర్ వైజర్ పార్వతమ్మ చెప్పారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని లింగారెడ్డిపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు అరగంటలోపు తల్లి ముర్రుపాలు తాగించాలన్నారు. ఆ పాలు శిశువుకు మొదటి టీకా వలే పనిచేసి వ్యాధి నిరోధకశక్తి పెంపొందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్ నాగమణి, అంగన్వాడీ వర్కర్ సరస్వతి, హెల్పర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఆనంద ఆశ్రమాన్ని సందర్శించిన పీఠాధిపతులు

దొనకొండ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక నాల్గురోడ్ల కూడలి యందలి ఆనంద ఆశ్రమంను బ్రహ్మంగారి మఠం బ్రహ్మంగారి మనవరాలు శ్రీ ఈశ్వరీదేవి మఠం పీఠాదిపతులు శ్రీ వీరశివకుమార్ స్వామి శుక్రవారం సందర్శించారు. ఆశ్రమాదిపతి కాకర్ల భైరవానంద స్వామి ఆధ్వర్యంలో పలువురు భక్తులు పీఠాదిపతులకు ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో ఘనంగా సన్మానించారు.



తిండి అంటేనే తిప్పలే..

- బిర్యానీతో రోగాలు
- రంగులు, నిల్వ మాంసంతో తయారీ
- నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలిస్తున్న హోటళ్లు
- డబ్బులు ఇచ్చి జబ్బులను ఆహ్వానిస్తోన్న ఆహార ప్రియులు
- వందల్లో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు..
- రిజిష్టర్ సంఖ్య స్వల్పమే
- నిబంధనల ఊసే కరువు..
- పత్తాలేని ఫుడ్ సేఫ్టీ విభాగం

6లో..







పర్యాటకం.. దొంగలు దొరికారు

రాజస్థాన్ ముఠా గుట్టురట్టు చేసిన పోలీసులు

- బ్యాంకు ఖాతాల ఎండ్ యూజర్‌తో ఛేదించిన ఖాకీలు
- ఇద్దర్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తీసుకుని విచారిస్తున్న పోలీసులు
- దర్యాప్తు బృందాలను ప్రత్యేకంగా అభినందించిన ఎస్పీ తుషార్‌డూడీ

పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాల సందర్శనకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతుంటారు. పర్యాటక శాఖ ఇందుకు సంబంధించి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తుండగా, వీటికి భక్తులు, పర్యాటకుల నుంచి పెద్దఎత్తున ఆదరణ లభిస్తోంది. ఇదే అవకాశంగా కొందరు ఓ ముఠాగా ఏర్పడి ఆన్‌లైన్ మోసాలకు తెరతీశారు. ఆన్‌లైన్‌లో గదులు బుక్ చేసుకోవాలనుకునే వారే లక్ష్యంగా నకిలీ వెబ్‌సైట్లతో ఆకట్టుకుని భక్తులు, పర్యాటకులను దోచేశారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వారు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోక పోవడంతో ఎంతో కాలంగా ఈ ముఠా ఆటలు యథేచ్ఛగా సాగాయి. టీటీడీతో పాటు శ్రీశైలం, మహారాష్ట్ర లోని త్రయంబకేశ్వర్ దేవస్థానాలను కూడా వదలకుండా ఈ ముఠా సైబర్ నేరాలకు పాల్పడింది. సూర్యలంక పర్యాటకులు బాపట్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా.. దేశ వ్యాప్తంగా అనేక పర్యాటక ప్రదేశాల్లో ఈ తరహా సైబర్ మోసాలు వెలుగులోకి వచ్చాయి. 18 రాష్ట్రాల పరిధిలో 127 ఫిర్యాదులు వచ్చినట్లు పోలీసు విచారణలో తేలినా విచారణ మాత్రం బాపట్ల రూరల్ పీఎస్‌లో నమోదైన కేసు ఆధారంగానే జరగడం గమనార్హం.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)
ఏపీటీడీసీ పర్యవేక్షణలో బాపట్ల జిల్లా సూర్యలంక సముద్ర తీరంలో ఉన్న హరిత రిసార్టు పర్యాటకులకు ఆతిథ్యం ఇస్తోంది. ఇక్కడకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. దీంతో వెబ్‌సైట్ ద్వారా గదులను పర్యాటకులు బుక్ చేసుకుంటారు. ఈ క్రమంలో హరితా రిసార్టునే పోలిన వెబ్‌సైట్‌లో గదులు బుక్ చేసుకుని మోసపోయిన పర్యాటకులు గతేడాది జూన్ 16న రిసార్ట్ మేనేజర్ అశోక్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన ఫిర్యాదు ఆధారంగా అదే రోజు బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ దర్యాప్తు సాగుతుండగానే దేశవ్యాప్తంగా అనేక పర్యాటక ప్రదేశాలలో ఈ తరహా సైబర్ మోసాలు (మిగతా 6వ పేజీలో)

వెలుగులోకి తెచ్చిన.. ఆంధ్రజ్యోతి

'పర్యాటకంలో సైబర్ దొంగలు' శీర్షికన ఈ ఏడాది జనవరిలో ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలలో కూడా ఈ ముఠా దందా యథేచ్ఛగా సాగుతున్నట్లు వివరించింది. ఆ తర్వాత పోలీసుల విచారణలో వేగం పెరిగింది. వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టిన బాపట్ల పోలీసులు ఎట్టకేలకు సైబర్ నేరగాళ్ల మోసాలకు చెక్‌పెట్టారు.

ఆ రోడ్డుపై ప్రయాణం.. ప్రమాదకరం

19 కిలోమీటర్ల దూరం.. రెండున్నర గంటల ప్రయాణం

- రూ.4.4 కోట్లు మంజూరైనా ఏడాదిన్నరగా పనులు చేయని కాంట్రాక్టర్

అమృతలూరు, తెనాలి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తెనాలి నుంచి చెరుకుపల్లికి అమృతలూరు మీదగా వెళ్లాలి. దూరం కేవలం 19 కిలోమీటర్లు. కాగా వాహనంపై 30 నిమిషాల లోపు గమ్యస్థానానికి చేరుకోవచ్చు. అయితే ఇక్కడ మాత్రం రెండున్నర గంటలు.. కొంచెం జాగ్రత్తగా వెళ్లే వారికి మూడు గంటలు పడుతుందంటే ఈ రోడ్డు ఎంత అధ్వానంగా ఉందో తెలుసుకోవచ్చు. తెనాలి-కూచిపూడి మధ్య, కూచిపూడి-గోవాడ మధ్య మోకాళ్ల నుంచి నడుము లోతులో గుంతలతో ఈ రోడ్డు ఉంది. రోడ్డు గుంతలు పడిపోవడంతో మొత్తం తవ్వి వదిలేసి 6 నెలలవుతోంది. అప్పటి నుంచి దీనిని పట్టించుకున్న నాథుడేలేడు. దీంతో రాళ్లులేచి, అవి సూదిమొనల్లా తయారై వాహనదారులను ప్రమాదాలకు గురిచేస్తున్నాయి. ద్విచక్ర వాహనంపై వెళ్లేవారు సురక్షితంగా గమ్యం చేరతారన్న నమ్మకం కూడా లేదంటే రోడ్డు పరిస్థితి అర్థంచేసుకోవచ్చు. గోవాడ నుంచి చెరుకుపల్లి మధ్య మాత్రం కొంతవరకు పర్వాలేదనిపించినా, ప్యాచ్ వర్కులు జరగలేదు. మరోపక్క తెనాలి-కూచిపూడి-చందోలు మార్గం కూడా ఇంతే దారుణంగా మారింది. సింగిల్ రోడ్డు కావటం, రోడ్డంతా భారీ గోతులుగా మారిపోవడంతో వాహనాలు బోల్తాపడుతున్న పరిస్థితి కూడా ఉంది. ఆ రోడ్డుపై ప్రయాణం ఒక సాహస యాత్రగా వాహనచోదకులు భావిస్తున్నారు. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా అంతే సంగతులు అన్నట్లుగా రోడ్డు మారింది. కార్లు, బస్సుల టైర్లకు రాళ్ళ దెబ్బలు తగిలి పంక్చర్ అవడం సర్వసాధారణంగా మారింది. ఇక టైర్ల కింద రాళ్లు పడి అవి తూటాల్లా దూసుకొచ్చి సమీప పొలాల్లో ఉన్న రైతులు గాయపడిన ఘటనలు అనేకం. రూ.4.4 కోట్ల నిధులు మంజూరై ఏడాదిన్న దాటినా కాంట్రాక్టర్ పనులు చేయడంలేదు. పనుల పూర్తికి గడువు ఇక నెల మాత్రమే ఉంది. అంటే సంవత్సరన్నర చెయ్యని పనులు నెలలో పూర్తిచేస్తారా అనేదికూడా సందిగ్ధమే. ఆర్.అండ్.బీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఈమార్గంలో రాకపోకలు సాగించే వాహన చోదకులకు ప్రాణ సంకటంగా మారింది.



తెనాలి-కూచిపూడి రోడ్డుపై భారీ గుంతలు

పర్యవేక్షణా లోపం..

అమృతలూరు ఆర్అండ్‌బీ ఏఈగా రెగ్యులర్ అధికారి లేరు. దీంతో పర్చూరు ఏఈకి అదనపు బాధ్యతలు అప్పగించారని సమాచారం. ఈయన ఈ రెండు మండలాలే కాకుండా ఇంకొల్లు, చీరాల మండలాలకు సంబంధించిన బాధ్యతలు చూడాల్సి ఉంది. దీంతో ఎక్కడా పూర్తిస్థాయి పర్యవేక్షణ లేక, పనులు ఎక్కడికక్కడే ఆగి పోతున్నాయి. అమృతలూరు-గోవాడ మధ్య 8.56 కి.మీటర్ల పొడవునా భారీ గుంతలను పూడ్చేందుకు కూటమి ప్రభుత్వం రూ.86 లక్షలను ఎమ్మెల్యే ఆనందబాబు తీసుకురాగలిగారు. కానీ వీటితోనూ పనులు వేగవంతం చేయించే పరిస్థితి అధికారుల్లో కొరవడింది. ఇన్‌చార్జి ఏఈ శ్రీకాంత్‌ను వివరణ కోరగా పనులకు కాంట్రాక్టర్ ముందుకు రాలేదని, తమ ఒత్తిడితో ఇటీవల అంగీకారం తెలిపారన్నారు. ప్యాచ్ వర్కులను త్వరలో పూర్తిచేస్తామన్నారు.



- కూచిపూడి-అమృతలూరు రోడ్డు దుస్థితి

మొనలుతేలిన రాళ్లు

ఏడాదిలో 10 లక్షల మందికి ఉపాధి

- సూపర్ సిక్స్ కాదు.. సూపర్ 12 అమలు
- రేపల్లె సభలో మంత్రులు, పార్థసారథి, సత్యప్రసాద్

రేపల్లె, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనలో రాష్ట్రంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా.. పది లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించేలా చేశామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. స్థానిక మార్కెట్‌యార్డులో రేపల్లె, కూచినపూడి మార్కెట్‌యార్డుల పాలకవర్గాల ప్రమాణస్వీకారోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగన్‌రెడ్డి తన హయాంలో 10 లక్షలకోట్లు అప్పు, లక్షల టన్నుల చెత్త తప్ప ఏమీ తీసుకురాలేదన్నారు. రాష్ట్ర ప్రగతిని చూసి ఓర్వలేని జగన్ బ్యాచ్ అప్పులు రాకుండా చేసేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తున్నామని తెలిపారు. సూపర్ సిక్స్‌కాదు.. సూపర్ 12 పథకాలు అమలు చేస్తామన్నారు. అబద్ధాలతో ప్రజలను నమ్మించి 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని 40 ఏళ్ళు వెనక్కి తీసుకు వెళ్లారన్నారు. విజనరీ చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్‌తో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నామన్నారు. వైసీపీ బ్యాచ్ అమరావతి రాజధానిపై ఇప్పటికీ కారుకూతలు కుస్తుందన్నారు. మహిళలను గౌరవించే సంస్కారం వైసీపీకి లేదన్నారు. కూచినపూడి మార్కెట్‌యార్డులో పక్కా భవనాలు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. రేపల్లె, కూచినపూడి మార్కెట్ యార్డు ఛైర్మన్లుగా మత్తి అనురాధ, ఓగిబోయిన వెంకట్‌యాదవ్‌తో పాటు డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు, కృష్ణాపశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పంతాని మురళీధరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, అనగాని శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



యార్డు ఛైర్మన్ల ప్రమాణ స్వీకార సభలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి

అట్రాసిటీ కేసులో నిందితుడికి నాలుగేళ్ల జైలు

అద్దంకి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో మండలంలోని తిమ్మాయపాలేనికి చెందిన అట్లూరి నాగ సత్యనారాయణ (సత్యం)కు నాలుగేళ్ల జైలుశిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ ఒంగోలు 7వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, స్పెషల్ ట్రైల్ ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి రాజా వెంకటాద్రి శుక్రవారం తీర్పు చెప్పినట్లు అద్దంకి టౌన్ సీఐ సుబ్బరాజు తెలిపారు. ఇందుకు సంబంధించి సీఐ తెలిపిన వివరాలు.. సంతమాగులూరు మండలం తంగేడుమల్లికి చెందిన ఉయ్యాల రాంబాబుకి, అద్దంకికి చెందిన పల్లపు రమాదేవితో 2005లో వివాహం జరిగింది. వారికి ఇద్దరు సంతానం. కాగా మనస్పర్థలతో దంపతులు విడివిడిగా ఉంటున్నారు. రమాదేవి, అద్దంకి మండలం తిమ్మాయపాలేనికి చెందిన అట్లూరి నాగసత్యనారాయణతో సహజీవనం చేస్తూ అద్దంకిలోని మారుతీ వైన్స్ వద్ద బడ్డీకొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో రమాదేవి తన పెద్ద కుమారుడ్ని చదివించలేనని రాంబాబు వద్దకు పంపింది. దీంతో రాంబాబు కుమారుడ్ని తీసుకుని అద్దంకిలో రమాదేవి ఉండే బడ్డీ కొట్టు వద్దకు రాగా వారి మధ్య గొడవ జరిగింది. ఈ సమయంలో దుకాణంలో ఉన్న నాగసత్యనారాయణ కల్పించుకుని రమాదేవితో గొడవ పడుతున్న రాంబాబును చాకుతో గాయపరిచాడు. అప్పటి ఎస్ఐ సుబ్బరాజు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి స్పెషల్ పీపీ ప్రశాంతికుమారి కోర్టులో వాదనలు వినిపించారు. నిందితుడికి శిక్ష పడేలా పనిచేసిన అప్పటి ఎస్ఐ ప్రస్తుతం సీఐగా ఉన్న సుబ్బరాజు, ఏఎస్ఐ సుధీర్‌లను ఎస్పీ తుషార్‌డూడీ అభినందించారు.



బాబు పాలనలో.. ప్రాజెక్టులన్నింటికీ.. జలకళ

- 75 రోజుల్లో వెల్లటూరు ఆక్విటెక్ పూర్తి
- 35 వేల ఎకరాలకు సాగునీరు
- ప్రారంభోత్సవంలో మంత్రి అనగాని, ఎమ్మెల్యే ఆనందబాబు

రేపల్లె, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ నిండుకుండలా కళకళలాడుతున్నాయని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం భట్టిప్రోలు మెయిన్ డ్రెయిన్‌పై నిర్మించిన వెల్లటూరు ఆక్విటెక్‌ను మంత్రి అనగాని ఎమ్మెల్యే ఆనంద్‌బాబు, కలెక్టర్ వెంకటమురళితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకుస్థాపన చేసిన 75 రోజుల్లోనే ఆక్విటెక్‌ను నిర్మించడం ఓ రికార్డుగా పేర్కొన్నారు. రైతులకు ఖరీఫ్ సీజన్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు రూ.10.75 కోట్లతో నిర్మించిన ఈ ఆక్విటెక్ ద్వారా వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లోని 35 వేల ఎకరాల సాగునీరు సౌకర్యం కలుగుతుందన్నారు. గత వైసీపీ పాలనలో కనీసం మరమ్మతులు కూడా నిర్వహించకపోవడంతోనే ఆక్విటెక్ గతేడాది కూలిపోయిందన్నారు. రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో.. యుద్ధ ప్రాతిపదికన ఆక్విటెక్‌పనులు పూర్తిచేశామన్నారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి అని పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైసీపీలో కాల్వలు, డ్రెయిన్లకు కనీస మరమ్మతులు నిర్వహించిన దాఖలాలు లేవన్నారు. కృష్ణా పశ్చిమడెల్టాలో రూ.వందల కోట్లు వెచ్చించి కాల్వలు, డ్రెయిన్ల మరమ్మతులు నిర్వహించి చివరి భూముల వరకు సాగు నీరు అందించేలా కృషి చేశామన్నారు. ఆక్విటెక్‌ను మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ తక్కువ కాలంలో రైతుల ప్రయోజనాల కోసం దగ్గరుండి పూర్తి చేయించారని కొనియాడారు. ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ రైతుల కోసం ఆక్విటెక్ నిర్మాణం తక్కువ కాలంలోనే పూర్తి చేయడం జరిగిందని, రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తొలుత వెల్లటూరు మెయిన్ కెనాల్ నుంచి భట్టిప్రోలు కాల్వకు పూజలు నిర్వహించి, సాగునీటిని మంత్రి అనగాని, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, కలెక్టర్ వెంకటమురళి విడుదల చేశారు. మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, ఆర్డీఓ రామలక్ష్మి, కృష్ణాపశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పంతాని మురళీధరరావు, రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతుల్లో.. ఎత్తిపోతలు

అధికారుల నిర్లక్ష్యంతో రైతుల ఆందోళన

చీరాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పేరుకు ఎత్తిపోతల పథకాలు ఉన్నా యి.. అయితే అవి పని చేయక రైతులు సాగునీటి కోసం అల్లాడుతున్నారు. చీరాల నియోజకవర్గంలో సాగు జఠిలంగా మారి రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. పర్యవేక్షణా లోపంతో ఎత్తిపోతల పథకాలు మూలనపడినా అటు అధికారులు, ఇటు పాలకులు పట్టించుకోవడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులపై ఇరిగేషన్ అధికారులు చేతులు దులుపుకుంటుండగా పర్యవేక్షణ సాగిస్తున్న ఇరిగేషన్ అనుబంధ సంస్థ ఐడీసీలో అధికారులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. తోటవారిపాలెం, గవినివారి పాలెం, అక్కయ్యపాలెం, నాయనిపల్లి ఎత్తిపోతల పథకాలపై ఆధారపడి చీరాల మండలంలో 1500, వేటపాలెంలో 1200 ఎకరాల వరకు ఖరీఫ్‌లో వరి, వేరుశనగ, మొక్కజొన్న పంటలను రైతులు సాగు చేస్తారు. అయితే రెండేళ్లగా ఆయా పథకాలు మరమ్మతులకు గురై రైతులు అవస్థలు పడుతున్నారు. గవినివారిపాలెం పథకంలో యంత్రాలు పూర్తిగా స్తంభించాయి.



గవినివారిపాలెంలో మూలనపడ్డ పథకం యంత్రాలు

సమాధానం చెప్పే వారే లేరు..

ఎత్తిపోతల పథకాల పర్యవేక్షణను నీటిపారుదలశాఖ ఐడీసీ సంస్థకు అప్పగించింది. ఈ క్రమంలో ప్రస్తుతం అందుకు సంబంధించి చీరాల డివి జన్ పరిధిలో రైతులకు సమాధానం చెప్పేందుకు ఏ అధికారి కూడా అం దుబాటులో లేరు. డివిజన్‌లో గతంలో ఒక డీఈ, ఒక ఏఈ కొంత మంది కాంట్రాక్టు కార్మికులు ఉండేవారు. అయితే జీత భత్యాలు లేకపోవడంతో వీరిలో అలసత్వం పెరిగింది. పర్యవేక్షణ లోపంతో యంత్రాలు మొరాయి స్తున్నాయి. అధికారులు తమ గోడు పట్టించుకోవాలని రైతులు కోరుతున్నారు.

అన్నదాత సుఖీభవ.. లబ్ధి నేడే

- జిల్లాలో అర్హులైన రైతులు 1,58,300 మంది
- నేడు కొల్లూరులో పథకాన్ని ప్రారంభించనున్న మంత్రి కొలుసు

(బాపట్ల, కొల్లూరు, ఆంధ్రజ్యోతి)
సూపర్ సిక్స్‌లో మరో పథకం అమలుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పీఎం కిసాన్‌తో రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం లింకై ఉంది. దీంతో కేంద్రం శనివారం పీఎం కిసాన్ నిధులు విడుదల చేస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్నదాత సుఖీభవ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రకటించింది. ఈ క్రమంలో ఖరీఫ్ పెట్టుబడుల కోసం ఎదురు చూస్తున్న వేళ అన్నదాత సుఖీభవ పథకం నిధులను శనివారం వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,58,300 మంది రైతులు ఈ పథకానికి అర్హులుగా వ్యవసాయ శాఖ తేల్చింది. పీఎంకిసాన్ రూ.2వేలు, సుఖీభవ రూ.5 వేలు మొత్తంగా ఒక్కొక్క రైతు ఖాతాలో రూ.7 వేలు జమ చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అనర్హుల జాబితాలో ఉన్న సుమారు 8,300 నుంచి అభ్యంతరాలు అందగా ఇందులో 3,200 మందిని నిబంధనల ప్రకారం పథకానికి అర్హులుగా అధికారులు తేల్చి తుదిజాబితాలో చేర్చారు. ఈకేవైసీతో పాటు వేలిముద్రలు పడకపోవడం వంటి కారణాలతో పథకానికి అర్హత ఉన్నప్పటికీ 3,800 మంది రైతులకు జాబితాలో చోటు దక్కలేదు.

పండుగ వాతావరణంలో ప్రారంభం..

అన్నదాత సుఖీభవ మొదటి విడత నగదు పంపిణీని గ్రామస్థాయిలో పండుగ వాతావరణంలో నిర్వహించాలని ప్రభుత్వం జిల్లా యంత్రాంగానికి సూచించింది. ప్రజా ప్రతినిధులు, రైతులను ఈ కార్యక్రమంలో భాగస్వాములు చేయాలని ఆదేశించింది. దీంతో జిల్లా స్థాయిలో ఈ కార్యక్రమానికి కొల్లూరులోని ఎంప్లాయీస్ రిక్రియేషన్‌ను వేదికగా చేసి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొల్లూరులో ఈ పథకాన్ని ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొననున్నట్లు టీడీపీ మండల టీడీపీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ తెలిపారు.



పమిడిపాడు హైస్కూల్‌లో విద్యార్థులకు భోజనంలో మజ్జిగ పోస్తున్న రిటైర్డ్ ప్రొఫెసర్ జాగర్లమూడి వెంకటేశ్వర్లు

విద్యార్థులకు రోజూ మజ్జిగ

మేదరమెట్ల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ మధ్యాహ్నం భోజనం అందిస్తోంది. వారికి పెరుగు, మజ్జిగను ప్రభుత్వం ఇవ్వడం లేదు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో పమిడిపాడు గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ జాగర్లమూడి వెంకటేశ్వర్లు పాఠశాల విద్యార్థులకు రోజూ భోజనంలో మజ్జిగ అందించడానికి ముందుకు వచ్చారు. పాఠశాల నడిచిన ప్రతిరోజూ విద్యార్థులకు సరిపడా పాలను ఆయన పంపిస్తున్నారు. మధ్యాహ్న భోజన సిబ్బంది వాటిని మజ్జిగా మార్చి విద్యార్థులకు అందిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొంతు అంజయ్య తెలిపారు.

దొంగలు దొరికారు

(5వ పేజీ తరువాయి)

వెలుగులోకి వచ్చాయి. ఒక్క సూర్యలంకలోని హరిత రిసార్టు పేరిటనే 49 ఫిర్యాదులు వచ్చాయి. ఏపీ, తెలంగాణలో కలిపి 59 ఫిర్యాదులు రాగా దేశంలోని 18 రాష్ట్రాల పరిధిలో 127 ఫిర్యాదులు నమోదయ్యాయి. అయితే రాజస్థాన్‌లో రెండు, బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఒక్కటి మాత్రమే కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో సైబర్ నిందితులను పట్టుకోవడానికి బాపట్ల జిల్లా పోలీసులు దాదాపు ఏడాది పాటు శ్రమించి ముఠా గుట్టురట్టు చేశారు. సూర్యలంక తీరంలోని హరిత రిసార్ట్ పేరితో 49, తిరుమల, శ్రీశైలం, త్రయంబకేశ్వర్ దేవస్థానాల పేరిట 11, మేరు మహాదేవ్ రిసార్ట్ పేరుతో 2 నకిలీ వెబ్‌సైట్లు, ఇతర హోటల్ గదుల బుకింగ్ మోసాలు 12తో పాటు ఓఎల్ఎక్స్ స్కామ్‌లు, ఫేక్ ఐడెండిటీలు, యూపీఐతో పాటు ఇతర ఆన్‌లైన్ మోసాలు 52 వరకు చేసినట్లు పోలిసులు ప్రాథమికంగా తేల్చారు. ఈ నకిలీ సైట్ల ద్వారా సుమారు రూ.50 లక్షలు కొల్లగొట్టారని నిర్ధారించారు. అమాయకపు విద్యార్థులకు డబ్బు ఆశచూపి వారి చేత బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేయించి ఆ అకౌంట్ నంబర్లనే వెబ్‌సైట్లలో మార్చిమార్చి ఉంచి మోసాలకు తెరతీశారు. అక్కడ నుంచి మరో ఖాతాకు ఇలా దాదాపు 5 అకౌంట్లు మారిన తర్వాతనే తమ ఖాతాలకు సొమ్ము వచ్చేలా నిందితులు జాగ్రత్త పడ్డారు. ఎండ్ యూజర్‌ల వివరాలు రాజస్థాన్‌లోని దిగ్ జిల్లా సహసన్ ప్రాంతం అని పోలీసుల విచారణలో తేలింది. అక్కడ రెండు వారాలు దర్యాప్తు చేపట్టిన పోలీసులు జూలై 23న పరంజిత్(20), బిట్టూ(21)లను అదుపులోకి తీసుకుని వారి నుంచి 5జీ మొబైల్‌తో పాటు రెండు సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అక్కడ స్థానిక కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ రిమాండ్ ద్వారా గుంటూరు జిల్లా జైలుకు తరలించిన పోలీసులు విచారణ కోసం నిందితులను రెండురోజుల పాటు కస్టడీలోకి తీసుకున్నారు. ఈ సైబర్ నేరాల వెనక మరికొంత మంది కూడా ఉన్నారని వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

రెండు టీంలు.. పక్కా ప్రణాళికతో

ఈ కేసు విచారణకు సంబంధించి రెండు టీంలను ఎస్పీ తుషార్ డూడీ నియమించారు. ఏడుగురు పోలీసులతో ఐటీ సైబర్ కోర్ టీంను, ఐదుగురు పోలీసులతో విచారణ అండ్ ఫీల్డ్ టీం ఇంకోదానిని ఏర్పాటు చేసి నిత్యం దర్యాప్తు పురోగతిని పర్యవేక్షించారు. బ్యాంకు ఖాతాలు మొదలుకుని ఐఎఫ్ఎస్‌సీ కోడ్ల వరకు ఏ ఒక్క సాంకేతిక అంశాన్ని వదలకుండా జల్లెడ పట్టారు. ఐపీ అడ్రస్‌లను నిత్యం ట్రాక్‌లో ఉంచుతూ మూలాలు తెలుసుకోవడంలో విజయం సాధించారు. పోలీసు విచారణలో భాగంగా తొలుత ముగ్గురు విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లోకి ఈ నగదు వెళ్లినట్లు గుర్తించారు. వీరంతా కూడా రాజస్థాన్‌కు చెందిన వారు కావడంతో అక్కడకే వెళ్లి విచారణ చేపట్టారు. అమాయక విద్యార్థులను ఎరగా వేసి సైబర్ నేరగాళ్లు పబ్బం గడుపుకున్నారని పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత పక్కా ఆధారాలతో రెండోసారి రాజస్థాన్ వెళ్లిన పోలీసులు దాదాపు రెండు వారాల పాటు అక్కడ విచారణ జరిపి నిందితులను గుర్తించారు. రాజస్థాన్‌లోని దిగ్ జిల్లాలోని సహసన్ ప్రాంతానికి కొత్త వ్యక్తులు వెళ్లడం దాదాపు అసాధ్యం. పైగా అక్కడ స్థావరం ఏర్పాటు చేసుకున్న నిందితులు బయటి నుంచి ఆ ప్రాంతంలోకి ఎవరైనా వ్యక్తులు వస్తే తెలిసే విధంగా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో రెండు సార్లు ప్రయత్నించి విఫలమైన పోలీసులు అక్కడ స్థానికంగా ఉన్న ఫారెస్ట్ అధికారి సాయంతో ఎట్టకేలకు నిందితులను అదుపులోకి తీసుకోగలిగారు.

ప్రత్యేక అభినందనలు తెలిపిన ఎస్పీ

ఎన్నో కష్ట నష్టాల కోర్చి ఈ కేసును ఛేదించిన రెండు టీంలను ఎస్పీ తుషార్ డూడీ ప్రత్యేకంగా అభినందించారు. ఇదే సమయంలో నకిలీ వెబ్‌సైట్ల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనుమానాస్పద లింకులు క్లిక్ చేయవద్దని, గదులు బుకింగ్ చేసే ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ మోసాల బారిన పడిన వారు టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ తుషార్ డూడీ కోరారు.

పక్కవీధికెళ్లాలంటే.. 8 కిలోమీటర్లు ప్రయాణం

- పదేళ్లుగా అవస్థలు పడుతున్న తిమ్మనపాలెం ప్రజలు
- హైవేలో చాలాచోట్ల ఇదే పరిస్థితి

మేదరమెట్ల, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారికి రెండువైపులా ఉన్న తిమ్మన్నపాలెం వాసులుకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. ఒక వీధి నుంచి ఇంకో వీధికెళ్లాలంటే 8 కిలోమీటర్లు తిరిగిరావల్సి వస్తోంది. గ్రామస్తులు పదేళ్ల ఇదే నరకం అనుభవిస్తున్నారు. జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా నిర్మించేటప్పుడు తిమ్మనపాలెం వద్ద పశువులు రోడ్డు దాటడానికి వీలుగా పశువుల నడకదారి (క్యాటిల్ అండర్ పాస్) నిర్మించారు. రైతులు పశువులను ఈ అండర్ పాస్ నుంచి తోలుకు వెళ్లేవారు. జాతీయ రహదారికి రెండు పక్కల ఉన్న గ్రామంలోకి వెళ్లడానికి వీలుగా అక్కడ ఖాళీ వదిలారు. ఆ ఖాళీ నుంచి ప్రజలు, వాహనాలు అటు ఇటు ప్రయాణించేయి. దాదాపు 2500 జనబా ఉన్న తిమ్మనపాలెం గ్రామం రోడ్డుకు రెండు వైపుల ఉంది. పడమర వైపు యర్రబాలెం వెళ్లే రోడ్డులో ఎంతో చరిత్ర కలిగిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉంది. జాయతీ రహదారిని 6 వరుసలుగా (6 లైన్స్‌గా) విస్తరించినప్పుడు కూడా గ్రామస్థుల రాకపోకలకు వీలుగానే నిర్మించారు. రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, రోడ్డు మధ్య నున్న గ్యాప్‌ను మూసి వేశారు. రోడ్డు దాటే సమయంలో 8 మంది మరణించడంతో పాటు అనేక మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఆ కారణంతో రాకపోకలకు వీలులేకుండా ఆ ఖాళీని మూసి వేశారు. ఇది జరిగి పది సంవత్సరాలు కావస్తోంది. ఇప్పుడు రోడ్డుకు పడమర వైపు ఉన్న వాళ్ల రోడ్డుకు తూర్పున ఉన్న వీధికి వెళ్లాలంటే మేదరమెట్ల వచ్చి అండర్ పాస్ నుంచి వెనుదిరిగి వెళ్లాల్సి వస్తోంది. రోడ్డుకు తూర్పు వైపు ఉన్నవారు పడమర వైపు వెళ్లాలంటే 200 మీటర్లు కూడా లేని ఈ దూరానికి గ్రోత్ సెంటర్ వరకు వెళ్లి తిరిగి రావడానికి 2 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. జాతీయ రహదారిని 6 వరుసలుగా నిర్మించినప్పుడు కొత్త అండర్ పాస్ నిర్మించకుండా పాత పశువుల దారిని విస్తరించారు. ఈ అండర్ పాస్ నిర్మాణం ఉన్న చోట రోడ్డు కొద్దిగా మలుపు ఉంటుంది. దీని వల్ల క్యాటిల్ అండర్ పాస్‌లో నిళ్లు నిలవడంతోపాటు ఇది 5 అడుగుల ఎత్తునే ఉండడంతో మనుషులు నిలబడి వెళ్లడానికి కూడా వీలు లేకుండా ఉంది. గత కొన్ని ఏళ్లగా గ్రామస్తులు గ్రామంలో రెండువైపుల రాకపోకలకు వీలుగా 12 అడుగల ఎత్తులో అండర్ పాస్ నిర్మించాలని కోరుతున్నారు. జాతీయ రహదారి అధికారులు ఇప్పటికైన స్పందించి గ్రామస్థులకు ఉపయోగకరమైన అండర్ పాస్ నిర్మించాలని కోరుతున్నారు.



తిమ్మనపాలెం వద్ద ఉన్న హైవే కింద మూసుకుపోయిన పశువుల నడకదారి



నీళ్లతో నిండి ఉన్న క్యాటిల్ అండర్ పాస్

బాలికల విద్యతోనే సమాజాభివృద్ధి

- 35 ఏళ్ల నుంచి ఉచిత విద్యను అందించటం హర్షణీయం
- శ్రీకృష్ణ చాముండేశ్వరి మహర్షి
- విద్యార్థినులకు రూ.2 లక్షల విలువైన వస్తువుల బహూకరణ



పర్చూరులోని బాలికల పాఠశాల విద్యార్థినులకు విద్యా సామగ్రిని పంపిణీ చేస్తున్న చామండేశ్వరి హహర్షి, దాతలు

పర్చూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : బాలికలకు విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని శ్రీ కృష్ణ సేవా సంస్థానం పీఠాధిపది డాక్టర్ శ్రీ కృష్ణ చాముండేశ్వరి మహర్షి అన్నారు. శుక్రవారం పర్చూరులోని బాలికల పాఠశాల విద్యార్థినులకు దాతల సహకారంతో రూ.2లక్షల విలువైన స్కూల్ యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, వాటర్ బాటిల్స్ ఇతర స్కూల్ సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీఠాధిపతి మాట్లాడుతూ బాలికలు విద్యావంతులైతే కుటంబ వ్యవస్థ బలపడుతుందని, తద్వారా దేశం కూడా అభివృద్ధి చెందుతుందని అన్నారు. గ్రామీణ బాలికలను విద్యావంతులను చేయాలన్న సంకల్పంతో క్రిష్ణంశెట్టి కనకయ్య పర్చూరులో ప్రాంతీయ విద్యాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో పాఠశాలను ఏర్పాటు చేసి 35 సంవత్సరాల నుంచి దాతల సహకారంతో ఉచిత విద్యను అందించటం హర్షించదగ్గ విషయం అన్నారు. తొలుత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కనకయ్య కాంశ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ క్రిష్ణంశెట్టి రమేష్ బాబు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ) కొల్లా నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



బల్లికురవ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న అదికారులు

బల్లికురవ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను తీసుకోవడం వలన జీవితాలు నాశనం అవుతాయని ఎస్ఐ నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాపట్ల జిల్లా కేంద్రం నుంచి వచ్చిన లీగల్ టీం సభ్యులతో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం గంజాయి, సిగరెట్ తాగడం వలన కలిగే ప్రమాదాల గురించి వివరించారు. అలానే జూదం అనేది పెద్దప్రమాదం అని తెలిపారు. కార్యక్రమంలో పలువురు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మార్టూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలలపూడి గ్రామానికి చెందిన గాలి యుగంధర్(20) అనే యువకుడు మంగళగిరిలోని ఎయిమ్స్ లో చికిత్సపొందుతూ గురువారం మృతిచెందినట్లు యువకుని తండ్రి గాలి ప్రసన్న శుక్రవారం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు గాలి ప్రసన్న, అనిత దంపతులకు ఇద్దరు కుమారులు. వీరి రెండవ కుమారుడు యుగంధర్ ఇంటర్ పూర్తిచేశాడు. అయితే కొన్నిరోజుల నుండి కండరాల వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో తీవ్ర మనస్థాపంతో గత నెల 20న పొలంలో గొర్రెలను మేపుకోవడానికి వెళ్లి, అక్కడే గడిమందు తాగాడు. దీంతో ఆయన కుటుంబసభ్యులు చిలకలూరిపేట, గుంటూరులలోని ప్రవేటు ఆస్పత్రులలో చికిత్స చేయించారు. చివరకు గత నెల 24న మంగళగిరి ఎయిమ్స్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేరళలో క్రైస్తవ నన్స్‌పై అక్రమ కేసులు ఎత్తివేయాలి

చీరాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కేరళా రాష్ట్రంలో క్రైస్తవ నన్స్‌పై అ క్రమ కేసులు ఎత్తివేయాలని క్రిస్టియన్ జేఏసీ, ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. కేరళలలో జరుగుతున్న వ్యవహారంపై శుక్రవారం చీరాల ముక్కోణం పార్కు వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తులకు స్వచ్చందంగా సేవ చేస్తున్నవారిపై అక్రమ కేసులు బనాయించడం అన్యాయమన్నారు. వెంటనే న్యాయవిచారణ చేయించి కేసులు ఎత్తివేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కరరావు, జగన్‌మోహనరావు, కాటి మార్కు, రవికుమార్ , భగత్‌సింగ్ పలు చర్చిల పాస్టర్‌లు, నన్స్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించండి

- సీపీఎం నేత గంగయ్య



స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా పంగులూరులో ప్రచారం చేస్తున్న సీపీఎం నేత గంగయ్య

పంగులూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చర్యను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని, విద్యుత్ వినియోగదారులను దోచుకునేందుకే స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం పూనుకుంటున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య అన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోవాలంటూ పంగులూరులో ఆ పార్టీ నేతలు గ్రామకమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రచార కార్యక్రమం చేపట్టారు. ప్రమాదకర స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ప్రక్రియను రద్దుచేయాలని కోరుతూ పంగులూరు ప్రధాన కూడలిలో కరపత్రాలను పంపిణీ చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో వినియోగదారులకు కలిగే నష్టాలను వివరించారు. ఈ ప్రచార కార్యక్రమంలో పార్టీ నాయకులు తలపనేని రామారావు, ఆదుంసాహెబ్, తలపనేని సుబ్బారావు, తానికొండ సుధాకర్, ఏలియా పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రాలలో ప్రత్యక్ష ప్రసారాలు

పంగులూరు, ఆగష్టు 1(ఆంధ్రజ్యోతి): నేడు దర్శి నియోజకవర్గంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించే అన్నదాత సుఖీభవ ప్రారంభ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాలు మండలంలోని రైతు సేవాకేంద్రాల వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు రైతులందరూ అందబాటులో ఉన్న కేంద్రాల వద్దకు చేరుకుని కార్యక్రమాన్ని తిలకించాలని కోరారు.

తింటేే తిప్పలే !

- బిర్యానీలో హానికర రంగులు, నిల్వ మాంసంతో తయారీ
- నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలిస్తున్న హోటళ్లు
- డబ్బులు ఇచ్చి జబ్బులను కొంటున్న భోజనప్రియులు
- వందల్లో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు.. రిజిస్టర్ సంఖ్య స్వల్పమే
- నిబంధనల ఊసే కరువు.. పత్తాలేని ఫుడ్ సేఫ్టీ విభాగం



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఒకప్పుడు బిర్యానీ అంటే నగరాలు, పెద్దపెద్ద పట్టణాలకే పరిమితం. ప్రస్తుతం బిర్యానీ సెంటర్లు మండల కేంద్రాల నుంచి ఓ మోస్తరు పెద్ద గ్రామాలకూ విస్తరించాయి. బిర్యానీ అంటే చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా భుజించడానికి ఇష్ట పడతారు. ఇదే అవకాశంగా తక్కువ ధర అంటూ కూల్‌డ్రింక్ ఉచితం అంటూ రకరకాల ఆఫర్లతో ఆహార ప్రియులను ఆకర్షిస్తూ బిర్యానీ సెంటర్లను విస్తరిస్తున్నారు. జిల్లా కేంద్రాలైన గుంటూరు, బాపట్ల, నరసరావుపేటలతో పాటు మున్సిపల్ పట్టణాల్లో కరోనా అనంతరం వందల సంఖ్యలో బిర్యానీ సెంటర్లు వెలిశాయంటే వాటికి ఉన్న డిమాండ్ అర్థమవుతోంది. అందరికీ అందుబాటు ధరలో లభ్యమవుతోన్న బిర్యానీలో నాణ్యత ఎంత అంటే ఎవరూ చెప్పలేరు. లాభార్జనే ధ్యేయంగా కాసుల వేట సాగిస్తున్న నిర్వాహకులు ప్రజల ఆరోగ్యాలను పణంగా పెడుతున్నారు. కనులకు ఇంపుగా ఉండడం కోసమో, కృత్రిమ రుచుల కోసమో బిర్యానీతో పాటు ఇతర మాంసాహార వంటకాలలో విపరీతంగా ప్రమాదకరమైన రంగులు కలుపుతున్నారు. వీటిని కలపడం వల్ల ఆరోగ్యానికి హానికరమైన రసాయనాలను వినియోగదారులు కొని మరీ తింటున్నారు. వాడిన నూనెనే తిరిగి వాడడం మొదలుకుని, అపరిమితంగా ఫుడ్ కలర్ వాడడం వల్ల ప్రజల ఆరోగ్యాలకు ఎన్నో అనర్థాలు వాటిల్లుతున్నాయి. నాణ్యత విషయంలో తోపుడుబండ్ల దగ్గర నుంచి కాస్ట్లీ రెస్టారెంట్ల వరకు అదే దారి. పెద్ద రెస్టారెంట్ల వైపు కన్నెత్తి చూడని అధికారులు, రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారు లను లక్ష్యంగా చేసుకుని తూతూమంత్రంగా తనిఖీలు చేపడుతున్నారన్న విమర్శలున్నాయి

డబ్బులు ఇచ్చి మరీ రోగాలకు ఆహ్వానం

రెస్టారెంట్లు మొదలుకుని రోడ్డు పక్కన హోటళ్ల వరకు జిల్లా వ్యాప్తంగా వేలల్లో ఉన్నాయి. ఇందులో అధికారికంగా రిజిష్టర్ అయినవి 20 శాతంలోపే. వీటిలో పెద్ద చిన్నా అన్న తేడా లేకుండా చాలావరకు హోటళ్లు, ఫుడ్, బిర్యానీ సెంటర్లలో ఆహార భద్రత నిబంధనలను పాటించే వారే లేరు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో రోజువారీ ఓపీల్లో దాదాపు 14 శాతం ఫుడ్‌పాయిజన్ సమస్యగానే నమోదవడం కల్తీ తీవ్రతకు అద్దం పడుతోంది. గ్యాస్ట్రో ఎంట్రాలజీ కేసులు కూడా పెద్దఎత్తు వస్తున్నాయి. నాణ్యత లేని ఆహార పదార్థాలతో గుండె, నరాలు, ఎముకల సమస్యలు తలెత్తడంతో పాటు చర్మ సంబంధిత వ్యాధులు వస్తున్నాయని వైద్యులు గుర్తించారు. కృత్రిమ రంగులు కలిపిన ఆహార పదార్థాలతో క్యాన్సర్ పొంచి ఉంది. పదార్థాల్లో కలిపే కెమికల్స్ వల్ల మహిళల్లో రుతుసంబంధమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. వేడివేడి ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లు, బకెట్లు, డబ్బాల్లో ప్యాక్ చేస్తుండటం వల్ల కూడా క్యాన్సర్ కారక పదార్థాలు కొని మరీ తింటున్నారు.

నిబంధనల ఊసే లేదు...

ఆహార పదార్థాల్లో కల్తీని నివారించడానికి ఏర్పాటు చేసిన ఆహార భద్రత, ప్రమాణాల చట్టం అమలు గురించి ఆలోచించే వారే లేరు. నిత్యం తనఖీలు చేపట్టి నిబంధనలు అమలవుతున్నాయో పరిశీలించి కల్తీలను అరికట్టేలా కఠిన చర్యలు తీసుకోవాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు బాధ్యతను విస్మరిస్తున్నారు. ఆహార భద్రతా చట్టం ప్రకారం 19 నిబంధనలు పాటించాలి. కానీ ఏ హోటల్, ఫుడ్‌సెంటర్‌లో వీటి జాడే కనబడదు. కల్తీ, కలుషిత, విష తుల్య ఆహార పదార్థాలను అడ్డుకోవాలన్న ఆలోచన ఆయా శాఖాధికారుల్లో లోపించింది. ఆహార పదార్థాలను నిత్యం పరిశీలిస్తూ కఠిన చర్యలకు ఉపక్రమించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఆయా హోటళ్లలో వినియోగించే రంగుల డబ్బాలు, టేస్టింగ్ సాల్ట్ ప్యాకెట్లు బహిరంగంగానే దర్శనమిస్తున్నా అధికారులకు అవి కనబడడం లేదు. పెద్దఎత్తున బిర్యానీ హోటళ్లు వెలసి, రకరకాల ఆఫర్లు, కల్తీరంగులతో వినియోగదారులను ఆకర్షిస్తుంటే ఈ కల్తీదందా ఏదీ సదరు విభాగానికి కనబడకపోవడం మరింతగా విస్మయపరిచేదిలా ఉంది. పెద్ద సంఖ్యలో ఉన్నారు.

కన్యకాపరమేశ్వరికి దుర్గాదేవి అలంకరణ



దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు

గిద్దలూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాస పూజలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం సందర్భంగా పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు భక్తులకు దుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈసందర్భంగా దాతలు అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు వాడకట్టు రంగసత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై కేంద్ర బృందం పరిశీలన

త్రిపురాంతకం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా మండలంలో రెండో రోజు శుక్రవారం కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. మిరియంపల్లి గ్రామంలో పర్యటించిన సభ్యులు కె.వెంకటేష్ పారిశుధ్య పరిస్థితులు, తడి, పొడి చెత్త నిర్వహణ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల తీరును పరిశీలించారు. పారిశుధ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఎంపీడీవో రాజ్‌కుమార్, మురళి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్, ఖాజావలి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

రక్షణ ఏర్పాట్ల పరిశీలన



రైస్‌మిల్లును పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆంజనేయరెడ్డి

గిద్దలూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలలో రక్షణ ఏర్పాట్లు ఏ స్థాయిలో చేశారో అనే విషయంపై తహసీల్దార్ ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, వినియోగదారుల సంఘం నాయకుల సమక్షంలో తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని రైస్‌మిల్స్, వాటర్‌ప్లాంట్లు, రేషన్‌గోడౌన్, గ్యాస్ గోడౌన్, క్రాకర్‌షాపులను పరిశీలించారు. అగ్ని ప్రమాదాలు జరిగితే వెంటనే తీసుకోవలసిన నివారణ చర్యల గురించి, అందుకు తగ్గ ఏర్పాట్లు ఉన్నాయా, లేవా అని పరిశీలించారు. విద్యుత్‌బోర్డుల వద్ద, మెయిన్‌ల వద్ద విద్యుత్ కనెక్షన్లు లూజ్‌గా లేకుండా చూసుకోవాలన్నారు. వివిధ అంశాలపై పరిశ్రమ యజమానులకు అవగాహన కల్పించారు.

నీటి తొట్లున్నా నిరుపయోగమే


- పలుచోట్ల పేరుకుపోయిన పాచి



కంభంలో పాచిపట్టిన పశువులు తాగే నీటి తొట్టి

కంభం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కంభం పట్టణంలో పశువుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటితొట్లు నిరుపయోగంగా మారడమేకాక పలు తొట్లలో పాచి పేరుకుపోయింది. మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలంలో 100 పైగా నీటి తొట్లను నిర్మించారు. ప్రారంభంలో పశువుల దాహార్తిని తీర్చేందుకు వాటిని ఉపయోగించినా తరువాత వాటి ఆలనపాలన పట్టించుకోక పోవడం, తొట్లను శుభ్రం చేయడం, నీరు పట్టడం చేయకపోవడంతో తొట్లన్నీ పాచిపట్టి నీచువాసన వస్తున్నది. దీనితో తొట్లలో నీరు తాగేందుకు పశువులు రావడం లేదు. ప్రస్తుతం ఎండలకు, తీవ్ర వర్షాభావం పరిస్థితుల వలన మేతకు వచ్చిన పశువులు తిరిగి ఇళ్లకు వెళ్లే వరకు నీరు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నీటితొట్లను శుభ్రం చేసి నీటిని పట్టి పశువుల దాహార్తి తీర్చాల్సిందిగా పశుపోషకులు కోరుతున్నారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి



ప్రసంగిస్తున్న సీఐటీయూ నాయకులు ఆవులయ్య

గిద్దలూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక కార్యాలయంలో ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. సమావేశంలో ఆవులయ్య మాట్లాడుతూ వ్యవసాయం దెబ్బతినడంతో నిరుద్యోగ వ్యవస్థ పెరుగుతున్నదని, చదువుకున్న యువత కూడా పనులు లేక తమ కుటుంబాలను పోషించుకునేందుకు ఎక్కువగా ఆటో కార్మికులుగా మారుతున్నారని పేర్కొన్నారు. తక్కువ డౌన్ పేమెంట్ కట్టి ఆటో తెచ్చుకుని కంతులు కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. దీనికితోడు వివిధ రకాల ట్యాక్స్‌లు, ఇన్సూరెన్స్‌లు, జరిమానాలు ఆటోకార్మికులను ఆర్థికసంక్షోభంలోకి నెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భవన కార్మికుల లాగానే ఆటో కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 5వ తేదిన జరగనున్న ఆటో వర్కర్స్ యూనియన్ సదస్సులో ఆటో కార్మికులందరూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఆటో కార్మికుల సంఘం నాయకులు ఉస్మాన్ పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

అద్దంకిటౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అద్దంకిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశానికి సంబంధించి మిగిలి ఉన్న ఖాళీలకు ఈ నెల 5 తేదీన స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ వంకాయలపాటి లాజరస్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు దశల పాలిటెక్నిక్ అడ్మిషన్లు కౌన్సిలింగ్ అనంతరం అద్దంకిలోని కళాశాల నందు డీఈసీఈ, డీసీఎంఈ కోర్సులలో మిగిలి ఉన్న ఖాళీలకు ఈ నెల 5వతేదీన 10 గంటలకు కళాశాల నందు స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు పూర్తి చేసిన దరఖాస్తు పాటు మార్కుల లిస్టు, టీసీ, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ కుల ధ్రువీకరణపత్రం జతపరచాలన్నారు. ఫీజు 6 వేలు చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్‌ను, జి.రాజ్‌కుమార్ 7989766399ను సంప్రదించాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అద్దంకిటౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కమిటి సమావేశం శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించారు. ఈ సమావేశంలో యూనియన్ నూతన కమిటిని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా పి.ఆదాం, ప్రధాన కార్యదర్శిగా ఉసురుపాటి శామ్యూల్, ఉపాధ్యాక్షుడిగా గాలి బీష్మా, సహాయ కార్యదర్శిగా జ్యోతి రాఘవయ్య, కోశాధికారిగా జ్యోతి వెంకట్రావుతో పాటు మరో 12 మందిని కమిటి సభ్యులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి పరిశీలకులుగా సీఐటీయూ జిల్లా సీహెచ్ మజుందర్, తంగారాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కార్మికుల సమస్యలపై ఐక్యంగా పోరాడితే విజయం సాధించవచ్చని తెలిపారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ఎస్‌టీఎఫ్ఐ అగ్రస్థానం



జెండాను ఆవిష్కరిస్తున్న యూటిఎఫ్ నాయకులు

అద్దంకిటౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో విద్యారంగం సమస్యలు పరిష్కారంలో ఎస్‌టీఎఫ్ఐ అగ్రస్థానంలో ఉందని యూటిఎఫ్ మండల కార్యదర్శి బి.పూర్ణచంద్రరావు అన్నారు. స్టేట్ టీచర్స్ ఫెడరేషన్ జాతీయ మహాసభల సందర్భంగా శుక్రవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయం వద్ద జండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్షుడు ఈ.రామారావు, సీనియర్ నాయకులు సోమేపల్లి హనుమంతరావు, జె.బాబురావు, రాజశేఖర్, కృష్ణారావు, ప్రతాప్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హాయర్ బస్‌డ్రైవర్ల నిరసన



నిరసన చేపట్టిన హాయర్ బస్ డ్రైవర్లు

చీరాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం కొనసాగుతున్న ఆన్ కాల్ డ్రైవర్స్ రిక్రూట్‌మెంట్ విధానంలో హాయర్ బస్ డ్రైవర్లకు ప్రాధాన్యత కల్పించాలని ఏపీఎస్ ఆర్టీసీ హాయర్‌బస్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా శుక్రవారం ఆర్టీసీ డిపోలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ శుక్రవారం డిపో నిర్వహణ లోపంతో శుక్రవారం కేవలం 32 ప్రభుత్వ బస్‌లు మాత్రమే నడిచినట్లు వివరించారు. మిగిలిన 42 హాయర్ సర్వీసులు సేవలు నిలిచినట్లు చెప్పారు. సమస్యలు పరిష్కరించాలని లేకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని వివరించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.వసంతరావు, తదితర డ్రైవర్లు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్

- స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ లవన్న
- పండుగ వాతావరణంలో కొత్త పెన్షన్‌ల పంపిణీ

పర్చూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పింఛన్ అందజేసి వారికి ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ లవన్న అన్నారు. శుక్రవారం మండలంలో కొత్తగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉదయం నుంచే అధికారులు, పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో పండుగ వాతావరణంలో కార్యక్రమం చేపట్టారు. పర్చూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని డయాలసిస్ పేషెంట్లకు స్వయంగా పింఛన్ నగదు అందజేశారు. కొత్తగా వితంతు, డయాలసిస్ పెన్షన్లతోపాటు, మండలంలో పాతవి 8,224 పింఛన్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ కొసనా సత్యనారాయణ, ఆయా గ్రామ పంచాయితీ కార్యదర్శులు, సిబ్బంది, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



చినగంజాంలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న డ్వామా విజయలక్ష్మి

చినగంజాం : మండల పరిధిలోని గ్రామాల్లో స్పౌజ్ పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం టీడీపీ నాయకులు పండుగలా నిర్వహించారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాల గ్రామంలో నూతనంగా మంజూరైన స్పౌజ్ పింఛన్ల పంపిణీలో పర్చూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి డ్వామా పీడీ విజయలక్ష్మి, టీడీపీ మండల నాయకులతో కలిసి పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో ఆమె ఇంటింటికి వెళ్లి మహిళలకు నూతనంగా మంజూరైన పింఛన్‌తో పాటు స్వీట్లును పంపిణీ చేశారు. అర్హులైన ప్రతిఒక్కరికీ కూటమి ప్రభుత్వం పింఛన్ అందజేస్తు న్నట్లు తెలిపారు. మండలంలో 94.11 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీ.హెచ్.పూర్ణచంద్రరావు, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ లు రాయని ఆత్మారావు, చెరుకూరి రాఘవయ్య, గ్రామ కార్యదర్శి అంజయ్య, టీడీపీ నాయకులు అబ్దుల్ కలాంఅజాద్, టి.జయరావు, సందు శ్రీనివాసరావు, బెల్లంకొండ రమేష్‌బాబు, నరహరి శ్రీనివాసరావు, షేక్.హుస్సేన్‌భాష, గంటా వెంకటనారాయణ, పల్లపోలు లక్ష్మీనారాయణ, జి.నరసింహారావు, షేక్ జిలాని, బడుగు సామేలు తదితరులు పాల్గొన్నారు.

సంతమాగులూరు : రెండు వందల రూపాయల పింఛన్ నుండి రూ.4 వేలు పెంచిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనని సంతమాగులూరు ఏఎంసీ చైర్మన్ తేలప్రోలు రమేష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కొప్పరం, సజ్జాపురం, కొమ్మలపాడు, తదితర గ్రామాల్లో స్పౌజ్ పెన్షన్లను ఆయన ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ప్రజలకు ఏడాదికి కొంత మొత్తాన్ని పెంచి ప్రజలను మోసం చేసిందన్నారు. మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద 8236 మంది లబ్ధిదారులు పింఛన్ పొందుతున్నారన్నారు. ఆగస్టు 1వ తేదీ నాటికి 7786 మందికి పింఛన్లు అందజేశామన్నారు. స్పౌజ్ పెన్షన్లు 157 మందికి అందజేశామన్నారు. కార్యక్రమం లో ఎంపీడీవో జ్యోతిర్మయి, పంచాయతీ కార్యదర్శి కోవూరి పున్నారావు, నాయకులు చేవూరి వాసురెడ్డి, పాల శ్రీను, సయ్యద్ సుభాని, షేక్ మస్తాన్‌వలి, నెంబర్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.



డయాలసిస్ పేషెంట్‌కి పెన్షన్ అందజేస్తున్న డిప్యూటీ కలెక్టర్ లవన్న

ఘనంగా దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థాన వార్షికోత్సవం

మార్టూరు,ఆగస్టు1(ఆంధ్రజ్యోతి):జాతీయ రహదారి వెంబడి మార్టూరు గ్రామ సమీపంలోని శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం 17వ వార్షికోత్సవం శుక్రవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. శ్రావణ శుక్రవారం కావడంతో మహిళలు విశేషంగా దేవస్థానానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా దుర్గమ్మ విగ్రహానికి అర్చకులు ప్రత్యేక అలంకరణ చేశారు. అదేవిధంగా మల్లేశ్వరస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేకంగా అలంక రించారు. మల్లేశ్వరస్వామి దగ్గర అర్చకులు మృత్యుంజయశాస్త్రి, అమ్మ వారి దగ్గర అర్చకులు సురేష్‌లు భక్తులకు పూజాకార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అమ్మ వారికి కొంతమంది భక్తులు చీరసారె సమర్పించుకున్నారు. మార్టూరు గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ వెల్ ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పత్తిపాటి సురేష్, పరిశ్రమ యజమానులు తేలప్రోలు శ్రీనివాసరావు, చల్లగుండ్ల కృష్ణ తదితరులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు పొంగలి, పులిహోరను నిర్వాహకులు కొర్రపాటి నారాయణ దంపతులు పంపిణీ చేశారు.



మహాలక్ష్మమ్మ అలంకరణ

వేటపాలెం(చీరాల) : శ్రావణ మాసం రెండో శుక్రవారాన్ని భక్తులు విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేటపాలెం మండల పరిధిలోని అనుమోలుపేటలో వేంచేసిన శ్రీమహాలక్ష్మమ్మ చెట్టు మందిరం వద్ద భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించి పూలంకి సేవ చేశారు. అలాగే సామూహిక సహస్ర నామాలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళ భక్తులు పాల్గొన్నారు.



దుర్గమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

యువతలో సామాజిక సేవాస్ఫూర్తిని పెంపొందించాలి

రోటరీ క్లబ్ సమావేశంలో డాక్టర్ గరటయ్య

పంగులూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాలలో యువత భాగస్వామ్యం కావాలని మాజీ శాసనసభ్యులు డాక్టర్ బాచిన చెంచు గరటయ్య సూచించారు. రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శుక్రవారం పంగులూరులో నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ వీరనారాయణ, కార్యదర్శిగా విశ్రాంత ఆర్మీ సైంటిస్ట్ రాయిణి రామారావు, కోశాధికారిగా షేక్ కాలేషావలి ప్రమాణస్వీకారం చేశారు. క్లబ్ అడ్మినిస్ట్రేషన్ చైర్మన్ రత్న ప్రభాకర్ అధ్యక్ష, కార్యదర్శులకు కాలర్, చార్టర్‌ను అందచేసి అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డాక్టర్ గరటయ్య మాట్లాడుతూ అంతర్జాతీయంగా రెండు వందల దేశాలలో విస్తరించి ప్రపంచ వ్యాపితంగా విశిష్ట సేవలు అందిస్తున్న రోటరీ క్లబ్ పర్యావరణం, సేంద్రీయ వ్యవ సాయం, ప్లాస్టిక్ రహిత కార్యక్రమాలపై దృష్టిసారించాలని సూచించారు. 3150 మాజీ గవర్నర్ రత్నప్రభాకర్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో రూ.25 వేల కోట్లు వెచ్చించి, ప్రపంచ ఆరోగ్య సంస్థ సహకారంతో పోలియో వ్యాధి నిర్మూలనకు కృషిచేసిందన్నారు. శంకర్ కంటి వైద్యశాల సంయుక్త భాగస్వామ్యంతో వేలాదిమందికి కంటి శస్త్రచికిత్సలు విజయవంతంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. నెల నెలా ఉచిత వైద్యశిబిరాలు నిర్వహణ, పర్యావరణం, పాఠశాలల విద్యార్థులలో సామాజిక అంశాలపై అవగాహన, క్రీడాకార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పనకు క్లబ్ సభ్యుల సహకారంతో కృషిచేస్తామని అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వీరనారాయణ, రాయిణి రామారావు అన్నారు. కార్యక్రమంలో రొటేరియన్ డాక్టర్ చిలుకూరి శ్రీరామ్మూర్తి, అసిస్టెంట్ గవర్నర్ నాగభైరు శ్రీనివాసరావు, కొల్లా సింగారావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు బాచిన చెంచుప్రసాద్, మెడికల్ క్యాంప్ ఇన్‌చార్జ్ చిలుకూరి వీరరాఘవయ్య. గరిమిడి జగన్మోహన్, బీవీ.రామారావు, గుర్రం ఆంజనేయులు, రావూరి రంగారావు, కరణం హనుమంతరావు, పోతిన ప్రసాద్, పెంట్యాల జగదీశ్వర్, సీతారామయ్య, సుబ్బారావు, ఇంకొల్లు, సింగరకొండ, మార్టూరు, పర్చూరు, చిలకలూరిపేట క్లబ్ ప్రతినిధులతో పాటు స్థానిక క్లబ్ ప్రతినిదులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారోత్సవ సభలో మాట్లాడుతున్న గరటయ్య

సచివాలయాలలో ఉద్యోగులు అందుబాటులో లేకుంటే చర్యలు

ఇన్‌చార్జి ఎంపీడీవో పాండురంగస్వామి

బల్లికురవ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాలలో ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో లేకుంటే చర్యలు తప్పవు అని ఇన్‌చార్జ్ ఎంపీడీవో జి.పాండురంగస్వామి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని గుంటుపల్లి గ్రామ సచివాలయాన్ని అయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాయలంలో విధులలో ఒక్కరే అందుబాటులో ఉండటంతో అయన అగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం మాత్రమే విధులకు వచ్చి సాయంత్రం లేకపోవటం ఎమిటని అందుబాలుఓ లేని వారికి నోటిస్‌లు జారీ చేసి జీతం నిలిపి వేస్తామని ఈసందర్భంగా అయన తెలిపారు. ప్రజలతో సఖ్యతగా ఉండాలని వివిధ పనులపై వచ్చే వారితో ఆ గౌరవంగా మాట్లాడ వద్దు అని అయన సూచించారు. ఈసందర్భంగా సచివాలయంలో రికార్డులను పరిశీలించి విధులలో లేని వారికి ఆప్‌సెంట్ వేశారు.

ప్రత్యేక అవసరాల నిర్ధారణ శిబిరం

పేరాల(చీరాల), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పేరాల ఏఆర్ఎం ఉన్నత పాఠశాలలో వచ్చే సోమవారం ప్రత్యేక అవసరాలున్న చిన్నారులకు ఉప కరణాల నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్రశిక్ష, కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో 0 నుండి 18 సంవత్సరముల చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు.

చిన్నారుల్లో రోగ నిరోధకశక్తి పెంచేందుకు కృషి

చీరాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : చిన్నా రుల్లో రోగనిరోధక శక్తి పెంచేందుకు దోహద పడే అంశాలను అంగన్ వాడీ తల్లులకు సూచిం చాలని సీడీపీవో రుఖాన్సీ అన్నారు. శుక్ర వారం పట్టణంలోని థామస్‌పేట అంగన్ వాడీ కేంద్రంలో ఐడీసీ డీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠ మని, తద్వారా బిడ్డల్లో పోషక విలువలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గ్లోరీ తబిత, టీచర్లు ఎలిజబెత్ రేఖ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీవో రుఖాన్సీ

ప్యాప్టో ఆధ్వర్యంలో నేడు ధర్నా

మార్టూరు,ఆగస్టు1(ఆంధ్రజ్యోతి):జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద శనివారం ఉదయం ప్యాప్టో ఆధ్వర్యంలో జరగనున్న ధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయులు అందరూ హాజరుకావాలని స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, ప్యాప్టో రాష్ట్ర కోశాధికారి చింతల సుబ్బారావు శుక్రవారం ఒ క ప్రకటనలో కోరారు.

ఎన్‌సీసీతో ఉత్తమ క్రమశిక్షణ

పందిళ్లపల్లి (చీరాల), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో ఎన్‌సీసీ అభ్యసించడం వలన క్రమశిక్షణతో మెలుగుతారని, లక్ష్యాలపై గురి పెరుగుతుందని పందిళ్లపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయినీ తలమల దీప్తి అన్నారు. పాఠశాలలో ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు రెండేళ్లుగా ఎన్‌సీసీలో శిక్షణ పొంది శుక్రవారం ఏ సర్టిఫికేట్ అందుకున్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు వారిని అభినందించారు.



ధ్రువపత్రాలతో ఎన్‌సీసీ విద్యార్థులు

ప్రజాసానుభూతికై జగన్‌రెడ్డి పాకులాట

- ఎమ్మెల్యే కొండయ్య



పింఛన్ లబ్దిదారులతో ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : 'జగన్ లిక్కర్ స్కాం వ్యవహారం జనాల్లోకి చేరింది. త్వరలో జైలుకు వెళ్లడం ఖాయం. సానుభూతి పొందేందుకు పరామర్శ అంశం తెరపైకి తెచ్చి తప్పుడు స్టేట్‌మెంట్‌లు ఇస్తున్నాడు.' అని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. ప్రభుత్వ సామాజిక పింఛన్ల పంపిణీని శుక్రవారం నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాదాపుగా ఇంట్లో పెద్దదిక్కును కోల్పోయి నిరాశ్రయులుగా మిగిలిన మహిళ తల్లులు ఆర్థికంగా వెనుకబడి ఉన్నట్లు వివరించారు. ఈక్రమంలో కూటమి ప్రభుత్వం వారిని గుర్తించి పింఛన్లు అందిజేస్తున్నట్లు చెప్పారు. జగన్ ప్రభుత్వంలో 'దోచుకో..దాచుకో' అన్నచందంగా పాలన సాగిందే తప్పా, ఆపదలో ఉన్న నిరుపేదలకు చేసింది గుండు సున్నా అని వివరించారు.అనంతరం తీరంలోని ఓ రిస్టార్‌లో పీ4పై వ్యాపారవర్గాల ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీడీవోలు శివన్నారాయణ, రాజేష్‌బాబు, యువ నాయకులు గౌరీ అమర్నాథ్, టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వితంతు ఫించన్లు మంజూరు

పంగులూరు : మండలంలోని 14 సచివాలయాల పరిధిలో శుక్రవారం నూతనంగా మంజూరైన 172 వితంతు ఫించన్లు పంపిణీ చేశారు. అలవలపాడు 12, బూదవాడ 11, బైటమంజులూరు 17, చందలూరు 21, కేవీ.పాలెం 19, కొండమంజులూరు 12, కొండమూరు 5, కోటపాడు 9, ముప్పవరం 13, పంగులూరు 14, పంగులూరు2- 7, రామకూరు 16, రేణంగివరం 5, తూర్పు కొప్పెరపాడు 17 వితంతు ఫించన్లు మంజూరయ్యాయి. ఈ పంపిణీ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, మస్తాన్‌వలి, కోమటి ప్రసాద్, కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, వరపర్ల సుబ్బారావు, చౌదరిబాబు, గరిమిడి జగన్, జక్రయ్య, చిలుకూరి నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలో శుక్రవారం 93 శాతం ఫించన్ల పంపిణీ చేశారు. సామాజిక ఫిచన్లు 7,868 కాగా 7250 మందికి ఫించన్లు పంపిణీ చేశారు.

177 కొత్త వితంతు పించన్లు మంజురు

బల్లికురవ : మండలంలోని పలు గ్రామాలలో అర్హులైన 177 మందికి వితంతు పించన్లు నూతనంగా మంజురయ్యాయని ఇన్‌చార్జ్ ఎంపీడీవో జి.పాండురంగస్వామి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో పించన్ల పంపిణీని ఇన్‌చార్జ్ ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పించన్లను సకాలంలో అందిస్తున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాలలో 95 శాతం మేర పించన్ల పంపిణీ పూర్తయ్యిందన్నారు.

చెప్పిన సంక్షేమ పథకాలన్ని అమలు

అద్దంకిటౌన్ : కూటమి ప్రభుత్వం చెప్పిన విధంగా సంక్షేమ పథకాలు అన్ని అమలు చేస్తుంటే దానిని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు ప్రభుత్వంపై విష ప్రచారాలు చేస్తున్నారని టీడీపీ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాలల్లో నూతనంగా మంజూరైన పింఛన్లను గ్రామ సర్పంచ్‌లు, అధికారులు, టీడీపీ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు మండలంలోని ధేనువకొండ గ్రామంలో గ్రామ సర్పంచ్ తుపాకుల పద్మ, నాగినేని రామకృష్ణ, గ్రామ టీడీపీ నాయకులు కలిసి లబ్ధిదారులకు పంపిణి చేశారు. మండలంలో చక్రాయపాలెం గ్రామంలో డిప్యూటి ఎంపీడీవో ఆర్‌విఎస్ ప్రసాదరావు, గ్రామ టీడీపీ నాయకులతో కలిసి లబ్ధిదారులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ మండలంలో వితంతు పింఛన్‌లు కొత్తగా 145 మంజురయ్యాయని, వాటిని శుక్రవారం లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు.



ధేనువకొండలో పింఛన్ అందజేస్తున్న నేతలు

4న పేరాలలో దివ్యాంగులకు వైద్యశిబిరం

చినగంజాం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : పేరాల ఏఆర్ఎం హైస్కూల్ నందు బాపట్ల జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఈ నెల 4న దివ్యాంగులకు ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంఈవో బి.అజయ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ఎయిడెడ్ పాఠశాలలోని 18 సంవత్సరాల లోపు వయస్సు గల వివిధ రకాల వినికిడి, దృష్టి లోపం, శారీరక వైకల్యం, ఆటిజం, పుట్టుకతో వచ్చే పక్షవాతం తదితర సమస్యలు కలిగిన విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన ఉపకరణాలు అందిస్తామన్నారు. వైద్య శిబిరానికి హాజరయ్యే వారు తమ ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికేట్, రేషన్‌కార్డుల జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టుసైజ్ ఫోటోలు తీసుకొని వెళ్లాలన్నారు. పూర్తి వివరాలకు చినగంజాం భవిత కేంద్రంలోని ఉపాధ్యాయులు టి.బాలకృష్ణ, డి.నాగార్జున, 9866497809 సెల్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ సదావకాశాన్ని మండల పరిధిలోని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తల్లి పాలు బిడ్డకు అందించాలి


యద్దనపూడి,(మార్టూరు)ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు అందించడం ద్వారా, తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని అంగనవాడీ సూపర్ వైజరు సుజాత అన్నారు. శుక్రవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా యద్దనపూడి మండలంలోని పోలూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తల్లిపాలు విశిష్టతను తల్లులకు ఆమె వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్ జ్యోత్స్న వి.సురేంద్రదేవి, గేరా సౌభాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో పెరుగుతున్న నీటినిల్వ



అనంతసాగం, (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం వస్తుండటంతో నీటి మట్టం అంతకంతకూ పెరుగుతోంది. శుక్రవారం 13,453 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా డ్యాంలో 33.550 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 3,600, ఉత్తర కాలువకు 320, దక్షిణ కాలువకు 100 క్యూసెక్కులు చొప్పున నీరు సరఫరా చేస్తున్నారు.

అన్నదాతకు ఆర్థిక సాయం



- నేడు తొలివిడత నగదు జమ
- 1,95,866 మంది రైతులకు రూ. 131.603 కోట్లు
- కౌలురైతులకు రెండు విడతలుగా నగదు పంపిణీ

నెల్లూరు (వ్యవసాయం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన అన్నదాతలకు పెట్టుబడి సాయం పెంచి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చేందుకు రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు అర్హులైన రైతులను గుర్తించి జాబితాను సిద్ధం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు ఆదాయ పన్ను చెల్లింపుదారులు, ప్రజాప్రతినిధులను ఇలా కొంతమందిని పథకానికి మినహాయింపు ఇచ్చారు. అన్నదాత సుఖీభవ పథకం మొదటి విడతకు జిల్లాలో 1,95,866 మంది రైతులను అర్హులుగా తేల్చారు. వీరికి మొత్తంగా రూ.131.603 కోట్లుశనివారం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి. కాగా, సీసీఆర్సీ గుర్తింపు కార్డులున్న కౌలు రైతులకు రూ.10వేలు చొప్పున సంవత్సరానికి రెండు విడతల్లో రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది.

● రాష్ట్ర ప్రభుత్వం రూ.97.933 కోట్లు

రైతు సేవా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులు అర్హులైన రైతుల జాబితాను సిద్ధం చేయడంతోపాటు ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేశారు. మొత్తంగా అన్నదాత సుఖీభవ పథకం కింద మొదటి విడతగా 1,95,866 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున పెట్టుబడి సాయం అందనుంది. మొత్తంగా రూ.97.933 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అవుతుంది. ప్రకాశం జిల్లా దర్శి మండలం ఈస్ట్ వీరయ్యపాళెం గ్రామం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

● పీఎం కిసాన్ రూ.33.67కోట్లు

కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా జిల్లావ్యాప్తంగా 20వ విడత కింద 1,68,350 మంది రైతులకు ఆర్థిక సాయం అందనుంది. ఒక్కో రైతుకు రూ.2వేల చొప్పున రూ.33.67కోట్లు రైతుల ఖాతాల్లో జమవుతాయి. వారణాసిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ కార్యక్రమం ప్రారంభించనున్నారు. మొత్తం మీద రూ.7 వేలు రైతుల ఖాతాల్లో జమ అవుతాయి.

● ఒక్కోరైతుకు రూ.6500 అదనపు లబ్ధి

వైసీపీ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద రూ.13500 మాత్రమే పెట్టుబడి సాయం కింద రైతులకు అందించింది.

నియోజకవర్గాల వారీగా రైతుల వివరాలు

నియోజకవర్గం	అన్నదాత సుఖీభవ	పీఎం కిసాన్	నగదు (రూ.కోట్లలో)
ఉదయగిరి	45275	39525	30.5
ఆత్మకూరు	34223	30471	23.2
కావలి	18305	14415	12
కోవూరు	16938	13002	11
సర్వేపల్లి	27958	23909	18.7
నెల్లూరు	5299	4340	3.5
వెంకటగిరి	16015	13614	10.7
కందుకూరు	31853	29074	21.7
మొత్తం	195866	168350	131.6

అందులో పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.6వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.7500 ఇచ్చింది. అయితే ఎన్డీఏ కూటమి పెట్టుబడి సాయం కింద ఏటా రూ.20వేలు అందిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చర్యలు తీసుకుంది. కేంద్రం వాటా రూ.6వేలు కాగా రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.14వేలు అందించనుంది. దీంతో ఒక్కో రైతుకు రూ.6500 అదనపు లబ్ధి చేకూరనుంది.

● జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో స్థానిక ప్రజాప్రతినిదులు, అధికారులు కచ్చితంగా అన్నదాత సుఖీభవ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రకాశం జిల్లా దర్శి మండలం ఈస్ట్ వీరయ్యపాళెం గ్రామం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాన్ని రైతులంతా వీక్షించేలా ప్రతి రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అలాగే కోవూరులో జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డితోపాటు కలెక్టర్ పాల్గొననున్నట్లు తెలిసింది.

ఉద్యోగ మేళా!

అత్మకూరులోని ఆంధ్రా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రారంభమైన మెగా జాబ్‌మేళాకు యువత తరలివచ్చింది. రెండు రోజులపాటు జరిగే ఈ జాబ్‌మేళాకు 3వేల మందికిపైగా రిజిస్ట్రేషన్ చేసుకోగా, తొలిరోజున 579 మంది అభ్యర్థులకు వివిధ కంపెనీల్లో నియామకపత్రాలను అందజేశారు. ముందుగా రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్ జ్యోతి ప్రజ్వలన చేసి మెగా జాబ్‌మేళాను ప్రారంభించారు.

- వివరాలు 8లో..



కౌంటర్ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న యువతీ యువకులు

రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ పూర్తి

'నెల్లూరు రెవెన్యూ' పేరుతో కొత్త వెబ్‌సైట్

ఇక రికార్డులన్నీ కంప్యూటర్‌లో నిక్షిప్తం!

రెవెన్యూ శాఖలో కీలక సంస్కరణలు మొదలుకాబోతున్నాయి. జిల్లాలో విపరీతమైన భూసమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై మూస పద్ధతిని అనుసరించకుండా, కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకురాబోతోంది. 'నెల్లూరు రెవెన్యూ' పేరుతో సరికొత్త వెబ్‌సైట్‌ను రూపొందిస్తోంది. మదర్ రికార్డులతోపాటు నేటి వరకూ ఉన్న వివిధ రకాల ఉత్తర్వులను ఈ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొస్తున్నారు. రెండు విడతల్లో ఈ రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, తొలి విడత ప్రక్రియ పూర్తయింది. ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించుకునేందుకు జిల్లా ఉన్నతాధికారులు సన్నాహాలు ప్రారంభించారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వానికి కలెక్టర్ ఓ ఆనంద్ లేఖ కూడా రాశారు.



- వేగంగా భూ సమస్యలు పరిష్కరించే వీలు
- ఆగస్టు 15న ప్రారంభించేందుకు సన్నాహాలు
- ప్రభుత్వానికి లేఖ రాసిన కలెక్టర్ ఆనంద్

ఇక సాకులు చెప్పడం కుదరదు

నెల్లూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : 'నెల్లూరు రెవెన్యూ' అనే పేరుతో రూపొందిస్తున్న కొత్త వెబ్‌సైట్‌ను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తయారు చేశారు. ఇప్పటి వరకూ చాలా రెవెన్యూ రికార్డులు డిజిటలైజ్ కాలేదు. తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల్లోని రికార్డు రూముల్లో మగ్గుతున్నాయి. ఇప్పుడు ఈ రికార్డులన్నిటినీ డిజిటలైజ్ చేస్తున్నారు. మొత్తం 12 రకాల రికార్డులను కొత్త వెబ్‌సైట్ ద్వారా రెవెన్యూ యంత్రాంగానికి అందుబాటులోకి తీసుకురానున్నారు. తొలి విడతలో పర్మినెంట్ రికార్డులను స్కాన్ చేశారు. 10 (1), ఆర్ఎస్ఆర్, సీలింగ్ రిజిస్టర్, డీ-రిజిస్టర్లను స్కానింగ్ చేయడం పూర్తయింది. అలానే 2012 నుంచి వెబ్‌ల్యాండ్ అందుబాటులోకి రాగా అక్కడ నుంచి డిజిటల్ అడంగల్స్ ఉన్నాయి. అంతకుముందు ఉన్న ఫసలీలను కూడా స్కానింగ్ చేస్తున్నారు. ఇప్పటికే సగం రికార్డుల స్కానింగ్ పూర్తయింది. రెండో విడతగా డైనమిక్ రికార్డులను డిజిటలైజ్ చేసి అందుబాటులోకి తీసుకురానున్నారు. వీటిలో ఆర్‌హెచ్, ఈసీ, 22(ఏ), లోన్ మాడ్యూల్, నీటి తీరువా రికార్డు, ఎఫ్ఎంబీలు ఉన్నాయి. ఇందులో ఆర్‌హెచ్, నీటి తీరువా రికార్డులు మినహా మిగిలిన రికార్డులన్నీ గతంలోనే స్కానింగ్ చేసి ఉన్నారు. జిల్లాకు సంబంధించిన ఈ రికార్డులన్నింటినీ రిజిస్ట్రేషన్ శాఖ నుంచి అధికారికంగా అందించాలని కోరుతూ కలెక్టర్ ఆనంద్ ఇటీవల భూపరిపాలన ప్రధాన కమిషనర్‌కు లేఖ రాశారు.

● పెరిగిన భూ సమస్యలు

గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా రికార్డులు మార్చేయడంతో బాధితులు అధికారుల వద్దకు క్యూ కడుతున్నారు. మరోవైపు సివిల్ కోర్టుల్లో భూ వివాదాలు ఎక్కువయ్యాయి. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది పనితీరు అధ్వానంగా ఉంటోంది. భూ సమస్యల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ కారణంతో జిల్లా ఉన్నతాధికారులపై ఒత్తిడి పెరుగుతోంది. సాధారణంగా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో 250కు మించి అర్జీలు వచ్చేవి కావు. కానీ ఇటీవల ఆ సంఖ్య 500 దాటుతోంది. అందులో సగానికిపైగా భూ సమస్యలే ఉంటున్నాయి. వీటిని పరిష్కరించాలని ఉన్నతాధికారులు కిందిస్థాయి సిబ్బందికి పంపుతున్నా.. అక్కడ పరిష్కారం కాక మళ్లీ కలెక్టరేట్ చుట్టూ తిరగాల్సి వస్తోంది. రీఓపెన్ అవుతున్న అర్జీలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

ఇప్పటి వరకూ రెవెన్యూ రికార్డులన్నీ ఒకేచోట లభ్యమయ్యేవి కావు. కొన్ని రికార్డులు కలెక్టరేట్‌లో ఉంటే మరి కొన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో ఉండేవి. దీంతో ప్రజలు రెవెన్యూ కార్యాలయాలకు వెళితే 'ఇప్పుడు కాదు.. తర్వాత రండి..' అనే మాటలు వినిపిస్తుంటాయి. ఇకపై రెవెన్యూ రికార్డులన్నీ ఒకచోటకు చేరనున్నాయి. నూతన వెబ్‌సైట్‌లో సర్వే నంబర్ లేదా ఎఫ్ఎంబీ నంబర్ సెర్చ్ చేస్తే ఆ భూమికి సంబంధించిన రికార్డులన్నీ కనిపిస్తాయి. ప్రతీ అర్జీ ఆన్‌లైన్ ద్వారానే వెళుతుండటం, రికార్డులన్నీ ఆన్‌లైన్‌లోనే ఉంటుండడంతో సమస్య పరిష్కారంలో ఉద్దేశ పూర్వకంగా నిర్లక్ష్యం చేస్తే వెంటనే ఆ వివరాలు పైఅధికారులకు తెలిసిపోయేలా వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఈ ప్రక్రియ ఫలితంగా రెవెన్యూ రికార్డులను తారుమారు చేసేందుకు కూడా ఆస్కారం ఉండదు.

ఖాకీ ఉద్యోగానందం

కానిస్టేబుల్ పరీక్షల తుది ఫలితాల విడుదల

పోలీసు శాఖలోకి 160 మంది...

నెల్లూరు (క్రైం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ శాఖలు ఎన్ని ఉన్నా... వాటిలో పోలీసు శాఖ ప్రత్యేకమైనది. అలాగే ఎన్ని రకాల ఉద్యోగాలున్నప్పటికీ ఖాకీ నౌకరి అంటే ఎవరికైనా కొంత గొప్పే!. అలాంటి లాఠీ ఉద్యోగానికి జిల్లాలో కొత్తగా 160 మంది ఎంపికయ్యారు. పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి తుది ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది.

8లో..

ఊరి కోసం ప్రాణాలైనా వదులుతాం

- మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి
- వరికుంటపాడు వాసుల ఆగ్రహం
- హైవేపై బైఠాయించి, నిరసన

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): 'మాకు జీవనాధారంగా మారిన కొండతోపాటు ఊరి కోసం ప్రాణాలు వదిలేందుకు కూడా సిద్ధంగా ఉన్నా'మని వరికుంటపాడు పంచాయతీ వాసులు తేల్చి చెప్పారు. కొండ ప్రాంతంలో మైనింగ్ (తెల్లరాయి తవ్వకాలు) అనుమతులు రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని జాతీయ రహదారిపై బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ తొలి నుంచి టీడీపీలోనే ఉంటున్న తాము ఎమ్మెల్యే మంచోడని నమ్మి ఎంతో వ్యయ, ప్రయాసలను భరించి గెలిపించుకున్నట్లు చెప్పారు. తీరా ఇప్పుడు తమ అభీష్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే అధికారులు రహస్యంగా ప్రజాభిప్రాయ సేకరణ జరిపి వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరించడం దారుణమని మండిపడ్డారు. ఇప్పటికే ఎమ్మెల్యేకు అర్జీలు ఇచ్చినా పట్టించుకోలేదని, తమ ప్రాంతంలో పనులు జరుపుకోవాలంటే అందరినీ చంపి చేసుకోవాలని హెచ్చరించారు. అనంతరం గ్రామస్థులతోపాటు జంగంరెడ్డిపల్లి, భాస్కరాపురం, ఆంధ్రావారిపల్లి, కనియంపాడు గ్రామాలకు చెందిన ప్రజలు, మహిళలు జాతీయ రహదారిపై మానవహారంగా ఏర్పడి 'మైనింగ్ వద్దు... మా ప్రాణాలు ముద్దు' అంటూ నినాదాలు చేశారు. దీంతో కొంతసేపు వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో ట్రాఫిక్ సమస్య నెలకొంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ రఘునాథ్ అక్కడకు చేరుకుని సర్ది చెప్పారు. అయినా ఆందోళనకారులు ససేమిరా అన్నారు. దీంతో పోలీసులు, ఆందోళనకారుల నడుమ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. చివరికి కాసేపటికి ప్రజలు ఆందోళన విరమించారు.



హాస్టళ్లకు కొత్త వంట సామగ్రి

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 73 బీసీ సంక్షేమ హాస్టళ్లకు శుక్రవారం కొత్త వంట సామగ్రి చేరింది. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని హాస్టళ్లలో ఎప్పటి నుంచో వినియోగిస్తున్న పాత సామగ్రి స్థానంలో ప్రభుత్వం కొత్త పాత్రలను అందించింది. ఈ సందర్భంగా జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ పిల్లలకు మెనూ ప్రకారం సక్రమంగా ఆహారం అందించేందుకు అన్నీ చర్యలు చేపట్టామని, వారి అభ్యసన సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

దేవీ నమోస్తుతే!!

శ్రావణ మాసంలో 2వ శుక్రవారం సందర్భంగా శివకేశవులు, అమ్మవారి ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. మూలవర్లకు అభిషేకాలు, నవావరణ పూజలు, సామూహిక లక్ష కుంకుమార్చన, పూలంగి సేవ, విశేష పూజలు, పల్లకీ ఉత్సవాలు జరిగాయి. తరలివచ్చిన భక్తుల అన్నప్రసాద వితరణ చేశారు.



మహారాణుల్లా తిరగండి!



- 15 నుంచి ఆర్టీసీలో ఉచిత ప్రయాణం
- ఇబ్బందులు తలెత్తకుండా ఆదేశాలు
- బస్సులకు మరమ్మతులు, రంగులు
- డిపోలవారీగా కాల్‌ఆన్ డ్రైవర్ల నియామకం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఏదైనా గుర్తింపు కార్డు చూపితే చాలు బస్సుల్లో మహరాణుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఎన్నికల ముందు ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీల్లో భాగంగా ఈ నెల 15వ తేదీ నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందించేందుకు రంగం సిద్ధం చేసింది. గత నెల చివరి వారంలో ఆర్టీసీ నెల్లూరు జోన్ పరిధిలోని రీజియన్లకు సంబంధించిన అధికారులతో ఆ సంస్థ ఎండీ తిరుమలరావు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని అంశాలతో పాటు మహిళలకు ఉచిత ప్రయాణంపై ప్రత్యేకంగా చర్చించారు. 15వ తేదీలోగా బస్సులను కండిషన్‌లో ఉంచుకోవాలని ఎండీ ఆదేశించారు. దీంతో జిల్లాలోని అన్ని డిపోలలో బస్సులకు మరమ్మతులు, బస్సులకు పెయింటింగ్ వంటి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల మరోమారు జిల్లా అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళతోపాటు సాధారణ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చర్యలు తీసుకోనున్నారు.



నెల్లూరు-1 డిపోలో ఆర్టీసీ బస్సుకు రంగులు అద్దుతున్న కార్మికులు

● గుర్తింపు కార్డు ఉంటే చాలు

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై ఆ సంస్థ ఉన్నత యంత్రాంగం దిశా నిర్దేశం చేసింది. మహిళలు ఏ గుర్తింపు కార్డు చూపించినా బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతించాలని అధికారులకు సూచించారు. గత సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఎక్కడ ఎక్కినా.. ఎక్కడ దిగినా ఉచిత ప్రయాణం అందించాలని ఉన్నతాధికారులు సూచించినట్లు తెలుస్తోంది. అయితే ఈ నెల 8వ తేదీ ఆర్టీసీ ఎండీ అన్ని జిల్లాల ఆర్టీసీ అధికారులతో మరోమారు సమావేశం కానున్నారు. అప్పుడే పూర్తిస్థాయిలో స్పష్టత రానుంది.

● జీరో టికెట్‌పై అవగాహన

ఈ నెల 15 నుంచి అధిక సంఖ్యలో మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తే ఎలాంటి ఇబ్బందులు పడకూడని రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ అధికారులకు స్పష్టం చేసింది. ఇప్పటికే అమలవుతున్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఆర్టీసీ ఉన్నతాధికారులు పర్యటించి అక్కడ తలెత్తుతున్న ఇబ్బందులను గుర్తించారు. అవి మన దగ్గర పునరావృతం కాకుండా అనేక నిర్ణయాలు తీసుకున్నారు. అందులో భాగంగానే అధిక సంఖ్యలో బస్సులు ఏర్పాటు చేయడంతో పాటు డ్రైవర్ల కొరత ఉన్న డిపోల పరిధిలో కాల్ ఆన్ డ్రైవర్ల నియామకాలకు అనుమతులు ఇచ్చింది. దీంతో పాటు బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగిన సమయంలో ఫుట్‌పాత్‌ల పై నిల్చునే అవకాశం ఉంటుందని, అలాంటి సందర్భాల్లో ప్రమాదాలు జరగకుండా బస్సుల ఫుట్‌పాత్ మెట్లను మరమతు చేయాలని సూచించారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా అన్ని డిపోలలో అధికారులు బస్సుల కండిషన్‌పై దృష్టి పెట్టి, మరమ్మతు పనుల్లో వేగం పెంచారు.



చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	114
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 475

రేపు కరేడులో సబ్ జూనియర్ జూడో ఎంపికలు

ఉలవపాడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సబ్ జూనియర్ జూడో సెలక్షన్స్ ఆదివారం కరేడు గ్రామంలో నిర్వహించనున్నట్లు జిల్లా జూడో కార్యదర్శి టీ.సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరి జీ.మురళి ఒక ప్రకటనలో తెలిపారు. హైస్కూల్ ఆటస్థలం పక్కనే ఉన్న జీఎం అకాడమీలో ఈ సెలక్షన్స్ జరుగుతాయని తెలిపారు. అండర్-14 విభాగంలో 2011, 2012, 2013 సంవత్సరాలలో పుట్టిన బాలబాలికలు మాత్రమే అర్హులని, ఆసక్తి కలిగిన వారు ఆధార్ కార్డు జెరాక్స్ తీసుకొని రావాలలన్నారు. ఇక్కడ జరిగే సెలక్షన్స్‌లో గెలుపొందిన వారు గుంటూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం యేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8919036160కు సంప్రదించాలని పేర్కొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● కావలి నియోజకవర్గానికి 666 స్పౌజ్ పింఛన్లు మంజూరు ● ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి ● లింగసముద్రంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి



కావలి : పింఛను అందచేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, తదితరులు

కావలి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందచేస్తుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. కావలి నియోజకవర్గానికి 666 స్పౌజ్ పింఛన్లు మంజూరు అయ్యాయని తెలిపారు. పట్టణంలోని వెంగళరావునగర్ 18వ వార్డులో శుక్రవారం ఆయన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేశారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, వ్యాధిగ్రస్థులకు కూటమి ప్రభుత్వం పింఛను పెద్ద మొత్తంలో పెంచి వారికి అండగా నిలిచిందన్నారు. సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని చెప్పారు. అర్హులైన వారికి కొత్తగా రేషన్ కార్డులు, పింఛన్లు, నివేశన స్థలాలు, ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వాటికి అర్హులైన వారు సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, మేనేజరు ఫణీంద్ర, టీడీపీ నేతలు కండ్లగుంట మధుబాబునాయుడు, శానం హరి, షేక్ హజరత్, యేగూరి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

● **దగదర్తి(బిట్రగుంట)(ఆంధ్రజ్యోతి):** దగదర్తి ఎస్టీ కాలనీలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి పాల్గొని లబ్ధిదారులకు పింఛను నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాల్లూరు ప్రసాద్‌నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్య దర్శి పమిడి రవికుమార్ చౌదరి, మండల అధ్యక్షుడు హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి వింజం కొండపనాయుడు, నేతలు వడ్డే శ్రీనాథ్, విజయ్‌కుమార్, రవిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● బోగోలు మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమం ఎంపీడీవో ఆధ్వర్యంలో జరిగింది. బోగోలు, విశ్వనాథరావుపేట పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, టీడీపీ మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, టీడీపీ ఇంచార్జి చిలకపాటి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎల్.సుధీర్ బాబు, నేతలు జీ.సంజయ్, అర్పుతరాజ్, రఫీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధికే సంక్షేమ పథకాలు

● **లింగసముద్రం(ఆంధ్రజ్యోతి):** సంక్షేమ పథకాలతో పేదల ఆర్థికాభివృద్ధి సాధ్యమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చెప్పారు. శుక్రవారం లింగసముద్రంలోని సచివాలయం-1 వద్ద ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన నూతనంగా మంజూరైన వితంతు పింఛన్ల లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని పథకాలు ప్రాధాన్యత క్రమంలో అమలు చేస్తున్నారన్నారు. రెండు మూడేళ్ల నుంచి భర్తలు చనిపోయిన వితంతు మహిళలకు కొత్తగా రాష్ట్రంలో 1.10 లక్షల మందికి పింఛన్లు మంజూరు చేశారన్నారు. శనివారం అన్నదాత సుఖీభవ పథకం అమలు జరుగుతుందని చెప్పారు. ఓ వైపు రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధిలో దూసుకుపోతుంటే వైసీపీ నాయకులు ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని అభ్యంతరకర బాషలో దూషించిన మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిని మాజీ సీఎం జగన్ పరామర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం స్థానిక ఎస్టీ కాలనీలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పూరిమిట్ల గురునాథం, నాయకులు అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్, కిలారి కొండయ్య, వీ.మాల్యాద్రి, జంపాల శివప్రసాద్, అడపా నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.



లింగసముద్రం : వితంతువుకు పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

● **వలేటివారిపాలెం :** మండలంలోని కూనిపాలెం, అంకభూపాలపురం గ్రామాల్లో వితంతులకు నూతనంగా మంజూరైన వితంతు పింఛన్లను సర్పంచు రాజారమేష్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళి, టీడీపీ నాయకులు అనుమోల సుధాకర్, ప్రగడ శ్రీనివాసులు, చెంచు శ్రీనివాసులు, ప్రగడ మోహన్‌రావు, బక్కమంతుల మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

● **కొండాపురం :** మండలంలో 91 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో శేషసాయి తెలిపారు. నూతనంగా మంజూరైన స్పౌజ్ పింఛన్లతో కలిపి మొత్తం 5369 పింఛన్లు ఉండగా 4890 పింఛన్లను లబ్దిదారులకు అందచేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచు మాచర్ల, టీడీపీ నాయకులు పోలినేని చంద్రబాబునాయుడు, పీ.రమేష్, దామా మహేశ్వరారవు, కుంకు మోహనరావు, యారవ క్రిష్ణయ్య, జాగర్లమూడి శ్రీను, మామిళ్లపల్లి వెంకట రమణయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● **జలదంకి :** కొత్తగా మంజూరైన స్పౌజ్ పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పీ.మధుమోహన్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు పూనూరు భాస్కర్ రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వంటే రు జయచంద్రా రెడ్డి, తెలుగుయువత మండల అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి, కరియావుల అప్పలయ్యనాయు డు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాత్రివేళ అక్రమంగా మట్టి తరలింపు



లింగసముద్రం కొత్త చెరువులోని మట్టిని రాత్రివేళ తరలిస్తున్న ట్రాక్టర్

లింగసముద్రం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రం కొత్త చెరువు నుంచి రాత్రివేళ అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. పగలు ఈ చెరువు నుంచి మట్టిని తరలిస్తే అధికారులు పట్టుకుంటారనే కారణంతో కొందరు వ్యక్తులు శుక్రవారం రాత్రి 7 గంటల నుంచి ఎక్స్‌కవేటర్లతో తవ్వి సుమారు 10 ట్రాక్టర్ల ద్వారా లింగసముద్రంలోని ఓ వెంచర్‌కు తరలిస్తున్నారు. గత గురువారం నాడు కొందరు వ్యక్తులు ఇదే చెరువులోని మట్టిని తరలిస్తుండగా మైనర్ ఇరిగేషన్ ఏఈఈ బి మనోహర్‌కు విషయం తెలిసి, అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో వారు మట్టి తరలింపును ఆపేశారు. దీంతో వీరు మట్టి అక్రమ రవాణాను రాత్రివేళకు మార్చారు. వీరి ధన దాహానికి కొత్త చెరువు గుల్లై పోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తహసీల్దారు కార్యాలయంలో
వేధిస్తున్న సిబ్బంది కొరత

● గ్రామ సచివాలయాల్లోనూ వీఆర్‌వోలు, సర్వేయర్లు...

లింగసముద్రం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రం తహసీల్దారు కార్యాలయాన్ని సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మండల సర్వేయరు పోస్టు గత రెండేళ్ల నుంచి ఖాళీగా ఉంది. దీంతో ఉన్నతాధికారులు ఇతర మండలాలకు చెందిన మండల సర్వేయర్లకు ఇన్‌చారి బాధ్యతలు అప్పగించి ఎలాగోలా నెట్టుకొస్తున్నారు. అయితే సుమారు నెల రోజుల క్రితం వరకు ఇన్‌చార్జి మండల సర్వేయరుగా ఉన్న వలేటివారిపాలెం మండల సర్వేయరు గోపిరెడ్డి కూడా అక్కడి నుంచి బదిలీ అయ్యారు. దీంతో నెల రోజుల నుంచి మండల సర్వేయరు ఇన్‌చార్జి కూడా లేక ఆ పోస్టు కూడా ఖాళీగా ఉంది. ఇక కార్యాలయంలోని డిప్యూటీ తహసీల్దారు కే.శ్రీనివాసులు రెండు నెలల క్రితం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎవరిని నియమించలేదు. దీంతో డీటీ పోస్టు కూడా ఖాళీగా ఉంది. ప్రస్తుతం కార్యాలయంలో తహసీల్దారు, ఆర్ఐ, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్, అటెండరు విధులు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా మండలంలోని 13 గ్రామ సచివాలయాల్లో కూడా వీఆర్‌వోలు, సర్వేయరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల జరిగిన సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో 13 సచివాలయాల్లో 10 మంది వీఆర్‌వోలు ఉండగా, వారిలో ముగ్గురు బదిలీపై వెళ్లిపోయారు. 10 మంది సర్వేయర్లుండగా 8 మంది బదిలీ అయ్యారు. అయితే మండలంలో జరుగుతున్న రీ సర్వే కారణంగా వారు ఇంకా రిలీవ్ కాలేదు. వారు కూడా రెండు రోజుల్లో రిలీవ్ అవుతారని తెలిసింది. బదిలీ అయిన వారి స్థానంలో ఇంకా ఎవరూ రాలేదు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పక్కనే చెత్త!



రోడ్డు పక్కన వేసిన చెత్తలో పందులు

వలేటివారిపాలెం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా రోడ్డు పక్కనే వ్యాపారులు వ్యర్థాలు వేస్తున్నారు. దీంతో అటువైపు వెళ్లే ప్రభుత్వ అధికారులు, వైద్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్ని శాఖల అధికారులు తమ కార్యాలయాలకు అటు వైపే వెళ్లాలి. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోడంలేదు. రోడ్డు పక్కన పడేసిన వ్యర్థాల్లోని కుళ్లిన ఆహార పదార్థాలను పందులు తింటూ రోడ్డుమీదకు తీసుకవస్తూ అపరిశుభ్రం చేస్తున్నాయి. వలేటివారిపాలెంలో చెత్తసంపద కేంద్రం ఉన్నప్పటికీ వ్యర్థాలు ఆ చెత్త సంపద కేంద్రంలో వేయకుండా రోడ్ల పక్కనే వేస్తున్నారు. ఇది వర్షానికి తడిచినప్పుడు మరీ ఎక్కువ దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పక్కన చెత్తను తొలగింపజేసి మళ్లీ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తలసేమియా బాధితులకు అండగా ఉంటాం



తలసేమియా బాధిత చిన్నారులకు పౌష్టికాహారం అందచేస్తున్న తటవర్తి రమేష్

కావలి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తలసేమియా బాధిత చిన్నారులకు రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలు అమోఘమని, కావలి ఆర్యవైశ్య సంఘం వారికి అండగా ఉంటుందని ఆ సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ తెలిపారు. రెడ్‌క్రాస్ పాలకమండలి ఆహ్వానం మేరకు శుక్రవారం ఆయన కావలి రెడ్‌క్రాస్ తలసేమియా డేకేర్ సెంటర్‌ను చెన్నై ఆర్యవైశ్యనాయకులు తంగుటూరి సురేష్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న తలసేమియా బాధిత చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడి వారి సాధకబాధకాలు తెలుసుకుని పౌష్టికాహారం అందచేశారు. అలాగే ఆ కేంద్రం వైద్యాధికారులు పామూరు శ్రీధర్, టీ.రమ్యలతో మాట్లాడి ఈ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న వైద్యసేవల గురించి తెలుసుకున్నారు.

● టైల్స్ వ్యాపారి రూ.10 వేల విరాళం

తలసేమియా డేకేర్‌సెంటర్‌లో వైద్యసేవలు అందుకుంటున్న బాధిత చిన్నారుల మందులు, పౌష్టికాహారం కోసం ప్రముఖ టైల్స్ వ్యాపారి కొర్రపాటి దిలీప్ కుమార్ రూ.10 వేలు ఆర్థిక సహాయంను డాక్టర్లకు అందచేశారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవిప్రకాష్, వైస్ చైర్మన్ కే.హరినారపరెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావు, పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు తప్పనిసరిగా అందించాలి

బిట్రగుంట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు తప్పనిసరిగా అందించాలని కోవూరుపల్లి పీహెచ్‌సీ వైద్యుడు ఎస్.రామకృష్ణ తెలిపారు. బోగోలు మండలంలోని యాదవపాలెం, రాజావీధి అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు హైమావతి, సుప్రజ, తదితరులు పాల్గొన్నారు.



బిట్రగుంట : తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రామకృష్ణ

● వలేటివారిపాలెం(ఆంధ్రజ్యోతి) : తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని కూనిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలు సందర్భంగా శుక్రవారం తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఉషారాణి, కళ్యాణి, ఏఎన్ఎం అరుణ, బాలింతలు పాల్గొన్నారు.



వలేటివారిపాలెం : కూనిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సునీత

ప్రతి గడపకు ప్రభుత్వ సాయం అందాలి

● సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్

అల్లూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రతి గడపకు ప్రభుత్వ సాయం అందడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇస్కపల్లి పంచాయతీ పరిధిలో ఇంటింటికి తిరిగి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కొక్కటిగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, రాష్ట్రం అభివృద్ధివైపుకు పరుగులు తీయిస్తూ, యువత భవిత కోసం అహర్నిశలు పాటు పడుతున్న ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఆయనకు ఎల్లప్పుడూ ప్రజల ఆశీస్సులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలలో స్థానిక నాయకులు పాపనబోయిన జగన్మోహన్‌రావు, కీర్తి బాబూరావు, పిట్టి సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీద గిరిధర్



మధ్యాహ్న భోజనం వివరాలు తెలుసుకుంటున్న ఆర్ఐవో వరప్రసాదరావు

ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన ఆర్ఐవో

ఉలవపాడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఉలవపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్‌మీడియ్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి(ఆర్ఐవో) టీ.వరప్రసాదరావు శుక్రవారం సందర్శించారు. కళాశాలలో పారిశుద్యం, వసతులు, నూతన తరగతి గదుల నిర్మాణం, ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్నం భోజనం తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం అన్ని విధాల ప్రైవేటు కళాశాలలకు దీటుగా విద్యార్థులకు వసతులు కల్పిస్తుందని, నీట్, ఎంసెట్ తరహా బోధన అందింస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకొని భవిష్యతులో ఉన్నతి స్థాయిలో నిలబడాలని సూచించారు.

వర్ల రామయ్య జన్మదిన వేడుకల్లో ఎస్సీ సెల్ నాయకులు



రామయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎస్సీ సెల్ నాయకులు

కలిగిరి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పోలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య పుట్టినరోజు సందర్భంగా గురువారం విజయవాడలోని ఆయన స్వగృహంలో జరిగిన జన్మదిన వేడుకల్లో ఉదయగిరి ఎస్సీ సెల్ నాయకులు పాల్గొని శాలువాకప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు స్వర్ణ కొండయ్య, ప్రధాన కార్యదర్శి ఉప్పుటూరి సుధీర్‌బాబు, విజయ్, హజరత్, తిరుపాల్, చిన్నా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఉద్యోగ విరమణ సన్మానం



ఉద్యోగ విరమణ చేసిన ప్రభాకర్‌రావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉలవపాడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : అలగాయపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన సుదర్శి ప్రభాకరరావుకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, గ్రామస్థులు, పూర్వ విద్యార్థులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు వెంకటరత్నం, పీవీ రమణయ్యలు పాల్గొని ప్రభాకరరావు దంపతులను పూలమాలతో సత్కరించారు. కావలి విద్యాశాఖ అధికారి బండి గోవిందయ్య, మాజీ విద్యాశాఖ అధికారి శివన్నారాయణ, పలు ఉపాధ్యాయ సంఘాలకు చెందిన ఉపాధ్యాయులు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

సీఐ అన్వర్‌బాషా బాధ్యతల స్వీకరణ

కందుకూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కందుకూరు సీఐగా అన్వర్ బాషా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా ఉన్న కే.వెంకటేశ్వరరావును వీఆర్‌కు బదిలీచేసి ఆయన స్థానంలో అన్వర్ బాషాను నియమించారు. నూతన సీఐను కందుకూరు పట్టణం, రూరల్, ఉలవపాడు ఎస్ఐలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటానని, కందుకూరు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగుచర్యలు తీసుకోవటం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.



సీఐ అన్వర్‌బాషాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఐ శివనాగరాజు

రాళ్లపాడు తాగునీటి పథకం పైపులైన్ లీకేజీ

● కలుషితం అవుతున్న మంచినీరు



స్వర్ణాజీపురం దగ్గర పైప్‌లైన్ నుంచి వృథాగా పోతున్న నీరు

గుడ్లూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాజర్ల, స్వర్ణాజీపురం రహదారికి పక్కగా ఏర్పాటు చేసిన రాళ్లపాడు తాగునీటి పథకం పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడంతో నీరు వృథాగా పోతోంది. గుడ్లూరు మోయిన్ ట్యాంక్ నుంచి విడుదల చేస్తున్న నీరు స్వర్ణాజీపురంకు సమీపంలో వాటర్ లైన్ మళ్లించేందుకు ఏర్పాటు చేసి ఉన్న తొట్టి దగ్గర పైప లీకేజీ ఏర్పడడంతో నీరు వృథాగా పోతోంది. నెలలు తరబడి ఈ లీకేజీ ఇలాగే ఉన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. దీంతో తాగునీరు కలుషితం అవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేయించాలని పాజర్ల, స్వర్ణాజీపురం గ్రామస్థులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

లే అవుట్ల క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టండి

● కావలి కమిషనర్ శ్రావణ్ కుమార్

కావలి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అక్రమ లే అవుట్లను క్రమబద్ధీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఆర్ఎస్ స్కీంను ప్రవేశపెట్టిందని, దానిని సద్వినియోగం చేసుకుని అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్ కుమార్ తెలిపారు. మున్సిపల్ చాంబరులో శుక్రవారం అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణపై సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కావలి పురపాలక సంఘం పరిధిలో ఎన్ని అక్రమ లేఅవుట్లు ఉన్నాయో గుర్తించి వారికి ఎల్‌ఆర్ఎస్ స్కీంపై అవగాహన కల్పించాలని సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోకపోతే ఆ తర్వాత లేఅవుట్ దారులకు వాటిలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ఎదురయ్యే ఇబ్బందులను గురించి విపులంగా తెలియచేసి ఎల్ఆర్ఎస్ స్కీం కింద వాటిని క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి వివేకానంద్ పాల్గొన్నారు.

పీఎంశ్రీ పథకం అమలుపై సమీక్ష

కలిగిరి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌ను రాష్ట్ర పర్యవేక్షకుడు పీ.రమేష్ శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్‌ల్యాబ్, అటల్‌టింకరింగ్‌ల్యాబ్, లైబ్రరీ, క్రీడామైదానం, టాయిలెట్లు తదితర మౌలిక సదుపాయాలపై సమీక్షించారు. అనంతరం తరగతి గదుల్లో విద్యార్థులతో ముఖాముఖి చర్చలు జరిపి విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. పాఠశాలలోని బోధనాంశాలు, విద్యా ప్రమాణాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏ శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణ అమలును నిలిపివేయాలని ఆందోళన

కందుకూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు రద్దు చేయాలని, తెలుగురాష్ట్రాల్లో వర్గీకరణ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మాలమహానాడు, మాల ఉద్యోగ ఉపాధ్యాయ, విద్యార్థిసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయాసంఘాల నాయకులు మాట్లాడుతూ దళిత వ్యతిరేకి చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ ద్వారా మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టాడన్నారు. చంద్రబాబు, ఆయన శిష్యుడు రేవంత్‌రెడ్డిలు మాదిగ, దాని ఉపకులాలపై అమితమైన ప్రేమ చూపిస్తూ వర్గీకరణ అమలు చేస్తుండటంతో మాలలకు తీరని అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని మిగిలిన ఏ రాష్ట్రం వర్గీకరణను అమలు చేయకపోయినప్పటికీ తెలుగురాష్ట్రాల్లో ఉత్సాహంగా అమలు చేస్తుండటం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఎల్. బ్రహ్మయ్య, పాలేటి కోటేశ్వరరావు, చార్వాక, గేరా చిరంజీవి, బొట్లగుంట శ్రీనివాసులు, దమ్ము థామస్, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

తేజస్ నెట్‌వర్క్స్‌లో ఉద్యోగానికి ఎంపిక



విద్యార్థి ప్రసాద్

కందుకూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి పీ.ప్రసాద్ ప్రముఖ మల్టీ నేషన్ కంపెనీ తేజస్ నెట్‌వర్క్స్‌లో రూ.7.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగావకాశం పొందాడని కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల విజయ్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐఐటీలు, ఎన్ఐటీలు లాంటి అగ్రశ్రేణి విద్యాసంస్థలలో చదివిన విద్యార్థులను మాత్రమే ఎంపిక చేసుకునే ఈ సంస్థలో తమ కళాశాల విద్యార్థి ఎంపిక కావడం గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. ప్రసాద్‌ను కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ వి.హరిబాబు, ఆర్‌అండ్‌డి విభాగాధిపతి ఎం.లక్ష్మణరావు, ప్రొఫెసర్లు మీరావలి, కె. సుబ్బారెడ్డి, కె.మోహనరావు, ఎంఎం రాయుడు తదితరులు అభినందించారు.

259 పొగాకు బేళ్లు తిరస్కరణ

కలిగిరి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు మొత్తం 528 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 11కంపెనీల ప్రతినిధులు పాల్గొని 269 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-228, ఆర్ఆర్-2, సీఆర్-15, జంపింగ్ లాట్స్-14 కారణాలతో 259 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.225.81గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.



వేసిన ప్యాచ్‌లో లేచిపోయిన తారు



రహదారి అంచుల్లో ఇలా..

ప్యాచ్ వర్క్ ఇలాగేనా!?

మూణ్నెళ్లకే దెబ్బతిన్న దువ్వూరు క్రాస్ రోడ్డు

సంగం మండలం దువ్వూరు క్రాస్ రోడ్డు నుంచి అనసూయనగర్ వరకు ఆర్అండ్‌బీ రోడ్డు ఇది. సుమారు 5 కి.మీ పొడవు ఉంది. 2014-19 టీడీపీ ప్రభుత్వంలో తారు రోడ్డు నిర్మించారు. ఆ తరువాత వైసీపీ హయాంలో ఈ రహదారిపై భారీ వాహనాలతో ఇసుక తరలించడంతో అనతికాలంలోనే దెబ్బతిన్నది. రోడ్డుకు ఇరువైపులా తారులేచిపోయి కుంచించుకుపోయింది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల బారీన పడుతున్నాయి. ఏడాది కిందట అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎఫ్‌డీఆర్ నిధుల కింద సుమారు రూ.10 లక్షలు మంజూరు చేసింది. దువ్వూరు నుంచి అనసూయనగర్ వరకు ప్యాచ్ పనులు చేయాలి. పనులు దక్కించుకున్న ఓ కాంట్రక్టర్ ఏప్రిల్‌లో మరమ్మతు (ప్యాచ్) పనులు చేశారు. అయితే, రహదారి దెబ్బతిన్న చోట పూర్తిగా తొలగించి నిబంధనల మేరకు మెటల్ వేసి రోలింగ్ చేయాలి. ఆ తరువాత తగిన పరిమాణంలో తారు, 6ఎంఎం మెటల్ మిక్సింగ్ చేసి రోలింగ్ చేయాలి. కానీ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు నాసిరకంగా చేసి జేబులు నింపుకున్నాడే విమర్శలు ఉన్నాయి. దీంతో పనులు చేసిన రెండు, మూడు నెలలకే రోడ్డు అంచులు లేచిపోయి అధ్వానంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే పనుల్లో నాణ్యత లోపించినట్లు అనసూయనగర్ వాసులు ఆరోపిస్తున్నారు. క్వాలిటీ కంట్రోల్ అధికారుల తనిఖీ చేసి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ అవినాష్ మాట్లాడుతూ పనులు జరిగిన సమయంలో తాను లేనని, క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేశాకే బిల్లులు చెల్లించి ఉంటారని చెప్పుకొచ్చారు.

- సంగం (ఆంధ్రజ్యోతి)

అవయవ దానంతో 8 మందికి పునర్జన్మ

● 'జీవన్‌దాన్' రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాంబాబు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఎవరైనా ఒకరు అవయవ దానం చేయడం ద్వారా ఎనిమిది మందికి పునర్జన్మ లభిస్తుందని జీవన్‌దాన్ సంస్థ ఏపీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాంబాబు తెలిపారు. శుక్రవారం నెల్లూరులోని ఓ ఫంక్షన్ హాల్లో అవయవ దానంపై అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అవయవ దానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తమ సంస్థలో ఇప్పటికే 4733 మంది రోగులు అవయవ దానం కోసం రిజిస్టర్ చేయించుకున్నారని తెలిపారు. శనివారం నెల్లూరు అపోలో ఆసుపత్రిలో అవగాహన శిబిరం జరుగుతుందన్నారు. ఆదివారం అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జీజీహెచ్‌లోనూ ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అపోలో ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీరాం సతీష్, యూనిట్ హెడ్ బాలరాజు, మెడికవర్ ఆసుపత్రి క్లస్టర్ హెడ్ రంజిత్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, కిమ్స్ ఆసుపత్రి సీవోవో డాక్టర్ సతీష్, నారాయణ ఆసుపత్రి ఏజీఎం శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెట్టప్రాంత యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం

● రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మెట్ట ప్రాంత నిరుద్యోగ యువతకు మంచి భవిష్యత్‌ను అందించి, ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధికి బాటలు వేయడమే లక్ష్యంగా ఆత్మకూరులో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. రాష్ట్ర స్కిల్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆత్మకూరు ఆంధ్రా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఉదయం మంత్రి ఆనం, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్ జ్యోతి ప్రజ్వలన చేసి మెగా జాబ్ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ నిరుద్యోగ యువత కంపెనీల చుట్టూ తిరగడం కాకుండా కంపెనీలే ముందుకొచ్చి ఉద్యోగాలు ఇచ్చేలా ఈ జాబ్‌మేళాకు శ్రీకారం చుట్టామన్నారు. సుమారు 90కిపైగా రాష్ట్ర, జాతీయ స్థాయి కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ మన ఇంటి ముందుకు నడిచి వచ్చిన ఉద్యోగాలను సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్ పొందాలని యువతకు పిలుపునిచ్చారు. మెట్టప్రాంతంలోని యువతీ యువకులు ఆంగ్లభాష నైపుణ్యంలో కొద్దిగా వెనుకబడి ఉంటారే గాని ఉద్యోగాల్లో కష్టపడి పనిచేసి తమ సామర్థ్యాలను నిరూపించుకుంటారని పేర్కొన్నారు. ముందుగా కలెక్టర్ ఆనంద్, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్, ఏపీ ఇన్ లాండ్ అథారిటీ చైర్మన్ జడ్ శివప్రసాద్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, ఎన్డీసీసీబీ బ్యాంకు చైర్మన్ ధనుంజయరెడ్డి, ఆర్డీవో పావని, తహసీల్దారు పద్మజ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి మెగా జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న మంత్రి ఆనం, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సతీష్‌రెడ్డి తదితరులు

● జాబ్‌మేళాకు విశేష స్పందన

మెగా జాబ్‌మేళాకు యువత నుంచి విశేష స్పందన లభించింది. 3వేల మందికిపైగా యువతీ యువకులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తొలిరోజున 579 మంది అభ్యర్థులకు వివిధ కంపెనీల్లో నియామకపత్రాలను అందజేశారు. శనివారం కూడా ఈ జాబ్‌మేళా జరగనుంది.

రేపు అథ్లెటిక్స్ క్రీడా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అండర్-14. 16, 18, 20 బాల, బాలికల జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కే వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు ఎంపికలు జరుగుతాయని, ఆసక్తి గల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌తో హాజరు కావాలని కోరారు. ఎంపికైన వారు త్వరలో బాపట్లలో జరిగే రాష్ట్ర పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అందించే రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డులకు అర్హత కలిగిన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2025 వ సంవత్సరానికి అవార్డు అందుకునేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు 8వతేదీ సాయంత్రం 5 గంటలలోపు వారి ప్రతిపాదనలను సంబంధిత డిప్యూటీ ఈవోలకు అందచేయాలని సూచించారు. వివరాలకు www.deo.nellore.50webs.comను పరిశీలించాలని తెలిపారు.



స్వర్ణగరుడ వాహనంపై పెంచలోరు

ఘనంగా పెంచలస్వామి నక్షత్ర వేడుకలు

రాపూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలోని స్వామివారి జన్మ నక్షత్రం స్వామి నక్షత్రం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. చందనాలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం వేద పండితులు శాంతిహోమం, కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. సాయం త్రం బంగారు గరుడ వాహనంపై స్వామివారు మాడవీధుల్లో విహరించారు. శ్రావణ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా ఆదిలక్ష్మీ అమ్మవారికి ప్రాకారోత్సవం, సామూహిక కుంకుమార్చన ఘనంగా నిర్వహించినట్లు ఆలయ ఉప కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

బొప్పాయి ధర పతనం!

● దళారుల దోపిడీ ● ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు

కలిగిరి, ఆగస్టు 1(ఆంధ్ర జ్యోతి): రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన బొప్పాయి పంటకు గిట్టు బాటు ధర లేక రైతులు దిగాలు చెందుతున్నారు. అతివృష్టి, అనావృష్టి, ప్రకృతివైపరీత్యాల నుంచి కంటికి రెప్పలా కాపాడుకున్న పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడం, దళారులు ఇష్టానుసారంగా వ్యహరిస్తూ సిండికేట్‌గా మారడంతో ధరలు పతనమవుతోన్నాయి. పంట సాగు సమయంలో తామున్నామంటూ భరోసా ఇచ్చే అధికారులు తీరా పంట దిగుబడి వచ్చేసరికి ముఖం చాటేస్తున్నారు. దీంతో పండించిన పంట ఎక్కడ అమ్ముకోవాలో తెలియక దళారుల చేతిలో చిక్కి నష్టపోతున్నారు. కొందరు దళారులు చెప్పే ధరకు అమ్ముకోలేక కడుపుమండి పడిన పంటను నడిబజార్లో రోడ్లపై పోసి తగలబెడుతున్నారు. దీనినిబట్టి చూస్తే రైతు బాధ ఏ స్థాయిలో ఉందే ఇట్టే తెలుస్తోంది. వింజమూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో సుమారు 145 ఎకరాల్లో బొప్పాయి సాగు చేస్తున్నారు. ఇక్కడ పండించిన పంట ఢిల్లీ, హర్యానా, బెంగాల్ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. అయితే రాష్ట్రం నుంచి ఎగుమతులు చేయాలంటే రైతు దళారుల మీదే ఆధార పడవలసి వస్తోంది. దాంతో దళారి చెప్పిన ధరకు అమ్ముకోక తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం బొప్పాయి సాగు చేస్తున్న రైతులకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కలిగిరి ప్రాంతంలో సాగు చేస్తున్న బొప్పాయి తోట

ధర పడిపోయింది



3.5 ఎకరాల్లో బొప్పాయి సాగు చేశాను. ఎకరం సాగుకి రూ.2 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాను. ఇప్పటి వరకు మూడు కోతలకు కిలో రూ.10కి పైగా ధర అందింది. మార్కెట్ డిమాండ్ లేదంటూ దళారులు ప్రస్తుతం కిలో రూ.5 మాత్రమే చెల్లిస్తామనడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. బొప్పాయి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

- కాకూరు విష్ణువర్ధన్‌రెడ్డి, రైతు, కలిగిరి

మద్దతు ధరకు కృషి చేస్తాం



వింజమూరు డివిజన్ పరిధిలో మే నెల నుంచి బొప్పాయి కోతలు మొదలయ్యాయి. బొప్పాయి సాగు విస్తీర్ణం పెరగడం, మామిడి పండ్లు అందు బాటులో ఉండట వలన బొప్పాయి వినియోగం తగ్గింది. ప్రస్తుతం ఉత్తరభారతదేశంలో వర్షాలు కురుస్తుండడంతో డిమాండ్ తగ్గి ధరలు పతనమయ్యాయి. రైతులు బొప్పాయి పంటను మార్కెట్ యార్డుల్లో అమ్ముకోవడానికి ముందుకువస్తే సంబంధిత అధికారులతో మాటాడి మద్దతు ధర అందించడానికి కృషి చేస్తాం.

-షేక్ షాహీల్, ఉద్యానశాఖాధికారి, వింజమూరు డివిజన్

'బ్లాక్'లో యూరియా!

బస్తాకు రూ.65 అదనంగా వసూలు

దోపిడీ చేస్తున్నారని రైతుల గగ్గోలు

పట్టించుకోని వ్యవసాయశాఖ అధికారులు

జలదంకి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ణయించిన ధరకు విక్రయించాల్సిన యూరియా బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. యూరియా బ్లాక్ మార్కెట్ లో విక్రయించడం లేదని, కేంద్ర ప్రభు త్వం నిర్ణయించిన బస్తా ధర రూ.285కే దొరుకుతోందని జిల్లా వ్యవసాయధికారి (డీఏవో) సత్యవాణి తరచూ సమావే శాల్లో, పత్రిక ప్రకటనలో చెబుతున్నారు. కానీ వాస్తవానికి ప్రైవేటు రైతు డిపోలో ఒక బస్తా రూ.65 అదనంగా వసూలు చేస్తూ రూ.350 విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఎవరైనా అదనపు ధర గురించి మాట్లాడితే వారికి యూరియా దొరకడం లేదు. ఈ క్రమంలో ఏ రైతునైనా యూరియా బస్తా ఎంత అని ప్రశ్నిస్తే రూ.350 అని టక్కున చెబుతున్నారు.

● రూ.10కోట్ల దోపిడీ

జిల్లాలో ప్రసుత్తం 5లక్షల ఎకరాలకు పైగా జలాశయాల కింద వరిసాగు జరుగుతోంది. ప్రతి ఎకరానికి 4 బస్తాల యూరియా వినియోగిస్తున్నారు. అమేరకు వ్యవసాయశాఖ కూడా 200 కిలోలు యూరియా ఎకరానికి వినియోగించాలని పలు సమావేశాలలో వివరిస్తున్నారు. ఇలా 5లక్షల ఎకరాలలో 20లక్షల బస్తాల యూరి యా జిల్లా రైతాంగం వినియోగిస్తోంది. పీఏసీఎస్‌లు, మార్క్‌ఫెడ్‌ల ద్వారా కేవలం 20 శాతం మాత్రమే ప్రభుత్వ ధర రూ.285 కు రైతులకు అందుతోంది. మిగిలిన 80 శాతం రైతు వినియోగించే యూరియా బ్లాక్‌మార్కెట్‌లో రూ.350కు బస్తా కొనుగోలు చేసి రూ.65 అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇలా రైతుల జేబుల్లో నుంచి ఒక్క యూరియా ద్వారానే ఎరువుల వ్యాపారులు సుమారు రూ.10కోట్లకు పైగా దోపిడీకి ఈ ఒక్క సీజన్‌లోనే పాల్పడుతున్నారు. యథేచ్ఛగా అధిక ధరకు యూరియా అమ్మకాలు జరుగుతుంటే జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీ, మంత్రులు ఏం చేస్తున్నట్లు అని జిల్లా రైతాంగం ప్రశ్నిస్తోంది. పలువురు రైతులు యూరియా బ్లాక్‌మార్కెట్‌పై ఎమ్మెల్యేల దృష్టికి, మంత్రుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం శూన్యమని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రతిపక్ష వైసీపీ కూడా యూరియా బ్లాక్‌మార్కెట్‌పై అధికారపక్షాన్ని ప్రశ్నించిన దాఖలాలు లేవు. రైతుసంఘాలు మాత్రం యూరియా అధక ధరలపై ఆందోళన చేస్తున్నా ఫలితం దక్కడం లేదు.



లారీలో నుంచి ఎరువుల బస్తాలు దించుతున్న హమాలీలు

ఆయిల్, గ్యాస్ నిక్షేపాల కోసం అన్వేషణ

కందుకూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఓ వైపు సముద్రతీరంలో రామాయపట్నం పోర్టుకు (నెల్లూరు జిల్లా) అనుబంధంగా పరిశ్రమల కోసం భూసేకరణ మరోవైపు వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాల్లోని పశ్చిమ ప్రాంతంలో ఐరన్ ఓర్ నిక్షేపాల ఉనికిని గుర్తించగా మరోవైపు ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో ఆయిల్, గ్యాస్ నిక్షేపాల కోసం అన్వేషణ కొనసాగుతోంది. గత వారం, పదిరోజులుగా కందుకూరు ప్రాంతంలో పదులసంఖ్యలో డ్రిల్లింగ్ యంత్రాలు పొలాల్లో ఆయిల్ కోసం అన్వేషణలో భాగంగా బోర్లు వేస్తున్నాయి. నెల్లూరు నుంచి ఒంగోలు వరకు ఐదు వరుసలో ఆయిల్ నిక్షేపాల కోసం ముమ్మరంగా డ్రిల్లింగ్ చేస్తున్నారు. ముందుగా ఆయిల్ నిక్షేపాల ఉనికిని తెలిపే జియోగ్రాఫికల్ సర్వే ఆధారంగా సర్వేబృందం వెదురు మేకులతో పాయింట్లు పెట్టుకుంటూ వెళ్తుండగా ఆయా పాయింట్ల వద్ద 80 అడుగుల లోతున బోరు పాయింట్లు వేస్తున్నారు. ప్రతి అర కిలోమీటరుకు ఒక లైను వంతున 5 లైన్లు ఏర్పాటు చేయగా ఆ లైన్లలో యాభై మీటర్లు, వంద మీటర్లకు ఒకచోట బోరు పాయింట్లు వేస్తుండటం విశేషం. ఇందుకోసం బీహార్, మధ్యప్రదేశ్, తమిళనాడు ప్రాంతాల నుంచి 50కిపైగా బోరు పాయింటు మిషన్లు తెప్పించారు. కందుకూరు, పొన్నలూరు, వలేటివారిపాలెం, లింగసముద్రం తదితర మండలాల్లో గుర్తించిన రేఖాంశంలో ఈ బోర్లు వేస్తున్నారు. 80 అడుగుల లోతున వేస్తున్న బోర్లలో తదుపరి అన్వేషణలో భాగంగా సాంకేతిక సిబ్బంది ఆధునిక యంత్రాలతో పరిశీలన చేస్తారని ఆ యంత్రాలతో భూమిలోపలకు 2 కి.మీ వరకు ఆయిల్, గ్యాస్ నిక్షేపాలను గుర్తించే అవకాశం ఉందని బోర్లు వేస్తున్న సిబ్బంది చెబుతున్నారు.

ఖాకీ ఉద్యోగానందం

కానిస్టేబుల్ పరీక్షల ఫలితాలు విడుదల

నెల్లూరు (క్రైం), ఆగస్టు 1 (ఆంధ్ర జ్యోతి) : వైసీపీ పాలనలో 2022 సంవత్సరంలో పోలీసు శాఖలో కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులో భాగంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాకు 160 పోస్టులను కేటాయించింది. 2023 జనవరి 22వ తేది ప్రాథమిక పరీక్ష నిర్వహించగా జిల్లా నుంచి 19,551 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఆ తర్వాత దేహదారుఢ్య పరీక్షల విషయం పట్టించుకోలేదు. దీంతో నియామక ప్రక్రియ సందిగ్ధంలో పడింది. అయితే గతేడాది కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రక్రియను కొనసాగించింది. ప్రాథమిక పరీక్షలో అర్హత పొందిన వారికి ఈ ఏడాది జనవరిలో దేహదారుఢ్య పోటీలు నిర్వహించింది. వాటికి 3855 మంది పురుషులు, 835 మంది మహిళలు హాజరయ్యారు. ఆ పరీక్షల్లోనూ అర్హత సాధించిన అభ్యర్థులకు జూన్ 1వ తేదీ మెయిన్స్ పరీక్ష నిర్వహించింది. తుది ఫలితాలను రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత శుక్రవారం విడుదల చేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సంబంధించిన 160 మందితో తుది జాబితాను ప్రకటించారు. వీరికి ఇక నియామక ఉత్తర్వులిచ్చి పోస్టింగ్ ఇవ్వడమే మిగిలి ఉంది. కాగా, వైసీపీ ప్రభుత్వంలో మొదలైన ప్రక్రియను కూటమి ప్రభుత్వం పూర్తి చేసినందుకు కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేట్ ఆసుపత్రులు పీ-4 పథకానికి సిద్ధం కావాలి

● ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యం పీ-4 పథకంలో పేద కుటుంబాలను ఎన్నుకుని బంగారు కుటుంబాలకు మార్గదర్శకులుగా తీర్చిదిద్దాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత పిలుపునిచ్చారు. శుక్రవారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో కార్పొరేట్ ఆసుపత్రుల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నచ్చిన నిరుపేద కుటుంబాన్ని ఎంపిక చేసుకుని పీ-4 విధానంలో ఆయా కుటుంబాలను తీర్చిదిద్దాలని సూచించారు. ఇందులో బలవంతం లేదని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలని, స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కోరారు. ఎంపిక చేసుకున్న కుటుంబాల వివరాలు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. నారాయణ ఆసుపత్రి పరిపాలన అధికారి సుధీర్ ముందుకు వచ్చి బంగారు కుటుంబ మార్గదర్శకులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్, డీఎస్ఎంవో డాక్టర్ సురేంద్ర, డెమో కనకరత్నం, ఎపిడమాలజిస్ట్ డాక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రుల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుజాత

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా శోభారాణి

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ(ఎఫ్ఏసీ)గా శోభారాణిని ప్రభుత్వం నియమించింది. ఆమె సాంఘిక సాంక్షేమ శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీగా ఉన్న శ్రీనివాసులు సెలవుపై వెళ్ల టంతో శోభారాణికి అదనపు బాధ్యతలు అప్పగించారు.



మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

జగన్ జైలుకెళ్లడం ఖాయం

● నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : లిక్కర్ స్కామ్‌లో మాజీ సీఎం జగన్ త్వరలో జైలుకెళ్లటం ఖాయమని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి జోస్యం చెప్పారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారు, తప్పు చేసిన వారికి జైలు జీవితం తప్పదని అన్నారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో కరోనా సమయంలో పేదలకు కూరగాయలు పంచితే అక్రమ కేసులు బనాయించారని చెప్పారు. నెల్లూరు సిటీతోపాటు కావలి, కందుకూరులో తనపై 64 అక్రమ కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ముఖం పెట్టుకుని వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటనకు వచ్చారని ప్రశ్నించారు. మైనింగ్‌తో దోచుకుని జైలులో ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పరామర్శించటం సిగ్గుచేటన్నారు. తల్లిని, చెల్లిని వదిలేసిన జగన్‌కు మహిళలంటే గౌరవం లేదని విమర్శించారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రసన్న కుమార్‌రెడ్డిని పరామర్శించేందుకు జగన్ రావటం దారుణమన్నారు. జిల్లాలోని వైసీపీ నాయకులు గత ప్రభుత్వంలో ఇష్టమొచ్చినట్లు దోచుకున్నారని, చివరకు కరోనా సమయంలో ఇంజక్షన్‌లు సైతం అమ్ముకున్నారని మండిపడ్డారు. జగన్ త్వరలో లిక్కర్‌స్కామ్‌లో జైలు కెళ్లటం ఖాయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్, ప్రశాంత్, కువ్వా రఘు బాలాజీ, జహీర్, మొయినుద్దీన్, మహేంద్రరెడ్డి, అంచూరు శ్రీని వాసులు నాయుడు పాల్గొన్నారు.

జగన్ పర్యటనలో మరో కేసు నమోదు

నెల్లూరు (క్రైం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటనకు సంబంధించి శుక్రవారం దర్గామిట్ట పోలీసులు మరో కేసు నమోదు చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాల ఉత్తరం వైపు ప్రహరీ గోడ కొంత భాగాన్ని గుర్తుతెలియని వ్యక్తులు కూల్చి వేశారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు శుక్రవారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీసులు కేసు నమోదు చేసి, సాంకేతికత ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. కాగా, జగన్ పర్యటనకు సంబంధించి ఇప్పటికే రెండు కేసులు నమోదై ఉన్నాయి.